అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

శుక్రవారం 8-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 199 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50





## ఆదిత్య-ఎల్ 1 సెల్ఫీ అద్భుతం

- ఒకే ఫ్రేమ్‌లో భూమి-చంద్రుడు..

బెంగళూరు: సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య-ఎల్ 1 విజయవంతంగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలోనే భానుడి దిశగా పయనిస్తోన్న మన ఆదిత్య ఓ సారి పుడమి ని చూసి మురిసి ...2లో

# 12న మరో వంద మహిళా ఆరోగ్య క్లినిక్స్

## 15నుంచి 9 మెడికల్ కళాశాలల్లో తరగతులు


- ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- వైద్యకళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేయండి : మంత్రి హరీశ్‌రావు

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ఈనెల 12న మరో వంద మహిళ ఆరోగ్య క్లినిక్స్ ప్రారంభించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ క్లినిక్స్‌లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళా వైద్య సిబ్బంది ఉంటూ, 8 రకాల ప్రధాన వైద్య సేవలు అందిస్తారనివైద్యారోగ్యశాఖ మంత్రి టీ హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుతం ఈ క్లినిక్స్ సంఖ్య రాష్ట్రంలో 272 నుంచి 372కి పెరుగుతుందని వివరించారు. అలాగే 5,204 స్టాఫ్ నర్స్ రిక్రూట్‌మెంట్ ఫలితాలు త్వరగా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంల పీఆర్సీ, పాత బకాయిలు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను ...11లో


మేఘాలయ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం కేసీఆర్

**ప్రగతిభవన్లో మేఘాలయ సీఎం** 11లో




# ఎందుకీ ఆర్భాటం?

- జీ-20పై నిలదీస్తున్న అంతర్జాతీయ మీడియా
- మోడీ వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేందుకేనని వ్యాఖ్య


జీ..20 సమావేశాలతో జనం కష్టాలు

దేశ రాజధానిలో జీ-20 సదస్సు నిర్వహణకు సర్వం సిద్ధమవుతోంది. అనేక అంతర్జాతీయ వార్తా సంస్థలు దీనిపై కథనాలు, విశ్లేషణలు వండి వారుస్తున్నాయి. జీ-20 అధ్యక్ష పదవిని మోడీ ప్రభుత్వం ఎలా ఉపయోగించుకుంటోందో, వచ్చే సంవత్సరం జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం ఇప్పటి నుండే ప్రచారాన్ని ప్రారంభించి ఓటర్లకు వల వేసేందుకు ప్రధానికి ఈ వేదిక ఎలా ఉపయోగపడుతుందో విశ్లేషిస్తూ వార్తలు అందిస్తున్నాయి.

న్యూఢిల్లీ : జీ-20 సదస్సు నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత పర్యటనను దృష్టిలో పెట్టుకొని ఆయన భద్రతా సలహాదారు జేక్ సులివాన్ పత్రికా గోష్టిని ఏర్పాటు చేశారు. భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు, భావ ప్రకటనా స్వేచ్ఛకు అవరోధాలు, హింసాత్మక ఘటనలు, అరెస్టులు వంటి అంశాలను మోడీతో జరిపే సమావేశంలో బైడెన్ ప్రస్తావిస్తారా అని అడిగిన ప్రశ్నకు జేక్ సమాధానం దాటవేశారు. కాగా ప్రమాదకరమైన మోడీ మెజారిటీవాదాన్ని పశ్చిమ దేశాలు పట్టించుకోబోవని 'గార్డియన్' పత్రిక రాసింది. మోడీని, ఆయన రాజకీయ విశ్వాసాలను డొనాల్డ్ ట్రంప్ (అమెరికా), మారిన్ లీ పెన్ (ఫ్రాన్స్), విక్టర్ హార్బన్ (హంగరీ)ల ఆలోచనలతో పోల్చింది. మోడీ తన సొంత ప్రతిష్టను ఇనుమడింపజేసుకునేందుకు జీ-20 సదస్సును వాడుకుంటున్నారని, దీనిపై పెద్ద ఎత్తున ప్రకటనలు గుప్పిస్తున్నారని 'న్యూయార్క్ టైమ్స్' వ్యాఖ్యానించింది. 'భారతదేశంలో పేదలు రోడ్ల పైన, అండర్‌పాస్‌లలో ...11లో

**నేడు మీడియా స్వేచ్ఛపై ఎం-20 సదస్సు**

వివరాలు 11లో..






## సదస్సు ఏర్పాటుకు రూ.4,100 కోట్లకు పైనే..

జీ-20 సదస్సు కోసం ప్రభుత్వం రూ.4,100 కోట్లకు పైనే కేటాయించిందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొనగా, నెల రోజుల ముందు నుండే రాజధానిలో కూల్చివేతలు ప్రారంభించి వేలాది మందిని వీధులపాలు చేసిందని సీఎన్ఎన్ ఓ నివేదికలో వివరించింది. మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను 'ఫారిన్ అఫైర్స్' మేగజైన్ ప్రస్తావించింది. దీనిని అడ్డుకోవడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించింది. దేశంలో మైనారిటీలపై కొనసాగుతున్న వివక్షను 'ఫైనాన్షియల్ టైమ్స్' ఎత్తిచూపింది. ఇప్పటి వరకూ దేశంలో ఇలాంటి అంతర్జాతీయ సమావేశాలు అనేకం జరిగినప్పటికీ సాధించింది శూన్యమని, సమావేశాల చివరలో సంయుక్త ప్రకటనను కూడా విడుదల చేయలేకపోయారని 'అసోసియేటెడ్ ప్రెస్' వార్తా సంస్థ గుర్తు చేసింది.

## ఇది ఆసియా శతాబ్దం!

- సహకార విస్తరణే లక్ష్యం
- సదస్సులో 12 సూత్రాలను ప్రతిపాదించిన మోడీ

వివరాలు 2లో..

## 18 నుంచి గణేశ్ ఉత్సవాలు

### శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు

- ట్రై పోలీస్ కమిషనరేట్ల సీపీల భేటీ
- జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, ఆర్టీసీ, అగ్నిమాపక, విద్యుత్, హెచ్ఎండీఏ అధికారుల హాజరు



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో ట్రై పోలీస్ కమిషనరేట్ల అధికారులు అప్రమత్తమయ్యారు. గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు దృష్టి సారించారు. భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. దాదాపు 15వేలకుపైగా చిన్నా పెద్దా గణేష్ విగ్రహాలను ఈసారి ప్రతిష్టాపన ...11లో

## గోడ కూలి ముగ్గురు కూలీలు మృతి

### నిర్మాణంలో ఉన్న భవనంలో ఘటన..

- మరో ఘటనలో...భవనం పై నుంచి పడి బాలుడు మృతి




**నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/ కుత్బుల్లాపూర్**

నిర్మాణంలో ఉన్న భవనం ఆరో అంతస్తుపై ఉన్న గోడ కూలడంతో కిందపడి ముగ్గురు కూలీలు మృతిచెందారు. ఈ ఘటన హైదరాబాద్ కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్టలో దాసరి సంతోష్, దాసరి శ్రీరామ్ సర్వే నెంబర్ 176పీ, 177పీ, 188పీలోని 668 గజాలలో భవనం నిర్మాణం చేపట్టారు. కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ అధికారులు స్టిల్ట్ ప్లస్ 5 అంతస్థుల ...11లో

# ధరలను నియంత్రించాలి

## సామాన్యుల అవస్థలు

- ధరల కట్టడిలో ప్రభుత్వాలు విఫలం : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

వివరాలు 2లో..



నల్లగొండలో నిరసన ప్రదర్శన

# ఉప ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్

## అందుకే ఓట్ల లెక్కింపును బహిష్కరిస్తున్నాం : త్రిపురలో వామపక్ష కూటమి

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**



త్రిపురలోని రెండు అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికల్లో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగిందని, అందుకే శుక్రవారం జరిగే ఓట్ల లెక్కింపును బహిష్కరిస్తున్నట్టు సీపీఐ(ఎం)నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రకటించింది.తాజా నివేదికల ప్రకారం, మంగళవారం జరిగిన బోక్సానగర్, ధన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వరుసగా 89.2 శాతం, 83.92 శాతం మంది ఓటర్లు ఓటు వేశారు.త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్ మాట్లాడుతూ ఉప ఎన్నికలు "పూర్తిగా రిగ్గింగ్ చేయడానికి ప్రహసనంగా తయారయ్యాయి" అని విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరు పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ".. ఈ విషయంపై మేం పోలింగ్ ప్రారంభం నుంచి ఎన్నికల సంఘం దృష్టికి పదే పదే తీసుకెళ్లాం. కానీ పెద్ద ఎత్తున జరిగిన రిగ్గింగ్‌ను నిరోధించేందుకు ఎలాంటి సానుకూల చర్యలు తీసుకోకపోవడం విచారకరం. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల్లో జరిగిన రిగ్గింగ్ ఎన్నికలను ఉపసంహరించుకుని తాజాగా ఎన్నికలను ప్రకటించాలని త్రిపుర లెఫ్ట్ ఫ్రంట్ డిమాండ్ చేస్తోంది. అయితే ఆశ్చర్యకరంగా 24 గంటలు గడిచినా ఇంకా ఎన్నికల సంఘం కదలలేదు. ఎన్నికల సంఘం ఉద్దేశం స్పష్టంగా ఉంది" అని విమర్శించారు.బెదిరింపులు, హింసకు సంబంధించిన ముందే కేంద్ర ఎన్నికల సంఘం జోక్యాన్ని వామపక్ష ...2లో

## విద్యాశాఖలో 'కమాండ్ కంట్రోల్ సెంటర్'

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం

- నెలాఖరులోగా ప్రారంభం
- ఇకపై అన్ని రకాల కేంద్రీకృత పర్యవేక్షణ
- విద్యార్థుల నమోదు, హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలు సేకరణ
- మౌలిక వసతులపైనా నిర్దిష్ట సమాచారం

వివరాలు 2లో..

## సనాతన రగడ అందుకే..?

- మణిపూర్ హింస, అవినీతిని కప్పిపుచ్చుకోవటానికే..: తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్
- ప్రధాని తెలిసే మాట్లాడుతున్నారా..?: సీఎం స్టాలిన్

వివరాలు 2లో..



# ఏడుపాయల సాక్షిగా.. మెదక్ బీఆర్ఎస్‌లో కొట్లాట

## ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డి టార్గెట్‌గా ఆరోపణలు

- అవినీతి చేయలేదంటూ దేవేందర్‌రెడ్డి వివరణ
- రెబల్‌గా బరిలో ఉంటామంటున్న అసమ్మతి నేతలు
- అసమ్మతి నాయకులకు మైనంపల్లి అండదండలు
- వనదుర్గామాత సాక్షిగా ప్రమాణాల పరంపర
- వివాదానికి దారి తీసిన ఈవో అత్యుత్సాహం

**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

"పసుపు బట్టలతో వనదుర్గమ్మ ముందు ప్రమాణం చేసి చెబుతున్నాం. దేవేందర్‌రెడ్డి చేసిన పలు అవినీతికి సంబంధించిన ఆధారాలను దుర్గమ్మ ముందు పెట్టాం.. ఇక అంతా అమ్మే ...11లో



# దేశాన్ని విచ్ఛిన్నం చేయడమే బీజేపీ లక్ష్యం

## దేశ సమగ్రత మాతోనే సాధ్యం

- మోడీ, అమిత్‌షా ఆటలు సాగనివ్వం : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- భారత్ జోడో యాత్రకు ఏడాది పూర్తి
- సోమాజిగూడ నుంచి నెక్లెస్‌రోడ్ వరకు భారీ ప్రదర్శన

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

మతం, కులం పేరుతో దేశాన్ని విచ్చినం చేయడమే బీజేపీ పంతంగా కనిపిస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్దిపొందేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేక్ ఇన్ ఇండియా అన్న ప్రధాని మోడీ...ఇండియా పేరునే మార్చేస్తున్నారని విమర్శించారు. దేశ సమైక్యత, సమగ్రతే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని కాపాడేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ 'భారత్ జోడో యాత్ర ' చేపట్టారని గుర్తు చేశారు. యాత్రకు గురువారంతో ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పాదయాత్రలు చేపట్టింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ నుంచి నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరమ్మ విగ్రహం దాకా భారీ ర్యాలీ నిర్వహించారు. భారత్ జోడో అంటూ నినదించారు. బీజేపీ, మోడీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెద్ద పెద్ద జెండాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అనంతరం నిర్వహించిన సభలో రేవంత్ మాట్లాడుతూ 2014లో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక దేశ ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడిందన్నారు. దేశంలో దళితులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యో గాలు ఇస్తానన్న మోడీ మాట తప్పారని ఆరోపిం చారు. నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆపలేని పరిస్థితి నెలకొందన్నారు. 'ఇండియా కూటమి'కి భయపడే దేశం పేరు మారుస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోడీకి చేతనైతే ఇండియా కూటమిని ఎదు ర్కోవాలని సవాల్ విసిరారు. పెరుగుతున్న ధరలు, మణిపూర్ పరిణామాలపై మోడీ పార్లమెంటులో చర్చించడంలేదని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ ను తిట్టడానికే ఆయన ఎక్కువ సమయం కేటాయి స్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఏం చేసిందన్న మోడీకి...గుజరాత్‌లో మోడీ తిరుగుతున్న ఎయిర్ పోర్ట్ కాంగ్రెస్ నిర్మించిందేనని గుర్తు చేశారు. నిజాం నవాబుల నుంచి తెలంగాణకు విముక్తి కలిగించింద న్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం కల్పించింది కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధ్యక్షు లు వల్లభభాయ్ పటేల్ కాదా? పాకిస్తాన్, బంగ్లాదేశ్, భారతదేశం అభివృద్ధిని లెక్క కడదామా? అని ప్రశ్నించారు. 'విభజించు- పాలించు' అనే విధానం తో దేశాన్ని విచ్చిన్నం చేసే కుట్ర బీజేపీ చేస్తున్నదని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ పొలిమేరల దాకా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కారు ఢిల్లీకి వెళ్లి కమలంగా మారుతోందని ఎద్దేవా చేశారు. లక్ష కోట్లు దోచిన కేసీఆర్‌కు మద్దతు తెలంపడంలో ఎంఐఎం ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించినం దుకా కాంగ్రెస్‌ను ఓడించాలంటున్నారని అసదుద్దీన్ ను నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర చేసి కాంగ్రెస్ సభను జరగకుండా చేస్తున్నాయని విమర్శించారు. 17న నిర్వహించబోయే సభకు ఉప్పెనలా తరలివచ్చి హైదరాబాద్ నగరాన్ని కప్పేయాలని పిలుపునిచ్చా రు. సీడబ్ల్యూసీ సమావేశాల భద్రత కోసం పోలీసుల ను అడిగితే స్పందించడం లేదన్నారు. మోడీ, కేసీఆర్ అధికారం అడ్డంపెట్టుకుని అధికారులను భయపెడు తున్నారని విమర్శించారు. ర్యాలీలో ఏఐసీసీ ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్ర మార్క, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, అంజన్‌కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరీ, మన్సూర్ అలీ ఖాన్, అధికార ప్రతినిధి కృష్ణతేజ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు, కార్పొరేటర్ విజయారెడ్డి, నగర నాయకులు రోహిన్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఫిరోజ్‌ఖాన్, నగేష్ ముది రాజ్, బొల్లు కిషన్, కోట నీలిమా తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య-ఎల్ 1 సెల్ఫీ అద్భుతం

(మొదటిపేజీ తరువాయి)

పోయింది. ఈ సమయంలోనే తొంగి చూస్తున్నట్టు చందమామ కూడా కనిపించాడు. ఆ దృశ్యాన్ని క్లిక్ మనిపించి పనిలో పనిగా నేను క్షేమమే అన్నట్లు ఓ సెల్ఫీ కూడా తీసుకొని ఇస్రో కు పంపింది. ఆ అద్భుత దృశ్యాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఎక్స్ (ట్విటర్)లో షేర్ చేసింది. సెప్టెంబరు 4వ తేదీన ఆదిత్య-ఎల్ 1లోని కెమెరా ఈ సెల్ఫీ తీసినట్లు ఇస్రో వివరించింది. ఈ స్వీయ చిత్రంలో ఆదిత్య-ఎల్ 1లోని విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వీఈఎల్‌సీ), సోలార్ అల్ట్రావయోలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (ఎస్‌యూఐటీ) కన్పించాయి. దీంతో పాటు భూమి, చంద్రుడు ఒకేసారి కన్పించిన దృశ్యాలను కూడా ఆదిత్య-ఎల్ 1 క్లిక్‌మనిపించింది. ఈ చిత్రాలతో కూడిన వీడియోను ఇస్రో సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. "భూమి-సూర్యుడి మధ్యలోని లగ్రాంజ్ పాయింట్ (ఎల్‌ఐ పాయింట్)ను ప్రయాణంలో ఆదిత్య-ఎల్ 1 వీక్షించిన దృశ్యాలివి" అని ఇస్రో రాసుకొచ్చింది.

ఆదిత్య-ఎల్ 1లోని విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ సూర్యుడి కరోనా, స్పెక్ట్రోస్కోపీని అధ్యయనం చేయనుంది. ఇక ఫొటోస్పియర్, క్రోమోస్పియర్‌ను పరిశీలించనుంది. సెప్టెంబరు 2న ఇస్రో ఈ ప్రయోగం చేపట్టింది. ఇటీవలే రెండోసారి భూకక్ష్య పెంపు విన్యాసాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ విన్యాసంతో ఆదిత్య-ఎల్1 ఉపగ్రహం 282కి.మీ 40, 225 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశించింది. తదుపరి కక్ష్య పెంపు విన్యాసాన్ని సెప్టెంబరు 10న చేపట్టనున్నారు. ఆదిత్య-ఎల్ 1 ఉపగ్రహం నాలుగు నెలలపాటు ప్రయాణించి భూమి నుంచి సూర్యుడి దిశగా ఉన్న 'ఎల్1' (లగ్రాంజ్) పాయింట్‌ను చేరుకోనుంది. 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని ఈ ప్రదేశంలోకి భారత్ చేరుకోవడం ఇదే తొలిసారి అవుతుంది. ఈ ప్రదేశం నుంచి ఎలాంటి అవరోధాల్లేకుండా సూర్యుడిని నిరంతరం అధ్యయనం చేసే వీలుంది. ఇందులో ఏడు రకాల పరిశోధన పరికరాలు న్నాయి. ఇవి సూర్యుడి పొరలైన ఫొటో స్పియర్, క్రోమోస్పియర్ సహా వెలుపల ఉండే కరోనానూ అధ్యయనం చేస్తాయి. సౌర జ్వాలలు, సౌర రేణువులు, అక్కడి వాతావరణం గురించి ఎన్నో అంశాలను శోధిస్తాయి. వీటి వల్ల సౌర తుపానుల నుంచి అంతరిక్షంలోని ఉపగ్రహాలు, ఇతర పరిశోధనాశాలలను కాపాడుకోవడానికి వీలవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## ఉప ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్

(మొదటిపేజీ తరువాయి)

కూటమి కోరింది. బోక్సానగర్ స్థానం నుంచి సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సంసుల్ హక్ మరణం, ధన్‌పూర్ నుంచి బీజేపీ టిక్కెట్‌తో పోటీ చేసి గెలుపొందిన కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి ప్రతిమా భూమిక్ రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. కాంగ్రెస్, టిప్రా మోతా రెండూ ఈ ఎన్నికలలో పోటీకి దూరంగా ఉన్నాయి. ఈసారి రంగంలో అధికార బీజేపీ, ప్రతిపక్ష సీపీఐ(ఎం) మాత్రమే ప్రధాన పోటీదారుగా ఉన్నాయి.

బాక్సానగర్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థి మిజాన్ హుస్సేన్‌పై బీజేపీ అభ్యర్థి తఫజ్జల్ హుస్సేన్ పోటీ చేశారు. ధన్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి బిందు దేబ్‌నాథ్, సీపీఐ(ఎం) అభ్యర్థి కౌశిక్ దేబ్‌నాథ్ ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు.

## ప్రతిపక్షాలు భారత్‌ను బద్నాం చేస్తున్నాయి

- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ప్రతిష్టాత్మక జీ-20 సదస్సు ఢిల్లీలో జరుగుతున్నదనీ, వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులు ఇక్కడికి వచ్చిన సందర్భంలో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనులకు పాల్పడుతున్నాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం విమర్శించారు. గురవారంనాడాయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశాభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించట్లేదనీ, గ్లోబల్ లీడర్‌గా అవతరించిన ప్రధాని నరేంద్రమోడీని అనవసరంగా ఆడిపోసుకుంటున్నారని అన్నారు.

సనాతన ధర్మాన్ని కూడా అవహేళన చేస్తూ, దుర్భాషలాడుతున్నారనీ, ప్రజాస్వామ్యంలో అన్ని మతాలను సమానంగా చూడాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలదనీ, కానీ ప్రతిపక్ష పార్టీల ప్రవర్తన దీనికి భిన్నంగా ఉందని ఆరోపించారు. భారత్ పేరుపై కూడా అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ అవినీతి ఢిల్లీ దాకా పాకిందనీ, బీఆర్ఎస్, డీఎంకే నేతలు ప్రతి ప్రభుత్వ పథకంలో కమీషన్ దండుకుంటున్నారని ఆరోపణలు చేశారు.

# ఇది ఆసియా శతాబ్దం !




**జకార్తా :** స్వేచ్ఛ, పారదర్శకతలతో కూడిన ఇండో-పసిఫిక్ ప్రాంతం దిశగా సాధించాల్సిన పురోగతి, అంతర్జాతీయ పేద దేశాల వాణిని వినిపించాల్సిన ఆవశ్యకత గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం ఇవి అవశ్యమని అన్నారు. ఆసియాన్, భారత్ మధ్య సహకారాన్ని మరింత విస్తరించుకోవాల్సి వుందని అన్నారు. ఇక్కడ జరుగుతున్న ఆసియాన్ సదస్సులో మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా 12 పాయింటతో కూడిన ప్రతిపాదనలను ఆయన సదస్సుకు అందచేశారు. అనుసంధానత, వాణిజ్యం నుండి డిజిటల్ పరివర్తన వరకు వివిధ రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించారు.

అభివృద్ధికి కేంద్రంగా ఆసియాన్ వుందని, భారత్, ఆసియాన్ గ్రూపుతో కలిసి పనిచేయడానికి కట్టుబడి వుందని మోడీ చెప్పారు. "21వ శతాబ్ద ఆసియా శతాబ్దం. ఇది మన శతాబ్దం. ఇందుకోసం, మానవాళి సంక్షేమం కోసం కోవిడ్ అనంతర కాలంలో నిబంధనల ప్రాతిపదిక వ్యవస్థను నిర్మించుకోవాల్సిన అవసరం వుందని అన్నారు. ఆసియాన్, భారత్‌లు విలువలను, ప్రాంతీయ సమైక్యతను, శాంతి, సౌభాగ్యాలను పంచుకుంటున్నాయని అన్నారు. మన చరిత్ర, భౌగోళికతలు ఆసియాన్, భారత్‌లను కలుపుతున్నాయన్నారు. బహుళ ధృవ ప్రపంచం పట్ల మనకు గల నమ్మకం కూడా మనల్ని కలిపి వుంచుతోందన్నారు. ఈనాడు అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్నప్పటికీ ప్రతీ రంగంలోనూ మన పరస్పర సహకారంలో పురోగతి సాధిస్తునే వున్నామన్నారు.

బహుళ నమూనాలతో కూడిన అనుసంధానతను ఏర్పాటు చేయాలని, ఆగ్నేయాసియా, భారత్, పశ్చిమాసియా, యూరప్‌లను అనుసంధానిస్తూ ఆర్థిక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఆసియా భాగస్వామ్య దేశాలతో భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పంచుకోవాల్సి వుందని అన్నారు. తీవ్రవాదం, తీవ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సహాయం, ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం వంటి వాటిపై సమిష్టి పోరాటం జరపాలని ప్రధాని పిలుపునిచ్చారు.

సముద్ర జలాల సహకారంపై, ఆహార భద్రతపై రెండు సంయుక్త ప్రకటనలు సదస్సులో ఆమోదించారు. డిజిటల్ పరివర్తన, ఆర్థిక అనుసంధానత రంగాల్లో సహకారంపై దృష్టి కేంద్రీకరించేందుకు ఆసియాన్-భారత్ నిధిని ఏర్పాటు చేయడం కూడా మోడీ చేసిన ప్రతిపాదనల్లో వుంది. ఆసియాన్, తూర్పు ఆసియా ఆర్థిక పరిశోధనా సంస్థను పునరుద్ధరించేందుకు మద్దతునివ్వడంపై ప్రకటన చేయాలని మోడీ కోరారు.

# ధరలను నియంత్రించాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు.. ధరల నియంత్రణలో వైఫల్యాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రదర్శనలు తీశారు. తక్షణం ధరల పెరుగుదలను నియంత్రించాలని నేతలు డిమాండ్ చేశారు. సామాన్యులు రెండు పూటలా తినలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.**




వనపర్తిలో...

**నవతెలంగాణ- విలేకరులు**

నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం నుంచి పెద్ద గడియారం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోలు ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలైన ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, మూడెకరాల భూమి అందలేదన్నారు. సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో, మోత్కూరులో ప్రదర్శన నిర్వహించారు.

మహబూబ్‌నగర్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తూనే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట రూరల్, కల్వకుర్తి మండల కేంద్రాల్లో నిరసన తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంపన్నులకు కొమ్ముకాస్తూ పేదవారిపై అన్ని రకాలుగా భారాలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలను హద్దూ అదుపు లేకుండా పెంచుతున్నారన్నారు. పేదరికంలో మగ్గుతున్న ప్రజలపై పన్నుల భారం మరింత పెంచి దారిద్ర్యంలోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వారావుపేటలో ర్యాలీ చేపట్టారు. జూలూరుపాడులో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.

నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు కూడలిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. దేశంలో 60 శాతంగా ఉన్న యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కరువై తీవ్ర ఇబ్బందులు పడుతోందన్నారు. హనుమకొండ అంబేద్కర్ విగ్రహం నుంచి కాళోజి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

మహబూబాబాద్, జనగామ జిల్లా కేంద్రాల్లో ధర్నా, రాస్తారోకో చేశారు. మహబూబా బాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో గాంధీ సెంటర్లో రాస్తారోకో చేశారు. జనగామ జిల్లా కేంద్రం లోని నెహ్రూ పార్క్ వద్ద ధర్నా చేశారు. దీంతో సిద్దిపేట జనగామ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో సీపీఐ(ఎం) నాయకులకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం తోపులాట జరిగింది. లింగాలఘనపురం మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. పాలకుర్తి మండల కేంద్రం బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో చేపట్టారు.

## 24 గంటలు కరెంటు ఇస్తే రాజీనామా చేస్తా

### బీజేపీ నేత ఈటల రాజేందర్

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఇస్తున్నట్టు రుజువు చేస్తే, తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ అన్నారు. గురువారంనాడిక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదనీ, రూ. 25 వేల కోట్ల రుణాలు ఏకకాలంలో మాఫీ చేస్తామని ప్రకటించి ఐదేండ్లు గడిచినా అమలు చేయలేదని ఆరోపించారు. రైతులకు కొత్త రుణాలు ఇవ్వట్లేదనీ, ప్రభుత్వం భూములమ్మి ఖజానా నింపుకొనే పనిలో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో హోంగార్డుల పరిస్థితి దయనీయంగా ఉందనీ, ఐదు నెలలుగా వారికి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.



## సనాతన రగడ అందుకే..?

**చెన్నై :** సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ పునరుద్ఘాటించారు. బీజేపీ నేతలు తనపై దాఖలు చేస్తున్న కేసులు, ఫిర్యాదులను న్యాయపరంగా ఎదుర్కొంటానని పేర్కొన్నారు. తనపై కాషాయ నేతల ఎదురుదాడి, కేసుల నమోదును ప్రస్తావిస్తూ బీజేపీ నేతల మనుగడ ఇదేనని, వారికి ఎలా ప్రజల్లో ఉండాలో తెలియదని మండిపడ్డారు. తన తలపై రివార్డు ప్రకటించిన అయోధ్య ప్రధాన పూజారి ఉదంతంపై స్పందిస్తూ స్వామీజీల దిష్టిబొమ్మలు దగ్ధం చేయడం, కేసులు నమోదు చేయడం వంటివి చేయవద్దని డీఎంకే శ్రేణులను ఉదయనిధి స్టాలిన్ కోరారు. తనపై నమోదైన కేసులను తాను న్యాయపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. మణిపూర్‌లో చెలరేగిన ఘర్షణల్లో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం, 7.5 లక్షల కోట్ల అవినీతి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే మోడీతో పాటు మోడీ బృందం సనాతన ధర్మంపై తాను చేసిన వ్యాఖ్యలపై రాద్ధాంతం చేస్తోందని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిదేండ్లుగా చేసిందేమీ లేదు. కరెన్సీ నోట్ల ఉపసంహరణ, గుడిసెలు కనిపించకుండా గోడలు కట్టడం, నూతన పార్లమెంట్ భవనం నిర్మించడం, దేశం పేరు మార్పుపై హంగామా చేయడం మినహా మోడీ ప్రజల కోసం చేసిందేమీ లేదని ఉదయనిధి స్టాలిన్ దుయ్యబట్టారు.

**తెలుసుకోకుండా పీఎం మాట్లాడటం తగదు. సీఎం స్టాలిన్**

'సనాతన ధర్మం'పై ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ గురువారం సమర్థించారు. ఏ మతాన్ని, మత విశ్వాసాలను దెబ్బతీసే ఉద్దేశం తన కుమారునికి లేదని అన్నారు. సనాతన ధర్మం పేరిట బోధించే అమానవీయ సూత్రాలు.. షెడ్యూల్డ్ కులాలు, తెగలు , మహిళల పట్ల చూపుతున్న వివక్షను గురించి మాత్రమే ఉదయనిధి వ్యాఖ్యానించారని అన్నారు. కొంతమంది కులం పేరుతో వివక్షను ప్రచారం చేస్తున్నారని, ఇప్పటికీ ఆధ్యాత్మిక వేదికలపై మహిళలను కించపరుస్తున్నారని విమర్శించారు. ఈ అణచివేత సూత్రాలకు వ్యతిరేకంగా ఉదయనిధి వైఖరిని బీజేపీ అనుకూల శక్తులు సహించలేకపోతున్నాయని, దీంతో ఆయన ప్రసంగంపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

" మనం చంద్రునిపై చంద్రయాన్‌ను ప్రయోగించినప్పటికీ.. కొందరు సనాతన ధర్మం పేరుతో స్త్రీలపై అణచివేతను కొనసాగిస్తున్నారు. ఉదయనిధి ఇటువంటి అణచివేత భావజాలానికి వ్యతిరేకంగా మాత్రమే మాట్లాడారు. ఆ సిద్ధాంతాల పేరుతో నిర్వహించే ఆచారాల నిర్మూలనకు పిలుపునిచ్చారు" అని స్టాలిన్ అన్నారు. సనాతన వివక్ష పట్ల బీజేపీకి పట్టింపు లేదని ఆయన అన్నారు. యూపీకి చెందిన ఓ మత గురువు తన కుమారుడి తలపై రూ.10 కోట్ల బహుమతి ప్రకటించంపై ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అతనిపై చర్యలు తీసుకోకుండా .. తనకుమారునిపై కేసులు నమోదు చేసిందని మండిపడ్డారు. బీజేపీ సోషల్ మీడియా విభాగం ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ అబద్ధాలను విస్తృతంగా ప్రచారం చేస్తోందని.. ఉదయనిధి తమిళంలో కానీ ఇంగ్లీషులో కానీ "జాతి హత్య" అనే పదాన్ని వినియోగించలేదని, అయినప్పటికీ బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్రమంత్రి మండలి సమావేశంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ ఉదయనిధి వ్యాఖ్యలపై సరైన స్పందన అవసరమని పేర్కొనడం నిరుత్సాహపరిచిందని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఏదైనా నివేదికను తెలుసుకుని, ధ్రువీకరించుకోవడానికి ప్రధాన మంత్రికి అన్ని వెసులుబాట్లు ఉన్నాయని.. కానీ ఉదయనిధి గురించి తప్పుగా చేయబడుతున్న ప్రచారం గురించి ప్రధానికి తెలిసి మాట్లాడుతున్నారా..? తెలియక మాట్లాడుతున్నారా..? అంటూ స్టాలిన్ ప్రశ్నించారు. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనేది రాజకీయ జిమ్మిక్కు అని, ప్రతిపక్ష కూటమిలో విభేదాలు సృష్టించేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చిందని విమర్శించారు.

# విద్యాశాఖలో 'కమాండ్ కంట్రోల్ సెంటర్'



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పాఠశాల విద్యాశాఖ పరిధిలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఈనెలాఖరులోగా ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ దిశగా పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్, వైద్య ఆరోగ్య శాఖలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉన్న విషయం తెలిసిందే. అదే తరహాలో విద్యాశాఖలోనూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దానిద్వారా ఇక నుంచి అన్ని రకాలుగా పర్యవేక్షణ కేంద్రీకృతమవుతుంది. ప్రస్తుతం ఏదైనా సమాచారం కావాలంటే విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం నుంచి ఆర్జేడీలు, వారి నుంచి డీఈవోల ద్వారా ఎంఈవోలకు పంపించాలి. వారి నుంచి సమాచారం రావడానికి రోజుల సమయం పడుతున్నది. ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నది. వివరాల సేకరణ ప్రక్రియ ఆలస్యం కాకుండా త్వరితగతిన పంపేందుకు ఈ విధానం దోహదపడుతుంది. అందుకనుగుణంగానే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని వినియోగించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తున్నది. అందులో భాగంగానే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నది. దాని ఆధారంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్)ను నిక్షిప్తం చేస్తారు.

రాష్ట్రంలో 41 వేల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో సుమారు 60 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. వారి ఐరీష్‌ను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు. ఇప్పటికే క్లస్టర్ రీసోర్స్ పర్సన్ (సీఆర్పీ)ల ద్వారా ఆ పని మొదలైంది. అయితే కొత్తగా ఎవరైనా బడుల్లో చేరితే వారి వివరాలను పొందుపరచడానికి ప్రధానోపాధ్యాయులు లేదా ప్రిన్సిపాళ్లకు ఈ విధానంపై శిక్షణ ఇస్తున్నారు. దీంతో మొత్తం విద్యార్థుల వివరాలు పాఠశాల విద్యాశాఖలో అందుబాటులో ఉంటాయి. ఆ వివరాలను ఇప్పటికే చైల్డ్ ఇన్ఫోలో ఉన్న వాటితో పోల్చుతారు. ఏ ఒక్కరూ ఆ వివరాల నుంచి మిస్ కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు.

### బడులపై మరింత పర్యవేక్షణ...

కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కలిగే ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ఇకనుంచి బడులపై పర్యవేక్షణ మరింత పెరగడానికి ఇది దోహదపడుతుంది. బడుల్లో ఏయే రకమైన మౌలిక వసతులున్నాయో, కొత్తగా ఏం కావాలో తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మన ఊరు-మనబడి పథకానికి సంబంధించి పనులు, వాటి పురోగతి గురించి సమగ్రంగా సమాచారం సేకరించేందుకు ఉపయోగపడుంది. రోజువారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించేందుకు అవకాశముంటుంది. అయితే ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి 15 జిల్లాల్లో బయోమెట్రిక్ విధానం అమల్లో ఉన్నది. ఇంకోవైపు అన్ని జిల్లాల్లోనూ టీహాజరు మొబైల్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును ప్రధానోపాధ్యాయులు రోజూ పంపిస్తున్నారు. ఇప్పుడు కమాండ్ కంట్రోల్ విధానం ద్వారా హాజరును పంపించాల్సి ఉంటుంది. మధ్యాహ్న భోజనానికి ఎంత మంది విద్యార్థులు వస్తున్నారో తెలుస్తుంది. లెర్నింగ్ ఔట్‌కం, డ్రాపౌట్ల వివరాలు తెలుస్తాయి. పరీక్షల నిర్వహణ, ఫలితాలు ఎప్పటికప్పుడు విద్యాశాఖకు పంపించడానికి వీలవుతుంది. ఉపాధ్యాయులకు శిక్షణ ఎలా జరుగుతుందో, హాజరు ఎలా ఉందో సులువుగా తెలుసుకోవచ్చు. ఇంకోవైపు విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, రెండు జతల యూనిఫారాలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి వీలవుతుంది. విద్యార్థులందరికీ అందాయా? లేదా? అన్నది వెంటనే తెలుస్తుంది. దాని ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. అయితే కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటయ్యాక ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలపైనే అధికారులు కేంద్రీకరించి పనిచేసే అవకాశమున్నది. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్, మధ్యాహ్న భోజనం అమలు వంటివి కేంద్రీకృతంగా పర్యవేక్షించడానికి వీలవుతుంది

# దశాబ్దకాలంగా ఎదురుచూపు




## క్రమబద్ధీకరణకు నోచని సమగ్ర శిక్షా ఉద్యోగులు

- విద్యా శాఖ పరిధిలోని ఏడు విభాగాల్లో 27 వేల మంది సిబ్బంది
- ఏండ్ల తరబడి పనిచేస్తున్నా దక్కని కనీస వేతనాలు
- న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో కాంట్రాక్టు ఉద్యోగులు ఏండ్ల తరబడి పనిచేస్తున్నా క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. 'విద్య మన హక్కు' 'అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి' అనే నినాదంతో ఏర్పడిన సర్వ శిక్షా అభియాన్‌లో దశాబ్ద కాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అందని ద్రాక్షలా మారాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యా శాఖ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట పట్టారు.

**క్రమబద్ధీకరించాలి**

విద్యాభివృద్ధి కోసం ఎంతో కష్టపడి పనిచేస్తున్న కస్తూర్బాగాంధీ బాలికల స్కూల్స్‌లో 2009 నుంచి తక్కువ వేతనాలకే పనిచేస్తున్నాం. టెట్ క్వాలిఫై అయినా రోస్టర్ పాయింట్స్, రిజర్వేషన్లు, ఇతర నిబంధనల ప్రకారం నియమించబడ్డాం. మమ్మల్ని క్రమబద్ధీకరించే వరకు ఉద్యమాన్ని చేపడతాం.

- ఉమాదేవి, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 27 వేల మంది సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. విద్యా శాఖలో భాగమైన సమగ్ర శిక్ష కింద జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ (డీపీఓ) విభాగంలో డీఎల్ఎంటీ, ఎకౌంటెంట్స్, సిస్టమ్స్ ఎనాలసిస్ట్‌లు పనిచేస్తున్నారు. మండల్ రిసోర్స్ క్లస్టర్(ఎంఆర్‌పీ) విభాగంలో ఎంఐఎస్, సీఓఎస్, మెసెంజర్లు, ఐఆర్‌పీలున్నారు. క్లస్టర్ రిసోర్స్ సెంటర్ (సీఆర్‌పీ) విభాగంలో సీఆర్‌పీఎస్‌లు, పీఐటీలుంటారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విభాగంలో ఎస్‌ఓలు, సీఆర్‌టీలు, పీఈటీలు, నాన్‌టీచింగ్ సిబ్బంది ఉన్నారు.

అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్స్ (యూఆర్‌సీ) విభాగంలో టీచర్స్, నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీటితో పాటు ఐఆర్‌పీ, డీటీఎల్ విభాగాలు న్నాయి. వీటి పరిధిలో కూడా కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. ఒక్కో కస్తూర్బా స్కూల్స్‌లో 12 మందికిపైనే పనిచేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2100 మంది పనిచేస్తున్నారు. వీరంతా విద్యా శాఖ పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థుల చదువులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల మాస్ ఎంట్రీ, స్కూల్ కాంప్లెక్స్ ఏజెండా తయారు చేసే వంటి పనులు చేస్తున్నారు. జిల్లా విద్యా శాఖ పరిధిలో వీరి సేవలు ఎంతో కీలకంగా ఉన్నాయి. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియా మకాలన్నీ కూడా ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం జరిగినా ఇవ్వా ల్సిన సౌకర్యాలు అమలుకావడం లేదని వాపోతున్నారు.

**న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి: మధురనేని**

తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్టు సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యా శాఖ పరిధిలో పనిచేస్తున్న 27 వేల మంది సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, కనీస వేతనం అమలుచేయాలి. సమగ్ర శిక్ష, కేజీబీవీ, యూఆర్ఎస్‌లను విద్యా శాఖలో విలీనం చేసి కాంట్రాక్టు ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయాలి. మహిళా ఉద్యోగులందరికీ వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలి. గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలి. విద్యా శాఖలో చేపట్టే ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వేయిటేజ్ కల్పించాలి.

శేషాద్రి, తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు

**కనీస వేతనాలకు నోచని వైనం**

సమగ్ర శిక్షా ఉద్యోగులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదు. వారి సగటు వేతనం రూ.19500. మెసెంజర్లకు రూ.8 వేలు మాత్రమే అందుతున్నాయి. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మినిమమ్ టైమ్ స్కేల్స్ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ కావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రమ దోపిడికి గురవుతున్న తమకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### దశాబ్ద కాలంగా ఎదురు చూపు

వారంతా దశాబ్ద కాలానికిపైగా క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఇతర శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల్ని క్రమబద్ధీకరణ చేసిన సమయంలోనే కేజీబీవీ, యూఆర్‌సీలను కూడా క్రమబద్ధీకరణ చేస్తారని ఉద్యోగులు ఆశపడ్డారు. కస్తూర్బాగాంధీ బాలికల స్కూల్స్‌లో 2009 మంది టీచింగ్, నాన్ టీచింగ్ కాంట్రాక్టు సిబ్బందిని నియమించారు. టీచింగ్ సిబ్బందంతా కూడా టెట్ క్వాలిఫై అయిన వాళ్లనే రాత పరీక్ష పెట్టి నియమించారు. అదే విధంగా 2012లో యూఆర్‌సీ పరిధిలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించారు. కేజీబీవీ, యుఆర్‌సీ కాంట్రాక్టు సిబ్బందిని క్రమబద్ధీకరణ చేయాలని వారు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. అనేక పర్యాయాలు విద్యా శాఖ మంత్రితో పాటు విద్యా శాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు.



## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి

నవతెలంగాణ-చేవెళ్ల

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో రూ.కోటి వ్యయంతో పీడబ్ల్యుడీ రోడ్డు నుంచి చేవెళ్ళ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు, ఆలూరు గ్రామం నుంచి న్యాలట క్రాస్ రోడ్డు వరకు రూ. 4.50 కోట్ల నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మానస పుత్రిక పల్లె ప్రగతితో గ్రామాలు అభివృద్ధి చెంది, స్వచ్ఛతకు నిలయాలుగా మరాయని తెలిపారు. తెలంగాణ పల్లెలకు జాతీయ స్థాయిలో అవార్డులు రావడమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో రూ.12,769 గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లను సమకూర్చి, నర్సరీలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రూ.1329.73 కోట్ల వ్యయంతో శ్మశాన వాటికలు నిర్మించారన్నారు. అలాగే, రైతుల కోసం రూ.535.44 కోట్ల వ్యయంతో 2601 రైతువేదికలు నిర్మించినట్టు తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్లు నిర్మించుకోవడం కోసం గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. 24 గంటలు ఉచిత విద్యుత్, రోడ్లు, లైట్లు, తాగునీరు, డ్రయినేజీల నిర్మాణాలతో పాటు చేవెళ్ల నియోజకవర్గంలో అన్ని రంగాల అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. ఇలా అనేక సంక్షేమ పథకాల ప్రవేశపెట్టి అమలు చేస్తూ, నిరుపేదలకు భరోసా కల్పిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలందరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు యాదమ్మ, నరేందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రంగారెడ్డి, వైస్ చైర్మెన్ నర్సిములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, సీనియర్ నాయకులు రమణారెడ్డి, కృష్ణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు భూమిలో నర్సరీ మొక్కలు

- అడ్డుకున్న గ్రామస్తులను దూషించిన అటవీ అధికారి
- బాధితుల ఫిర్యాదు, కేసు నమోదు

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఇద్దరు వ్యక్తులను దూషిస్తూ బెదిరించిన విషయంలో అటవీ అధికారిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ములుగు జిల్లా పస్రా ఎస్ఐ ఎస్‌కే మస్తాన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. చల్వాయి గ్రామంలో వక్ఫ్ బోర్డ్‌కు చెందిన 4 ఎకరాల భూమిలో ఫారెస్ట్ అధికారి తేజవత్ దిప్‌లాల్ అక్రమంగా నర్సరీ మొక్కలు దించారు. అదే గ్రామానికి చెందిన జహరుద్దీన్, షఫీలమ్ గమనించి అడ్డుకోగా దీప్‌లాల్ వారిని ఇష్టం వచ్చినట్టు తిట్టి ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరించారు. దాంతో బాధితులు పస్రా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి అధికారిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న నిందితుల అరెస్ట్

నవతెలంగాణ-మియాపూర్

హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల్లో విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని ఈ-సిగరెట్లను విక్రయిస్తున్న నిందితులను ఎస్‌ఓటి పోలీసులు అరెస్టు చేసి, రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఓటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కత, ముంబయి నుంచి కొరియర్ ద్వారా ఈ-సిగరెట్లు తెప్పిస్తున్న మాధవ్, 63 మంది కళాశాల విద్యార్థులకు విక్రయించారు. పంజాగుట్టలోని అమిటీ కళాశాల, శంకర్‌పల్లిలోని ఇక్ఫాయ్, ఐబీఎస్ బాచుపల్లిలోని మహీంద్ర విశ్వవిద్యాలయం, కొండాపూర్‌లోని సంక్రీత్ కళాశాల, షేక్‌పేట్‌లోని ఆకర్ష్ ఇన్‌స్టిట్యూట్, పటాన్‌చెరులోని గీతం కళాశాలలో కొంత మంది విద్యార్థులకు సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అమిటీ కళాశాలకు చెందిన అచ్యుత గౌతమ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఈ-సిగరెట్లు విక్రయిస్తున్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మరో 71 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఈ-సిగరెట్లు విక్రయించినట్టు గుర్తించారు. ఈ కేసును రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేశారు.



## అధికారం కోసం మతాల మధ్య చిచ్చు

- సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క
- సరూర్‌నగర్‌లో పాదయాత్ర

నవతెలంగాణ- చైతన్యపురి

దేశాన్ని పాలిస్తున్న బీజేపీ అధికారం కోసం మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని చూస్తోందని సీఎల్పీ నాయకుడు మల్లు బట్టి విక్రమార్క అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర గురువారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించిన పాదయాత్రలో భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కి గౌడ్, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా సరూర్‌నగర్ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుంచి ఎన్టీఆర్ నగర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు.

అనంతరం సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ దేశం అనేక మతాలు, కులాలు, విభిన్న సంస్కృతులు, ప్రాంతాలతో కూడినదని చెప్పారు. ఇక్కడ పుట్టిన ప్రతి బిడ్డా.. ప్రతి మతానికి సంబంధించిన వాళ్లు భారతీయులే అని చెప్పారు. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. కేవలం అధికారం.. ఓట్ల కోసం మతాల పేరు చెప్పి ప్రజల మధ్య చిచ్చుపెట్టి వారిని విడగొట్టి లబ్దిపొందాలని చూస్తోందని విమర్శించారు. ఈ దేశ నిర్మాణం ఉన్నతంగా జరగాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటున్నదని చెప్పారు. వనరులు, సంపద అందరికీ సమానంగా పంచాలన్నారు. బహుళ జాతి సంస్థల కోసం ఆలోచన చేస్తున్నారే తప్ప దేశ ప్రజల కోసం బీజేపీ ఆలోచన చేయట్లేదన్నారు. మధుయాష్కీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. మరోసారి మోసం చేసేందుకే కేసీఆర్ దొంగ హామీలు ఇస్తున్నారని తెలిపారు. పార్టీ మారిన నాయకులు స్వార్థం కోసం మారారు తప్ప అభివృద్ధి కోసం కాదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కోదండరెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, చిగురింత నరసింహారెడ్డి, టీపీసీసీ సెక్రెటరీ యేలేటి అమరేందర్ రెడ్డి, ఎనుగు జంగా రెడ్డి, బంగారు బాబు, చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొట్టకూటి కోసం వచ్చి ప్రాణం కోల్పోయారు

- ఐచర్ వాహనం ఢీకొని తండ్రీకొడుకులు మృతి
- పోలీసుల అదపులో డ్రైవర్

నవతెలంగాణ-జన్నారం

బతుకుదెరువు కోసం ఏడేండ్ల కొడుకుతో కలిసి ఊరుకాని ఊరికి వలస వచ్చారు. ఒక్కగానొక్క కొడుకును కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉన్నత చదువు చదివించాలన్న ఆశతో భార్యాభర్తలిద్దరూ సంవత్సర కాలంగా ఓ వ్యక్తి వద్ద పశువుల కాపరిగా ఉంటూ జీవనం సాగించారు. కొంత డబ్బు చేతికి రావడంతో స్వగ్రామానికి వెళ్దామని బయల్దేరారు. బస్టాండ్‌లో బస్ కోసం ఎదురుచూస్తున్న క్రమంలో ఐచర్ వాహనం వారిపైకి దూసుకురావడంతో తండ్రీకొడుకులు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. తల్లికి స్వల్పగాయాలయ్యాయి. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని కలమడుగు బస్టాప్ వద్ద గురువారం జరిగింది.బస్టాప్ వద్ద కొడుకుతో కలిసి భార్యాభర్తలు నిల్చొని ఉండగా అతివేగంగా వచ్చిన ఐచర్ వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘనటలో తండ్రీకొడుకులు జోగు సాయికుమార్(37), జోగు లక్ష్మణ్(7) అక్కడికక్కడే మృతిచెందారు. తల్లి మంజులకు స్వల్ప గాయాలయ్యాయి. ఐచర్ నాగ్‌పూర్ నుంచి కొయంబత్తుర్‌కు దారం లోడ్‌తో జగిత్యాల వైపు వెళ్తోంది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడపడంతో మూలమలుపు వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బస్టాప్‌లో ఉన్న ప్రయాణికులపైకి దూసుకెళ్లి బోల్తాపడింది. డ్రైవర్‌తో పాటు క్లీనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతిచెందిన తండ్రీకొడుకులు మెదక్ జిల్లా అనంతారం గ్రామానికి చెందిన వారు. భర్తను.. కొడుకును కోల్పోయిన ఆ తల్లి రోదన మిన్నంటింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

## పిల్లర్‌గుంతలో పడి.. ఇద్దరు చిన్నారులు మృతి

- పుట్టిన రోజు నాడే విషాదం



నవతెలంగాణ-బాల్కొండ

బుడిబుడి అడుగులతో అప్పటి వరకు అలరించిన చిన్నారులు.. ప్రమాదవశాత్తు పిల్లర్ కోసం తీసిన గుంతలో పడి విగతజీవులుగా మారి కన్నవారికి కంఠశోకం మిగిల్చారు. ఇంటి నిర్మాణం కోసం తీసిన గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్ గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం ఇంటి నుంచి ఆడుకోవడానికి వెళ్లిన నిశాంత్ చరణ్ (4), మెట్టు నాస్తిక్ (5) ప్రమాదవశాత్తు ఓ భవన నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలో పడ్డారు. ఉదయం ఆడుకోవడానికి వెళ్లిన తమ పిల్లలు ఇంకా రాలేదని తల్లిదండ్రులు వెతకగా అప్పటికే గుంతలో నిర్జీవంగా నీటిపై తేలియాడుతూ కనిపించారు. నిశాంత్ చరణ్ తండ్రి శ్రీకాంత్‌కు ఇత్వార్‌పేట గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ ఉద్యోగం రావడంతో కొన్ని రోజుల క్రితమే చిట్టాపూర్ గ్రామం నుంచి ఇత్వార్ పేట్‌కు వచ్చారు. కాగా, గురువారం నిశాంత్ చరణ్ పుట్టినరోజు. పుట్టిన రోజు నాడే చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలతో గ్రామం అంతా విషాధ ఛాయలు అలుముకున్నాయి. 15 రోజుల కిందట గ్రామ అభివృద్ధి కమిటీ భవన నిర్మాణం కోసం గుంతలు తీసి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదం జరిగిందంటూ గ్రామస్తులు ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు బాల్కొండ ఎస్ఐ కె.గోపి తెలిపారు. కాగా, చిన్నారుల మరణవార్త తెలుసుకున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. చిన్నారుల ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున వ్యక్తిగతంగా ఆర్థిక సాయం ప్రకటించారు.



దళితులతో కలిసి అందోళనకు దిగిన జాన్‌వెస్లీ, సీపీఐ(ఎం) బృందం నాయకులు

## దళితులపై దాడులు అమానుషం

### దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- వట్టినాగులపల్లిలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ పర్యటన

నవతెలంగాణ-గండిపేట్

నగరానికి కూత వేటు దూరంలో ఉన్న వట్టినాగులపల్లిలోని దళితులపై అగ్రవర్ణాలు దాడులు చేయడం దారుణమని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ విమర్శించారు. గురువారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం వట్టినాగులపల్లిలో బోనాల పండుగ సందర్భంగా దళితులపై దాడులు జరిగాయి.

ఈ ఘటనా స్థలాన్ని సీపీఐ(ఎం), కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు సందర్శించి పరిశీలించారు. అనంతరం దళితులతో సమావేశమై దాడి జరిగిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కడ జరగటం లేదని చెబుతున్న సీఎం కేసీఆర్‌కు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో దాడులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో కులదురహంకార దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. దళితులకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బోనాలు, బొడ్రాయి వేడుకల్లో కులవివక్ష చూపడం దారుణమన్నారు. దళితులపై దాడులు చేసిన అగ్రవర్ణాలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో దళితులను ఏకం చేసి అఖిల పక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

దళితులు ఎలాంటి నిర్ణయం తీసుకున్న వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కార్యవర్గ సభ్యులు డి. జగదీష్, మండల కన్వీనర్ రుద్రకుమార్, కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, ఎం. అశోక్, లక్ష్మణ్, కుమార్‌గౌడ్, రాజు, ప్రసాద్, దాడిలో గాయపడిన వారి కుటుంబ సభ్యులు, దళితులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



- ప్రభుత్వాలు మద్యాన్ని నిషేధించాలి
- ఐలమ్మ ట్రస్ట్ సెక్రెటరీ హైమావతి
- ఐలమ్మ భవన్‌లో హెల్త్ క్యాంపును ప్రారంభించిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రతి మహిళా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐలమ్మ ట్రస్ట్ సెక్రెటరీ హైమావతి అన్నారు. ఐలమ్మ 37వ వర్ధంతిని పురస్కరించుకొని హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఐలమ్మ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను డీఎంహెచ్ఓ వెంకట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ.. ఐలమ్మ ట్రస్ట్ ఏర్పడిన తర్వాత అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మహిళల్లో ఆరోగ్య సమస్యలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ఐలమ్మ భవన్‌లో చుట్టుపక్కల పిల్లలకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. ముషీరాబాద్‌లో ఎక్కువగా మురికివాడలు ఉండటం, పరిసర ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండిపోవడం, మహిళలకు, చిన్నారులకు సరైన అవగాహన లేకపోవడంతో తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. మహిళల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉండటంతో రక్తహీనత, కండరాల నొప్పిలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. హిమోగ్లోబిన్ రక్తహీనతను అధిగమించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే మహిళలకు ఐలమ్మ ట్రస్టు ద్వారా బహుమతులు ప్రదానం చేస్తున్నామన్నారు. తద్వారా మహిళలు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారని ఆకాంక్షించారు. నిత్యావసర వస్తువుల ధరలు తీవ్ర స్థాయిలో పెరగడంతో సరైన పోషకాహారం అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యాన్ని అనుమతించడంతో యువత తాగుడుకు బానిస లవుతూ విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడు తున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్యాన్ని పూర్తిస్థాయిలో నిషేధించి ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందే విధంగా ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ ట్రస్ట్ కోశాధికారి ఆశాలత, జ్యోతి, అరుణ జ్యోతి, ఇందిర, కవిత తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదు

**కేయూ ఆందోళనలపై.. వరంగల్ సీపీ ఏవీ.రంగనాథ్**

నవతెలంగాణ-సుబేదారి

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. గురువారం హన్మకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి సీపీ మాట్లాడారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఊరుకోబోమని ముందే హెచ్చరించినప్పటికీ విద్యార్థులు పట్టించుకోలేదని అన్నారు. కేయూ వీసీ కండ్లలో ఆనందం చూసేందుకు తాను గన్‌పెట్టి బెదిరించానని కేయూ విద్యార్థులు ఆరోపిస్తున్నారని తెలిపారు. తానే దగ్గరుండి కొట్టానని చెబుతున్నారని, తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కొంతమంది ఏబీవీపీ విద్యార్థులు వీసీ చాంబర్ డోర్ పగలగొట్టి, కంప్యూటర్లు ధ్వంసం చేశారని, ఈ విద్యార్థులే ఫిబ్రవరి 28న బైరి నరేష్‌పై దాడి చేసినట్టు తెలిపారు.

వైద్య పరీక్షల బోగస్ సర్టిఫికెట్లు పెట్టారని ఆరోపించారు. పాత గాయాలు చూపించి తమను పోలీసులు కొట్టారని మెజిస్ట్రేట్ ముందు కూడా చెప్పారన్నారు. ఇలాంటి ఆరోపణలు తమకు కొత్తకాదని, కేయూలో చాలా సంఘాలు ఉన్నా కొందరే ఇలా చేశారని, కేయూలో తప్పులు జరిగితే చట్టం, కోర్టులు పోరాడవచ్చు కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎలా అని ప్రశ్నించారు. కాకతీయ యూనివర్సిటీ వీసీ రమేష్ మాట్లాడుతూ.. కేయూ పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్‌లలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, ప్రక్రియంతా పారదర్శకంగానే కొనసాగించామని తెలిపారు. దౌర్జన్యం చేస్తే పాలకవర్గం లొంగుతుందని కొందరు భావిస్తున్నారని, నిబంధనలకు అనుగుణంగా ప్రతిభ ఉన్నవారికే సీట్లు కేటాయించామని, మాకు కులం, మతంతో సంబంధం లేదని స్పష్టం చేశారు. మొన్న డోర్లు తన్నుకుంటూ.. అసభ్యపదజాలంతో దూషిస్తూ తన ఛాంబర్‌కు వచ్చి కొందరు విద్యార్థులు గలాటా చేశారన్నారు. అక్రమ మార్గంలో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందేందుకే ఇలా చేస్తున్నారని వీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు.



సంపాదకీయం

# అభివృద్ధి కేంద్రంగా ఆగ్నేయాసియా!

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అభివృద్ధి కేంద్రంగా ఆగ్నేయాసియాను రూపొందించటంతో పాటు, వెలుపలి దేశాల వృద్ధికి కూడా పాటు పడతామని ఇండోనేషియా రాజధాని జకర్తాలో గురువారంనాడు ముగిసిన నలభై మూడవ ఆసియన్ శిఖరాగ్ర సమావేశం పేర్కొన్నది. ఆసియన్ ఆమోదించిన నాలుగవ ఒప్పందం ఈ క్రమంలో గట్టి పునాదిగా ఉంటుందని, ఈ కూటమి దేశాల విజన్ 2045 పరిపూర్తికి కృషి చేస్తామని పేర్కొన్నది. ఒకే దృష్టి, ఒకే గుర్తింపు, ఒకే సమాజం అనే లక్ష్యాలతో 1967లో ఆగ్నేయ ఆసియాలోని ఇండోనేషియా, మలేసియా, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయిలాండ్ దేశాలతో ఏర్పడిన ఈ సంస్థ తరువాత బ్రూనీ, వియత్నాం, లావోస్, మయన్మార్, కంపూచియాలతో విస్తరించింది. ఈ కూటమిని ఐరాస చర్చల భాగస్వామిగా గుర్తించి పరిశీలక హోదా ఇచ్చారు. 1991తరువాత చైనా, జపాన్, దక్షిణ కొరియాలతో అనుసంధానం చేసి ఆసియన్ ప్లస్-3గా తరువాత భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో ప్లస్-6గా మార్చినప్పటికీ పూర్తి సభ్యత్వం పది దేశాలకే ఉన్నది. చర్చలు, ఒప్పంద అమలు భాగస్వామ్య పక్షాలుగా ప్రస్తుతం మొత్తం 27 దేశాలు ఉన్నాయి.

> **ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కూటమి సూచించిన ఐదు అంశాలను పక్కన పెట్టిన మయన్మార్ మిలిటరీ పాలకుల చర్యను తొలిసారిగా ఆసియన్ కూటమి జకార్తాలో చేసిన ఒక ప్రకటనలో ఖండించింది. 2026లో దానికి దక్కాల్సిన అధ్యక్ష స్థానాన్ని తిరస్కరించి ఫిలిప్పైన్స్‌కు అప్పగించటమే కాదు, మరో పది సంవత్సరాల వరకు మయన్మార్‌కు అవకాశం రాకుండా ఒక పద్ధతిని రూపొందించటం ఒక విశేషం. ఇది నిరంకుశ పాలకులకు ఒక హెచ్చరిక.**

జకర్తాలో "ఆసియన్ సమస్యలు: అభివృద్ధి కేంద్రం" అనే ఇతివృత్తంతో సభ జరిగింది. సహజంగానే ఈ సభలో పాల్గొన్న ప్రముఖులందరి ఉపన్యాసాలు, సూచనలు, సలహాలు దీని చుట్టూనే ఉన్నాయని వేరే చెప్పనవసం లేదు. ఆగ్నేయాసియాలో కమ్యూనిజం వ్యాప్తి నిరోధం, చైనాను అడ్డుకొనేందుకు అమెరికా ఏర్పాటు చేసిన ఈ కూటమి ముఖ్యంగా 1991లో సోవియట్ యూనియన్‌ను కూల్చివేసిన తరువాత అనేక మార్పులకు లోనైంది. నాటో తరహాలో 1954లో ఆగ్నేయాసియా మిలిటరీ కూటమిని (సీటో) కూడా అమెరికా ఏర్పాటు చేసింది. ప్రధానంగా ఇండో చైనా దేశాలైన వియత్నాం, కంపూచియా, లావోస్‌లను ఆక్రమించి తమ తొత్తు పాలకులను ఏర్పాటు చేసేందుకు, ఆ ప్రాంతంలో కమ్యూనిస్టులను అణచివేసేందుకు దీన్ని ఉద్దేశించారు. ఈ కూటమిలో ఫిలిప్పైన్స్, థాయిలాండ్ మాత్రమే ఆ ప్రాంత దేశాలు కాగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఇతర సభ్యులు. 1975లో ఇండోచైనాలో కమ్యూనిస్టులు, ఇతర పురోగామి శక్తుల చేతిలో జపాన్, ఫ్రాన్స్, అమెరికా పరాభవం, చివరికి అమెరికా సేనలు ఆ ప్రాంతం నుంచి పారిపోయిన తరువాత ఆ కూటమి ఉనికిలో లేకుండా పోయింది.





ఇటీవలి వరకు అమెరికా, ఐరోపా దేశాల ఎగుమతులకు మార్కెట్‌గా ఉన్న ఆసియన్ కూటమి దేశాలు ఇప్పుడు వాటిని పక్కకు నెట్టేసి చైనాతో వాణిజ్య లావాదేవీలను ఎక్కువ జరుపుతున్నాయి. ఒక కూటమిగా ఉన్నప్పటికీ దేశాల మధ్య కొన్ని వివాదాలు పరిష్కారం కావటం లేదు. దీన్ని అవకాశంగా తీసుకొని వాటిని మరింతగా పెంచేందుకు, ఆ సాకుతో ఇటీవలి కాలంలో చైనాను ఒంటరిపాటు చేసేందుకు దక్షిణ చైనా సముద్రంలో స్వేచ్ఛగా నౌకా రవాణా జరగాలని, ఆ ప్రాంతంలోని చమురు నిల్వలను చైనా ఆక్రమించేందుకు చూస్తోందంటూ రెచ్చగొట్టేందుకు, ఆ ప్రాంత దేశాలతో వ్యతిరేక కూటమి ఏర్పాటు చేసేందుకు అమెరికా పూనుకుంది. ఈ పరిణామాలను గమనంలో ఉంచుకొనే నూతన ప్రచ్ఛన్న యుద్ధాని వ్యతిరేకించాలని, సహకారాన్ని పెంపొందించుకొనే దిశగా ముందుకు సాగాలని 26వ చైనా-ఆసియన్ సభలో చైనా ప్రధాని లీ క్వియాంగ్ పిలుపునిచ్చాడు. విబేధాలు ఉంటే వాటిని సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పాడు. భారత్-ఆసియన్ సంబంధాలు, సహకారం మెరుగుదలకు ప్రధాని నరేంద్రమోడీ పన్నెండు అంశాలను ప్రతిపాదించారు. వాటి గురించి ఆసియన్ దేశాల నేతలతో మోడీ సంప్రదింపులు జరిపారు. సముద్రయాన సహకారం, ఆహార భద్రతకు సంబంధించి రెండు సంయుక్త ప్రకటనలను కూడా వెలువరించారు.

అమెరికా, ఐరోపా సమాఖ్య పెత్తనాన్ని అడ్డుకొనేందుకు ఆర్థిక యూనియన్‌గా ఏర్పడేందుకు, ఒకే కరెన్సీని ఉనికిలోకి తెచ్చేందుకు కొన్ని దేశాలు చూసినప్పటికీ అమెరికా వాటిని పడనివ్వలేదు. ఈ కూటమిని తమతో తీసుకుపోయేందుకు చూస్తున్నప్పటికీ సాధ్యం కావటం లేదు. ఉక్రెయిన్ - రష్యా సంక్షోభంలో తటస్థంగా ఉండి ఒత్తిళ్లకు లొంగలేదు. ఏ శక్తికీ బినామీగా ఉండకూడదని తమ కూటమి నిర్ణయించిందని ప్రస్తుతం అధ్యక్ష స్థానంలో ఉన్న ఇండోనేషియా అధినేత విడోడో జొకోవీ 43వ శిఖరాగ్ర సభ ప్రారంభ ఉపన్యాసంలో చెప్పటం హర్షణీయం. ఐరోపాలో రష్యాపై పశ్చిమ దేశాలు, ఆసియాలో చైనాను నిలువరించే అమెరికా ఆధిపత్య వైఖరితో ఉద్రిక్తతలు పెరుగుతున్నట్లుగా, చైనాతో విడగొట్టుకోవటం సాధ్యం కాదని ఇండోనేషియా గుర్తించినట్లు జొకోవీ మాటలు వెల్లడిస్తున్నట్లు చెప్పవచ్చు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కూటమి సూచించిన ఐదు అంశాలను పక్కన పెట్టిన మయన్మార్ మిలిటరీ పాలకుల చర్యను తొలిసారిగా ఆసియన్ కూటమి జకార్తాలో చేసిన ఒక ప్రకటనలో ఖండించింది. 2026లో దానికి దక్కాల్సిన అధ్యక్ష స్థానాన్ని తిరస్కరించి ఫిలిప్పైన్స్‌కు అప్పగించటమే కాదు, మరో పది సంవత్సరాల వరకు మయన్మార్‌కు అవకాశం రాకుండా ఒక పద్ధతిని రూపొందించటం ఒక విశేషం. ఇది నిరంకుశ పాలకులకు ఒక హెచ్చరిక.

# మనకిప్పుడు మతాల్ని ప్రశ్నించే గొంతులు కావాలి!

**కొన్ని పార్టీలు దేశంలో హిందూ ముస్లిం మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇప్పుడు దేశానికి ప్రశ్నించే గొంతుకలు కావాలి. కానీ, ప్రశ్నించే వారిని ఏ తప్పూ లేకపోయినా ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తూ ఉంది. ఈ స్థితిలో దేశాన్ని చూస్తూ ఉంటే భయమేస్తోంది.**

**- అమర్త్య సేన్, ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార్ గ్రహీత.**



డాక్టర్ దేవరాజు మహారాజు

ఇటీవల ఇండియా కూటమి పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. ఎందుకూ? ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కాదు, పార్లమెంటుకు ముఖం చాటేసి, పారిపోయే దేశ ప్రధానిని పార్లమెంట్‌కు రప్పించి, మణిపూర్‌పై మాట్లాడించడానికి! అది విజయవంతమైంది. అంటే బీజేపీ ప్రతిభ తగ్గిందని అర్థం. కాంగ్రెస్ ముఖ్యనేత ఎంపీ.గా అనర్హుడని ఇంటికి పంపారు. కానీ ఆయన సుప్రీం కోర్టు ఆర్డర్‌తో పార్లమెంట్‌కు వచ్చి కూర్చున్నారు. అంతేకాదు, 'రాహుల్ గాంధీ మాట్లాడాలి' అని బీజేపీ ఎంపీలతోనే బతిమిలాడించుకున్నాడు - అంటే ఏమిటీ? కాంగ్రెస్ ప్రభ తగ్గినట్టా బీజేపీ ప్రభ తగ్గినట్టా? ఇండియా కూటమి ప్రభ తగ్గినట్టా. "మణిపూర్‌లో భారతమాతను హత్య చేశారు. మీ కుట్రలు, కుతంత్రాలతో మణిపూర్‌ను రెండుగా చీల్చారు" అని కాంగ్రెస్ నేత ఆక్రోశిస్తూ చెప్పిన మాటల్లోని ఆవేదన ఈ దేశ ప్రజల మనసుల్లో తిష్టవేసింది. బీజేపీ మంత్రులు, హోమ్‌మంత్రి, దేశ ప్రధాని గంటల తరబడి చెప్పిన అసందర్భపు మాటలు, తక్కువ స్థాయి హాస్యోక్తులు ఇండియా కూటమి సభ్యులు వినదల్చుకోలేదు. అందుకే వాకౌట్ చేశారు. ప్రతిపక్షాల ఐక్యత మనకు అక్కడ కనిపించింది. పనికిరాని విషయాన్ని రాద్ధాంతం చేసిన బీజేపీ మహిళా మంత్రుల మాటలు గానీ, దేశ ప్రధాని ఇండియా కూటమిపై పేల్చిన జోకులు గానీ వారి స్థాయిని నిలుపలేకపోయాయి. పైగా కనపడని అగాధంలోకి పడదోశాయి.

నిర్భయ అనే ఒక మహిళని సామూహికంగా అత్యాచారం చేసినందుకు నిరసనగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో దేశ ప్రధానికి గాజులు పంపింది ఒక విపక్ష సభ్యురాలు! ఆమె ఇప్పుడు మంత్రిగా అధికారంలో ఉంది. మరి ఇప్పుడు తమ స్వంత ప్రధానికి ఒక గాజుల దుకాణమే పంపాలి కదా? ఎందుకంటే మణిపూర్‌లో ఇప్పుడు ఒక్క మహిళ కాదు, అనేక వందల మంది మహిళలు సామూహిక అత్యాచారాలకు గురయ్యారు. మహిళల్ని నగ్నంగా వీధుల్లో ఊరేగించారు. ఈ విషయాలు స్వయంగా మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రే ప్రకటించారు. అధికారంలో ఉన్న బీజేపీ మహిళా మంత్రులకు ఈ విషయాలు కనబడలేదు. కనీసం నిరసన - ఒక సానుభూతి ప్రకటన కూడా లేదు. నిర్భయ విషయం బయటి ప్రపంచానికి తెలియకుండా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం అడ్డుకోలేదు. ఇప్పుడు మాత్రం ఈ రాష్ట్ర - కేంద్ర బీజేపీ ప్రభుత్వాలు ఇంటర్‌నెట్ సేవలు ఆపేసి విషయాలు బయటి ప్రపంచానికి తెలియకుండా చేశాయి. అధికారంలో ఉన్న మహిళా మంత్రులు, ఎంపీలు ఏం చేస్తున్నట్టూ? మహిళల పక్షాన గొంతెత్తరా? మానవీయ విలువల్ని తొక్కిపెట్టే రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా? అసలు వీరికి నైతికత ఏదీ?

> **మోడీ ప్రధాని అయిన తర్వాతే దేశానికి అన్నీ సమకూరాయనీ, అదంతా ఆయన పరిపాలనా దక్షత అని కొందరు జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిగతంగా వారు నమ్మినా, నమ్మకపోయినా జనాన్ని పిచ్చివాళ్ళను చేయడానికి నిసిగ్గుగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి మోడీ ప్రధాని అయిన నాలుగేళ్ళలో దేశాన్ని నలభై యేండ్లు వెనక్కి నడిపించారు. కుల, మత రహిత సామరస్య భావనతో ఉన్న భారత దేశాన్ని మోడీ తన మతతత్వంతో ముక్కలు చేసే ప్రయత్నం చేశారు.**

అర్ధనగ్నంగా ఓ మహిళ - పోలీసుల మీద తిరగబడుతున్నట్లుగా ఉన్న ఓ వీడియో మీడియాలో తిరిగింది. "మణిపూర్ పోలీసుల మీద కుకీ మహిళ దాడి చేస్తున్నట్లు - కాషాయ వర్గాలు దాన్ని వక్రీకరించి విష ప్రచారం ప్రారంభించాయి. అది వాస్తవం కాదు. ఆ వీడియో ఉత్తరప్రదేశ్ చందౌలీ లోని పండిట్ దీన్ దయాళ్ నగర్‌లో మున్సిపల్ ఎన్నికల సందర్భంలో జరిగిన సంఘటన - ఓట్లను తిరిగి లెక్కించాలని డిమాండ్ చేస్తూ సోనూ కిన్నార్ అనే స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు కౌంటింగ్ కేంద్రం వెలుపల గుమిగూడి పోలీసులతో వాగ్వాదానికి దిగారు - అది అప్పటి వీడియో. దానికీ మణిపూర్ కుకీ మహిళలకీ సంబంధమే లేదు. అధికారంలో ఉన్నవారు అబద్దాల ప్రచారానికి 3వేల మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో ఒక ఐటీ సెల్ నడుపుతున్నారు. అది చేసే పని ఇదే. రోజుకు లక్షల మందికి తప్పుడు సందేశాలు, మార్ఫింగ్ చేసిన వీడియోలు పంపడమే వీరి విధి. ఏ ప్రధాని ఉన్నప్పుడైనా నా బోటి సామాన్యుడికి పి.యం.ఓ. (ప్రైమ్ మినిస్టర్స్ ఆఫీస్) నుండి ఈమెయిల్స్ వచ్చేవి కావు. ఇప్పుడు మాత్రం నెలకు 3, 4 వస్తూనే ఉంటాయి. మెయిల్ బాక్స్ నిండిపోకుండా, డిలిట్ చేసుకోవడం అదనంగా మనకు పనిభారం! మణిపూర్ ఘటనలో ప్రధాన నిందితుడు అబ్దుల్ ఖాన్ అరెస్టయ్యాడని అబద్దాల ఐటీ సెల్ ప్రచారం చేసింది. అసలు నిందితుడు హేయ్‌రిమ్ హిరోదాస్ మెయితీ. అసలు పేరు దాచిపెట్టి, తప్పు ముస్లింలపైకి తోసెయ్యడానికి ప్రయత్నం జరిగిందని తెలిసిపోయింది.

"ప్రధాని మోడీ మమ్మల్ని ఏ విధంగా పిలిచినా, ఏ విధంగా గేలి చేసినా మేము - 'ఇండియా'నే. మణిపూర్ గాయాలు మాన్పడానికి మేం సహాయ పడతాం. మణిపూర్ మహిళల, చిన్నారుల కన్నీళ్ళు తుడుస్తాం. మేం మణిపూర్ ప్రజల జీవితంలో ప్రేమను, శాంతిని తిరిగి తీసుకొస్తాం!" అని అన్నారు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇండియా కూటమి పక్షాన - ఈ దేశంలోని సామాన్యులు దేశ నాయకులందరినీ గమనిస్తున్నారు. అర్థం చేసుకుంటున్నారు. మణిపూర్ తగలబడుతోందన్న బాధలేకుండా, అధికారంలో ఉండి, తక్షణం చేపట్టాల్సిన చర్యలు చేపట్టకుండా విపక్షాల మీద



వ్యంగ్యాస్త్రాలు సంధించడానికి కాదు గదా ఈ దేశ ప్రజలు బీజేపీకి అధికారమిచ్చిందీ? ఎవరు అధికారమిచ్చారో వారే సమయం చూసి మళ్ళీ లాగేసుకుంటారు. బలం ఉందన్న అహంకారం అన్ని వేళలా, అన్ని చోట్లా పనిచేయదు. "ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక కార్యక్రమాన్ని శత్రువులు నేరాలతోనూ బలప్రయోగంతోనూ అణిచివేయలేరు. ప్రజలే చరిత్ర నిర్మాతలు" అని అన్నారు సాల్వడార్ అలెండీ. అమెరికా కుట్రదారులకు బలైన చిలీ అధ్యక్షుడు - కమ్యూనిస్టు నేత.

దేశకాల పరిస్థితుల్ని సునిశితంగా పరిశీలించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ డాక్టర్ రఘురామ్ రాజన్ ట్విట్టర్‌లో ఇలా రాశారు... అందులోని నిజానిజాల్ని మనం కూడాబేరీజు వేసుకోవాలి. మేధావి, పరిపాలనాదక్షుడైన ఆయన ఆలోచనల్ని, ఆవేదనల్ని ఈ దేశ ప్రజలు తప్పక అర్థం చేసుకోవాలి. ఆలోచించాలి.

*** *** ***

భారతదేశం రకరకాల పూలతో అల్లిన పూలమాల! కానీ, అది ప్రస్తుతం ఒక కోతి చేతికి చిక్కింది. నేను కాంగ్రెస్ వాడినో, కమ్యూనిస్టునో, మోడీ భక్తుణ్ణో కాదు. నా భారతదేశాన్ని ప్రేమించే ఒక సాధారణ పౌరుణ్ణి! గత 70 ఏండ్లుగా కుల మతాలకు అతీతంగా దేశం ఎంతో అభివృద్ధి సాధించింది. అందుకు భారత ప్రధానులందరూ అహోరాత్రులు శ్రమించారు. ఫలితంగా నేడు మనదేశం ప్రపంచంలో గొప్పశక్తిగా ఎదిగింది. ఇక్కడ కొన్ని వాస్తవాల్ని విశ్లేషించుకుందాం!

- మోడీ పుట్టక ముందే పాకిస్థాన్‌పై జరిగిన యుద్ధంలో భారత్ విజయం సాధించింది.
- మోడీకి మాటలు రాకముందే ప్రపంచంలో అత్యుత్తమ రాజ్యాంగం భారతదేశానికి సమకూరింది.
- మోడీ బాల్యా, కోలం వంటి ఆటలు ఆడే నాటికి భారతదేశం భాక్రానంగల్ నిర్మించుకుంది.
- మోడీ అక్షరాలు రాయడం నేర్చుకోకముందే ఇక్కడ AIIMS / IIT ఇంకా అనేక ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయాలు ప్రారంభించబడ్డాయి.
- మోడీ రైల్వే స్టేషన్‌లో టీ అమ్ముకుని బతికే నాటికి ఇక్కడ రాజధాని ఎక్స్‌ప్రెస్ లాంటి వేగంగా నడిచే రైళ్ళు పరిగెత్తాయి.
- ఈ దేశానికి ఎన్ని ప్రయోజనాలు సమకూరాయో అన్ని ప్రయోజనాలు మోడీ గుజరాత్ సీఎం కాకముందే సమకూరాయి.

మోడీ ప్రధాని అయిన తర్వాతే దేశానికి అన్నీ సమకూరాయనీ, అదంతా ఆయన పరిపాలనా దక్షత అని కొందరు జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తిగతంగా వారు నమ్మినా, నమ్మకపోయినా జనాన్ని పిచ్చివాళ్ళను చేయడానికి నిసిగ్గుగా అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి మోడీ ప్రధాని అయిన నాలుగేళ్ళలో దేశాన్ని నలభై యేండ్లు వెనక్కి నడిపించారు. కుల, మత రహిత సామరస్య భావనతో ఉన్న భారత దేశాన్ని మోడీ తన మతతత్వంతో ముక్కలు చేసే ప్రయత్నం చేశారు. ఈ దేశంలో మన పూర్వీకులు అనుభవించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు భవిష్యత్తులో మన పిల్లలు కూడా అనుభవించాలని మనం కోరుకుంటున్నాం! అంతే-

> **"మతాలన్నీ అంటువ్యాధుల వంటివి, వాటిని అరికట్టాలన్న" తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ గొంతుకు దేశంలో మద్దతు పెరిగింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లాక్కుని ప్రజల్ని విడదీసే మతాలన్నింటినీ ఆయన అన్నట్టు... త్యజించాల్సిందే! మనుషులందరిదీ ఒక్కటే స్థాయి అని నిరూపించిన జన్యుశాస్త్రాన్ని ఒప్పుకున్న ధర్మమే నిజమైన ధర్మం!! ఉట్టి స్వాతంత్ర్యమే కాదు, దానితో పాటు, ఈ దేశ ప్రజలకు స్వేచ్ఛ అవసరం! ప్రజాస్వామ్యం కూడా అవసరం! అందుకు నిత్య చైతన్యవంతంగా ప్రజా పోరాటాలు ఇంకా కొనసాగించాల్సే ఉంది. ఇంకా కొన్ని సాధించుకోవాల్సే ఉంది.**

డాక్టర్ రఘురామ్ రాజన్ వెలిబుచ్చిన అభిప్రాయాలలో నిజం ఉందా లేదా? నిజాయితీ ఉందా లేదా? అనేది ఎవరికి వారు ఆలోచించుకోవాలి. బాధ్యత, విజ్ఞత గల పౌరులు తప్పకుండా డాక్టర్ రాజన్ అభిప్రాయాలతో ఏకీభవిస్తారు. సందేహం లేదు.

సనాతన ధర్మం అనగానే మనువాదులంతా ఉలిక్కిపడుతుంటారు. తమ మనోభావాలకు దెబ్బలు తగిలించుకుంటారు. అసలైతే, ఈ దేశంలో సనాతన ధర్మాలు బౌద్ధ జైన ధర్మాలే అన్న విషయం కప్పిపుచ్చుతుంటారు. పురాణాలన్నీ బుద్ధుడి తర్వాత చాలా కాలానికి రాయబడ్డాయన్న నిజం ఒప్పుకోవాలి! అయినా, నేటి మనువాదుల ప్రకారం సనాతన ధర్మం, హిందుత్వ అంటే ఏమిటీ? ఆవుమూత్రం తాగి, ఆవుపేడ తిని, గోప్రదక్షిణలు చేయడమే కదా? అంతకన్నా ఎక్కువ వారికి అర్థమయిందీ లేదు. జనానికి అర్థం చేయించిందీలేదు. రాజకీయ దురుద్దేశాలతో ఈ రాజకీయ నాయకులు 'సమధర్మో సమభావో' అని చిలుక పలుకులు పలుకుతుంటారు. "సనాతన ధర్మం-క్రమశిక్షణ గల ధర్మం" అని చెప్పుకునే వారు గుజరాత్, మణిపూర్ మారణకాండలు క్రమశిక్షణతోనే చేయించారా? మన చంద్రయాన్-3 లక్షల కి.మీ. ప్రయాణించి విజయవంతంగా చంద్రుణ్ణి చేరింది పాపం! ఈ దేశ ప్రధాని మాత్రం ఢిల్లీ నుండి మణిపూర్ చేరుకోలేక విఫలమయ్యాడు. "మతాలన్నీ అంటువ్యాధుల వంటివి, వాటిని అరికట్టాలన్న" తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ గొంతుకు దేశంలో మద్దతు పెరిగింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లాక్కుని ప్రజల్ని విడదీసే మతాలన్నింటినీ ఆయన అన్నట్టు... త్యజించాల్సిందే! మనుషులందరిదీ ఒక్కటే స్థాయి అని నిరూపించిన జన్యుశాస్త్రాన్ని ఒప్పుకున్న ధర్మమే నిజమైన ధర్మం!! ఉట్టి స్వాతంత్ర్యమే కాదు, దానితో పాటు, ఈ దేశ ప్రజలకు స్వేచ్ఛ అవసరం! ప్రజాస్వామ్యం కూడా అవసరం! అందుకు నిత్య చైతన్యవంతంగా ప్రజా పోరాటాలు ఇంకా కొనసాగించాల్సే ఉంది. ఇంకా కొన్ని సాధించుకోవాల్సే ఉంది.

**- వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.**




# 'అందరికీ నాణ్యమైన విద్య' అందించలేమా?

వేద కాలంలో, రాచరిక పాలనలో కొందరికే పరిమితమైన విద్యను ప్రజాస్వామ్యం సార్వత్రీకరించింది. అందరికీ విద్య అనేది ఆధునిక ప్రజాస్వామ్య దేశాల లక్షణం. 'ప్రపంచాన్ని మార్చడానికి అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య' అని హక్కుల సూర్యుడు నెల్సన్ మండేలా అంటారు. భారతదేశం 75సంవత్సరాల అమృత ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో కూడా వందశాతం అక్షరాస్యతను సాధించడానికి ఆమడదూరంలో ఆగిపోయింది. ఆరు నుండి 14సంవత్సరాల లోపు వారందరికీ ఉచిత సార్వత్రిక విద్యను రాజ్యాంగం అమలులోకి వచ్చిన పది సంవత్సరాల లోపు అందించాలని ఆశించిన రాజ్యాంగ నిర్మాతలు ఆర్టికల్ 45 ద్వారా ఆదేశ సూత్రాలలో పొందుపరిచారు. యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ 1959 నవంబర్ 20న ఆర్టికల్ 29 ద్వారా 6 నుంచి 14సంవత్సరాలు అందరికీ విద్య హక్కుగా అందించాలని సూచించింది. భారతదేశంలో అర్ధ శతాబ్దం పాటు అనేకమంది విద్యావేత్తలు, సామాజికవేత్తల కృషి ఫలితంగా 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21ఏ ఆర్టికల్ చేర్చడంతో విద్యా హక్కును ఈ దేశ పౌరులు పొందగలిగారు. కానీ నేటికీ 6 నుండి 14సంవత్సరాల పిల్లలు 1.3కోట్ల మంది బడి ముఖం చూడని వారు ఉన్నారనే వాస్తవం దేశం రాజ్యాంగ లక్ష్యాలను సాధించడంలో తడబాటును తెలియజేస్తుంది.

విద్యాహక్కు చట్టం చేసి 13సంవత్సరాలు గడిచినప్పటికీ విద్యా హక్కును పొందలేని అభాగ్యులు దేశంలో నేటికీ ఉన్నారు. వీరిలో కూడా ఎస్సీ ఎస్టీలు ఆ తర్వాత బీసీలు అధిక శాతంగా ఉండడం శోచనీయం. బడిలో చేరిన పిల్లలు కూడా పదవ తరగతి లోపే 12.6శాతం మంది, ఎనిమిదో తరగతి లోపు 3శాతం మంది, ఐదో తరగతి లోపు 2శాతం మంది పాఠశాల వదిలి బాల కార్మికులుగా మారుతున్నారని యుడిఐఎస్‌ఇ 2021-22 నివేదిక చెపుతున్నది. పాఠశాలలో చేరిన పిల్లలకు కూడా నాణ్యమైన విద్య అనేది ఎండమావి గానే మారిందని అసర్ రిపోర్టు 2022 ద్వారా స్పష్టం అవుతుంది. రెండవ తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవగలిగిన మూడవ తరగతి పిల్లలు 20.5శాతం, ఐదవ తరగతి పిల్లలు 42.8శాతం మంది మాత్రమే ఉన్నారు. 69.6శాతం మంది ఎనిమిదవ తరగతి పిల్లలు మాత్రమే చాలా సాధారణమైన టెక్ట్‌ని చదవగలుగుతున్నారు. మూడో తరగతి పిల్లలలో తీసివేతలు చేయగలిగిన వారు 25.9శాతం, 5వ తరగతి పిల్లలలో భాగాహారం చేయగలిగిన వారు 25.6శాతం, ఎనిమిదో తరగతి పిల్లలలో భాగాహారం చేయగలిగిన వారు 44.7శాతం మాత్రమే ఉన్నారని అసర్ రిపోర్టు తెలియజేస్తున్నది. ఈ రిపోర్టులోని అంకెలు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాల బాధ్యతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఉపాధ్యాయుల కొరత, అదేవిధంగా 65.5శాతం పాఠశాలల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ తరగతులు ఒకే తరగతి గదిలో బోధించడం అనేది విద్య నాణ్యతలో లోపాలకు కారణాలు.

పేదలు అత్యధికంగా (22.89 కోట్ల మంది) ఉన్న దేశం భారత్ అని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలియజేస్తున్నది. సంపద పంపిణీలో తీవ్ర అసమానతలు విద్యాభివృద్ధికి ప్రధాన ఆటంకంగా ఉన్నాయి. నివేదిక ప్రకారం దిగువ నుంచి 50శాతం మంది ప్రజల వద్ద దేశ సంపదలో 3శాతం ఉంటే, మొదటి 30శాతం మంది వద్ద సంపదలో 90శాతం పోగుబడి ఉంది. అంతేకాక మొదటి పదిశాతం మంది దగ్గర 80శాతం సంపద పోగు పడిందంటే అసమానతలు ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతుంది. మొదటి ఒక శాతం మంది దగ్గర 45.6శాతం దేశ సంపద కేంద్రీకృతమైంది. పిల్లలందరినీ పాఠశాలలో చేర్చడానికి అవసరమైన 1.4లక్షల కోట్ల నిధిని మొదటి వందమంది బిలియనీర్లపై 2.5శాతం పన్ను వసూలు చేయడం లేదా మొదటి పదిమంది బిలియనీర్ల వద్ద 5శాతం చొప్పున పన్ను విధించడం ద్వారా రాబట్టవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వ పన్నుల విధానం అసమానతలు మరింత పెంచే విధంగా ఉన్నాయి.

కొఠారి కమిషన్ సార్వత్రిక విద్యను సాధించడం కోసం జీడీపీలో ఆరుశాతం నిధులు కేటాయించాలని సూచించింది. కానీ ఇప్పటివరకు మూడు శాతానికి మించి నిధులను కేటాయించకపోవడం పాలకులకు రాజ్యాంగ లక్ష్యాల సాధనలో చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. బడ్జెట్లో అత్యధిక నిధులను కేటాయిస్తున్న కేరళ ప్రభుత్వం దేశంలోనే సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించిన మొదటి రాష్ట్రం. 1990లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకుని విద్యా రంగాల్లో ప్రయివేటీకరణను విధానాలు ప్రవేశపెట్టడంతో దేశంలోనే కుటుంబ ఆదాయంలో అధిక శాతం విద్యకు ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాక ఈ ప్రయివేటీకరణ వలన సమానత్వాన్ని సాధించడానికి బదులు విద్యలో అసమానతలు ఆర్థిక అసమానతలకు కారణంగా మారింది. రాష్ట్రంలో జీఓ.117 పేరుతో పాఠశాలల విలీనం, ఉపాధ్యాయ పోస్టుల కుదింపును దీనిలో భాగంగానే చూడాలి. పాఠశాల స్థాయిలో బాలికలు బడిమానేయడానికి పాఠశాలలో టాయిలెట్ల సౌకర్యం లేకపోవడం, పాఠశాల అనంతరం ఇంటి పనులు చేయవలసి రావడం, బాలికల రక్షణకు సంబంధించిన ఆందోళన వంటివి కారణాలుగా ఉన్నాయి. విద్యార్థుల మధ్య డిజిటల్ విభజన కూడా విద్యా అసమానతలకు కారణం అవుతున్నది.

మానవాభివృద్ధి సూచీలో 191 దేశాల్లో 132వ స్థానానికి భారతదేశం పడిపోవడం అనేది దేశ నిజమైన అభివృద్ధిని సూచించదు. దేశ అక్షరాస్యతను వంద శాతం పెంచడానికి, అందరికీ విద్య నుండి అందరికీ నాణ్యమైన విద్య దిశగా పయనించడానికి ప్రధాన అవరోధాలుగా ఉన్న సంపద పంపిణీని సరిచేయటం, విద్యా రంగానికి జీడీపీలో ఆరు శాతం నిధులు కేటాయించడం చేయాలి. లింగ వివక్షత రూపుమాపడం, పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు పూరించడం, టాయిలెట్ల వంటి ప్రాథమిక సౌకర్యాలను పెంచడం ద్వారా మాత్రమే భారతదేశం నిజమైన అభివృద్ధిని సాధించగలదు.

**(నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం)**

**- జి.వెంకటేశ్వరరావు,సెల్ : 9966135289**

# 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వెనుక...



జి. రంగారావు

ఒక దేశం ఒక ఎన్నిక, అదే జమిలి ఎన్నికల నినాదం... కొన్నాళ్ళు తెరమరుగై మళ్లీ హఠాత్తుగా తెర మీదకి రావటం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనేక మార్పులు చకచకా జరిగిపోతున్న తీరుచూసి జనం విస్తుపోతున్నారు. హఠాత్తుగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ఏర్పాటు, జమిలి ఎన్నికల అంశాన్ని పరిశీలించటానికి కమిటీ వేస్తామని చెప్పటం, వెనువెంటనే రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో అమిత్‌షాతో కలిపి ఎనిమిది మంది సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాల జారీ శరవేగంగా జరిగాయి. పార్లమెంటును సమావేశపరుస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ పరిణామాలు జెట్ స్పీడుతో సాగి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

ఈ ఆదేశాల్లో ముఖ్యమైన అంశం ఈ కమిటీ తన పనిని వెనువెంటనే ప్రారంభించి వీలైనంత త్వరగా నివేదికను సమర్పించాలి. 'వీలైనంత త్వరగా' అనేది అతి ముఖ్యమైన మాట. ఎందుకంటే ఈ కమిటీకి కేవలం 15రోజుల వ్యవధి మాత్రమే నిర్దేశించారు పైకి చెప్పకపోయినా. సెప్టెంబర్ 3 నుంచి 17 వరకు ఉన్న వ్యవధి కేవలం 15రోజులు మాత్రమే. ఈలోగానే కమిటీ ఆసక్తి ఉన్న వర్గాల అభిప్రాయాలు వినాలి, వాదనలు పరిగణించాలి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలి, నివేదిక తయారు చేయాలి. ఎందుకింత హడావుడి? వాస్తవానికి నివేదిక ఇప్పటికే తయారైవున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ఈ ఎనిమిది మందిలో రాజ్యాంగం మీద అవగాహన ఉన్నది కేవలం ఇద్దరికే. వారు హరీష్ సాల్వే, సుభాష్ కశ్యప్. కాంగ్రెస్ నుంచి అధిర్ రంజన్ చౌదరి, కాంగ్రెస్ రెబెల్ నేత గులాంనబి ఆజాద్, అమిత్ షాతో కలిపి ముగ్గురు రాజకీయ నేతలు. న్యాయ శాఖామంత్రి ప్రత్యేక ఆహ్వానితుడు. ఒక్క అధిర్ రంజన్ చౌదరి తప్ప మిగిలిన అందరూ బీజేపీకి మద్దతుదారులే. దీన్నిబట్టి ఇదో తూతూ మంత్రం అంటూ అధీర్ రంజన్ ఈ కమిటీ నుంచి తప్పుకున్నారు. ప్రభుత్వం ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చింది. ఆ నిర్ణయానికి సంబంధిత వర్గాలతో సంప్రదింపులనీ, నిపుణుల కమిటీ నివేదిక అనీ రంగులు అద్దటం అవసరం. ఈ రంగులతోనే మోడీ ఆలోచనకు ఆమోద ముద్ర వేయించుకోవాలని బీజేపీ నేతల ఉద్దేశం. రేపు ఉత్తరోత్తరా వచ్చే న్యాయపరమైన చిక్కులకు ఈ కమిటీ నివేదిక ఒక సాకుగా ఉపయోగపడుతుంది. చేసేది తప్పయినా పద్ధతి ప్రకారం చేయటం మన రాజకీయాల్లో 'మంచి' సంప్రదాయం. అందుకే ఈ కమిటీ ఒక తంతు అనిపిస్తోంది. ఇంత తీవ్రమైన విషయాన్ని హడావుడిగా, అదీ ఎన్నికలు ఏడాదిలోపు ఉండగా, పరిశీలిం చాల్సిన అవసరమేంటి? కేవలం 15రోజుల్లో ఎలా పరిశీలించగలరు ఎంత గొప్ప నిపుణులైనా? ప్రభుత్వానికి 'తగిన' నివేదిక ఇస్తారనటంలో సందేహం లేదు. అనంతరం సభ్యు లకు తగినరీతిలో తాయిలాలు అందుతాయి !

సుభాష్ కశ్యప్ లాంటి వారు ఇంత తక్కువ సమయంలో ఎలా పరిశీలించాలని ప్రశ్నించాలి. కానీ ఏమీ అనరు. అందుకే ఈ కమిటీ ఒక తంతు అనిపిస్తుంది. మరోవైపు అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలు మరింత గందరగోళం సృష్టిస్తున్నాయి. లోక్‌సభకు, అసెంబ్లీలకు ముందస్తు ఎన్నికలుండవు అంటున్నారు. అలాంటప్పుడు ఇంత హడావుడిగా ఈ కోవింద్ కమిటీ ఎందుకు? పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచటం ఎందుకు? ప్రజల దృష్టిని మరల్చి, ఉమ్మడి పౌర స్మృతి, భారతీయ శిక్షా స్మృతిని చర్చ లేకుండా పార్లమెంటు ఆమోదం పొందటానికా? ప్రభుత్వ ఆలోచన ఏమిటో ప్రజలకు చెప్పాలికదా! మరీ ముఖ్యంగా ప్రభుత్వ ఆలోచన రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చేదిగా వున్నప్పుడు. అనేక క్లిష్టమైన విషయాలు ఇమిడి వున్నాయి జమిలి ఎన్నిక అనే అంశంలో. చట్టసభలకు ఐదేండ్ల కాల పరిమితి అనేది మార్చాలి. ముందస్తుగా లోక్‌సభనుగానీ శాసనసభనుగానీ రద్దు చేసే వీలుండదు. లోక్‌సభలోగానీ, అసెంబ్లీలోగానీ అవిశ్వాస తీర్మానం అనే అంశానికి అర్థం మారిపోతుంది. అవిశ్వాస తీర్మానం నెగ్గి, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యలేకపోతే అప్పుడు కేంద్రంలో పరిస్థితి ఏంటి? రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన పెట్టవచ్చు. కానీ మన రాజ్యాంగంలో కేంద్రంలో




రాష్ట్రపతి పాలనకు అవకాశం లేదు కదా. అధికారంలో ఉన్న పార్టీ చట్టసభ విశ్వాసం కోల్పోతే ప్రజల తీర్పు కోరటం ఇప్పుడున్న మార్గం. ఆ మార్గం బందవుతుంది. ప్రజలు నిస్సహాయులవుతారు. పైగా జమిలి అంటే రాష్ట్రాల హక్కులను హరించటమే కదా! ఈ ఆలోచన సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేదిగా ఉంది.

దేశ ప్రజలు ఆలోచించి అవగాహన చేసుకోవటానికి తగినంత సమయం ఇవ్వకుండా త్వరత్వరగా పని కానిచ్చేయటం మోడీ తీరు. పెద్దనోట్ల రద్దు కానియ్యండి, లాక్‌డౌన్ కానీయండి కేవలం నాలుగే నాలుగు గంటల వ్యవధితో ప్రజల మీద రుద్దిన అత్యంత కఠిన నిర్ణయాలు. ఒకసారి ఒక నిర్ణయాన్ని తీసుకున్నాం అని కరాఖండిగా చెబితే సరే అయ్యిందేదో అయ్యిందనే అభిప్రాయం సహజంగానే కలుగుతుంది. దీన్నే ఫెయిట్ అక్కంప్లి అంటారు సైకాలజీ పరిభాషలో. అయ్యిందేదో అయ్యింది, ఇప్పుడు ఒప్పుకోవడం తప్ప ఇంకేమి చేయలేము అనేది దీని సారాంశం. ఆమోద యోగ్యం కాని నిర్ణయాన్ని ఆమోదింపచేయటానికి బాగా తెలిసిన మానసిక మార్గం ఇది. దీన్ని చాలా సందర్భాల్లో వాడారు మన వ్యవస్థలో. ఉదాహరణకు ఆర్టికల్ 370 రద్దు అనేది ఎటువంటి సంకేతం లేకుండా ఒకే ఒక్క రోజులో పూర్తి అయ్యింది. చర్చ, సమాధానం లేవు.

అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకించటానికి రాజకీయ పార్టీలు బలంగా లేకపోవటం, ప్రధాన మీడియా సంస్థలు ప్రజల పక్షాన నిలబడక పోవటం, న్యాయ వ్యవస్థ నత్తనడక ఇక్కడ పెద్ద సమస్యలు. నియంతత్వ ధోరణి వున్నవారు ఎదుటివారికి ఆలోచించుకునే అవకాశం ఇవ్వరు. ఎంత త్వరగా ఫెయిట్ అక్కంప్లిని మదిలోకి చొప్పిస్తే అంత మంచిదనేది వీరి ఆలోచన. ఆలోచించే వ్యవధి ఇస్తే దానికి వ్యతిరేకంగా స్పందనలు రావటం, ఆందోళనలు మొదలవ్వటం, మీడియాలో రావటం ఇదంతా అనవసరం కాదా! ఆందోళనలను నిలువరించటం కన్నా నివారించటం మేలు కదా అనేది ఇక్కడ ఆంతర్యం.

మన దేశంలో హృదయాంతరాళంలో జీర్ణించుకున్న విశ్వాసాలకు విఘాతం కలిగితే తప్ప ప్రజలు స్వచ్ఛందంగా స్పందించరు. వీధుల్లోకి వచ్చి వీరంగం సృష్టించటం భారతీయుల స్వభావం కాదు. సిద్ధాంతానికి కట్టుబడినవారు, భావజాలంతో ప్రేరేపితమైనవారు తప్ప మెజారిటీ ప్రజలు పోలీసులకు కోర్టులకు దూరంగా ఉండాలనే కోరుకుంటారు. ఆందోళన చేసేవారు, అలజడి సృష్టించేవారు ఎక్కువగా అద్దెకు వచ్చిన మూకలే. అటువంటివారు, గుంపులో గోవిందయ్యలా తప్పించుకోవచ్చు అనుకుంటారు. లేకపోతే వారి యజమానులు వారి బాగోగులు చూసుకుంటారనే నమ్మకంతో ఉంటారు. సామాన్యజీవి చట్టాన్ని ఉల్లంఘించి ఆందోళన చేయాలనుకోడు. నోట్ల రద్దు నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరైనా ఆందోళన చేశారా? లాక్‌డౌన్ కూడా అంతేకదా! వందల కిలోమీటర్లు నడుచుకుంటూ ప్రాణాంతకమైన ప్రయాణం కొనసాగించారుగానీ ఎవరైనా నోరు మెదిపారా?

నేడు దేశం అనేక రంగాల్లో ఎన్నో క్లిష్టమైన సమస్యలను ఎదుర్కొంటున్నది. జనాభా పెరుగుదల, నిత్యా వసరాల ధరల పెరుగుదల, ఉపాధి లేమి, నిరుద్యోగ సమస్య, కోర్టుల్లో పెండింగు కేసులు, రైతులు ఎదుర్కొనే సమస్యలు, విదేశీ విధానంలో సమస్యలు... వీటిని వదిలి మరుగునపడ్డ జమిలి ఎన్నికల అంశాన్ని తెరమీదకు తేవడం ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికేమో అనే సందేహమూ కలుగుతుంది. జమిలి ఎన్నికల కోసం వేసిన కమిటీ పాలక వర్గాలకు సానుకూల నివేదిక ఇస్తుంది. హోంమంత్రి సభ్యుడుగా ఉండటమే ఇందుకు నిదర్శనం. దీన్ని బలంగా ప్రతిపాదిస్తున్న వారు కమిటీలో వుంటే అది నిపుణుల కమిటీ ఎలా అవుతుంది? స్వేచ్ఛగా చర్చ ఎలా సాధ్యమవుతుంది? బహుశా అందుకేనేమో కాంగ్రెస్ సభ్యుడు తప్పుకున్నాడు కమిటీ నుంచి. ఇప్పుడు మిగిలిన అందరూ బీజేపీ అనుకూలురే. సందట్లో సడేమియా అన్నట్లు ఈ ప్రత్యేక సమావేశాల్లోనే ఉమ్మడి పౌరస్మృతి బిల్లును కూడా ప్రవేశపెట్టవచ్చు. ఎన్నికలు ఒక్కటే ప్రజలకున్న ఆయుధం. దాన్ని వాడి ప్రజలు గెలుస్తారా లేక ప్రజలు ఓడి సంఘ్ పరివార్ గెలుస్తుందా అనేది కాలమే చెప్పాలి. ఏమో ఎవరు చూశారు? కర్నాటకలో ప్రజలు గెలవలేదా? మంచి జరుగుతుందని ఆశిద్దాం. మనిషి ఆశాజీవి కదా!

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం


శుక్రవారం | సెప్టెంబర్ 08, 2023 | www.navatelangana.com



## తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ చేసింది శూన్యం

### జిల్లా కాంగ్రెస్ నాయకులు మువ్వా విజయబాబు

**నవతెలంగాణ- ఖమ్మం**

జిగేల్ అనిపించేలా నాలుగు వీధిలైట్లు ఏర్పాటు చేయడం....మూడు రోడ్లు వేయడం....ఒకటి రెండు కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం అభివృద్ధి కాదని జిల్లా కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని మూడవ డివిజన్‌లో డివిజన్‌లోని ప్రతి గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మువ్వా మాట్లాడుతూ గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం నియోజకవర్గానికి చేసింది శూన్యమని విమర్శించారు. ఎంతో మంది అర్హులున్నా వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదని మండి పడ్డారు. వృద్ధాప్య, వితంతు పెన్షన్లు ఇవ్వడంలోనూ కేసీఆర్ ప్రభుత్వం విఫల మైందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇళ్లు లేని నిరుపేద లందరికీ రూ. 5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన వారందికీ రూ.4వేల పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్, నాయకులు మందడపు తిరుమలరావు, బోడా శ్రావణ్ కుమార్, చంద్రం, కాంపాటి వెంకన్న, నరాల నరేష్, మాలోత్ రాము పాల్గొన్నారు.




## అజయ్‌పై ఆరోపణలు అర్థరహితం

### బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల, సుడా చైర్మన్ బచ్చు

**నవతెలంగాణ - ఖమ్మం**

మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పై ఆరోపణలు అర్థరహితం అని సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, టిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇలా అభివద్ధికి కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో? చెప్పాలని ప్రశ్నించారు. చేసింది ఏమిటో చెప్పుకోండి... కానీ బీఆర్ఎస్ పై వ్యాఖ్యలు చేయడం సరి కాదని సూచించారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నారు? కానీ ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవినీతికి ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ చొరవతో మంత్రి పువ్వాడ అజయ్ జిల్లా నలుమూలల అభివద్ధి చేశారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మున్నేరు, గోళ్ళపాడు చానల్ సమస్య ను ఎందుకు పరిష్కరించలేకపోయారు, ప్రజల గురుంచి ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. సమావేశంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్ , నాయకులు ఆకుల మూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, షేక్ షకీన, తోగరు భాస్కర్, ఉపేందర్ పాల్గొన్నారు.



## బొగ్గు రవాణాను పరిశీలించిన...

### ఐఆర్‌టీఎస్ పీఈడీ టీటీ (ఎం) రాజేశ్‌పాటక్

**నవతెలంగాణ-సత్తుపల్లి**

సత్తుపల్లిలోని సైలో బంకర్ల ద్వారా బొగ్గు రవాణా ప్రక్రియను ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీటీ (ఎం) రాజేశ్ పాటక్ గురువారం తన బృందంతో కలిసి పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి దగ్గర నుంచి బెల్ట్ ద్వారా బంకర్లకు బొగ్గు చేరవేత, బంకర్ నుంచి వేగన్లకు లోడింగ్, నిల్వచేసే విధానం తదితరాంశాలను కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు రాజేశ్ పాటక్‌కు వివరించారు. బొగ్గు రవాణాపై జేవీఆర్ ఓసీలో అధికారులు తీసుకుంటున్న పద్ధతులపై ఐఆర్‌టీఎస్ ప్రిన్సిపల్ డైరెక్టర్ రాజేశ్ పాటక్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ ఆల్విన్, సీఎఫ్‌టీవో (రైల్వే) సురేందర్, కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవీ నరసింహారావు, డీజీఎం మార్కెటింగ్ సురేందర్‌రాజు, డిప్యూటీ ఎస్ఈ, సీహెచ్‌పీ మోహన్, సీహెచ్‌పీ ఈఈ ప్రదీప్‌కుమార్, ఏఈ రవి పాల్గొన్నారు.

## కృష్ణం.. వందే.. జగద్గురుం

### - కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే సండ్ర

**నవతెలంగాణ-సత్తుపల్లి**



శ్రీకృష్ణుడు గీతోపదేశదేశం ద్వారా మానవాళి మనుగడ ఎలా ఉండాలి, ఎలా నడుచుకోవాని, సన్మార్గం, ధర్మం, అధర్మం తెలుసుకొని ఎలా పయనించాలో ఉపదేశించిన జగద్గురువని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం స్థానిక జవహర్‌నగర్ శ్రీకృష్ణమందిరం వద్ద జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే సండ్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సండ్రకు కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జవహర్‌నగర్ చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించారు. ఆలయ ప్రాంగణంలో నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ చైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, నాయకులు ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, మానుకోట మధు, కౌన్సిలర్లు అద్దంకి అనిల్‌కుమార్, కృష్ణమందిరం ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటం చేయాలి

**నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్**



ఖమ్మం వన్‌టౌన్‌లో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తప్పుడు విధానాల కారణంగా దేశం, రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్ అన్నారు. ఈ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ చైతన్యవంతులై పోరాటంలోకి రావాలని అన్నారు. ఖమ్మం పాత బస్టాండ్‌లో పార్టీ వన్ టౌన్ కార్యదర్శి ఎంఏ జబ్బార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేయలేదని, నిరుద్యోగ భృతిని ఇవ్వలేదని, గృహ లక్ష్మీ పథకానికి ఐదు లక్షలు కేటాయిస్తామని చెప్పి కేవలం 3 లక్షల రూపాయలు ఇస్తామని అనటం సిగ్గుచేటని అన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఈ ఒకటి నుంచి ఏడు వరకు జరుగు ప్రచార ఉద్యమంలో భాగంగా గురువారం ఖమ్మం పాత బస్టాండ్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రం, సిపిఎం జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్కే వి ఏ మీరా, టూ టౌన్ కార్యదర్శి బోడబట్ల సుదర్శన్, ఆవాజ్ గౌస్, మహిళా సంఘం నాయకులు ఎస్.కె బేగం, భాగం అజిత, పార్టీ నాయకులు కూరపాటి శ్రీను,.భద్రం, భాస్కర్ రాజు పాల్గొన్నారు.

**తల్లాడ :** గోపాల్పేట గ్రామంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెరసాని వెంకటేశ్వర్లు, పేరసాని సత్యనారాయణ, కొమ్మూరి గోపాలరావు, ఆలస్యం బుచ్చయ్య పొట్ల రాఘవయ్య పాల్గొన్నారు.

**రఘునాథపాలెం :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం రామన్నపేట, జాన్‌బాద్ తండా గ్రామాలలో నిరసన తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కామంచికల్ జోన్ కన్వీనర్ పొన్నెకంటి సంగయ్య పార్టీ మండల కమిటీ సభ్యులు తాటికొండ శ్రీనివాసరావు, భూక్య కృష్ణ, శాఖా కార్యదర్శులు భూక్య కోటేష్, కూచిపూడి మధు, పార్టీ సభ్యులు, భూక్య వీర, పడిగల వీరయ్య, పడిగల నాగేశ్వరరావు పాల్గొన్నారు

**ముదిగొండ :** పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలో చిరుమర్రిలో సిపిఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామశాఖ కార్యదర్శి సామినేని రామారావు మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు పెరిగిన ధరలను అరికట్టటంలో వైఫల్యం చెందారని ఆరోపించారు. సామాన్య ప్రజలపై అధిక బారాలు మోపి, బడాబాబులకు రాయితీలు కల్పిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మోర రామారావు, చావగాని మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

**సత్తుపల్లిరూరల్ :** అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి కుదింపు తదితర ప్రజా వ్యతిరేక విధానాలను నిరసస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గ్రామాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. తాళ్ళ మడ, కాకర్లపల్లి గ్రామాలలో సిపిఎం నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి వేపులపాటి కుమారస్వామి, ఆ పార్టీ మండల నాయకులు కొలికపోగు సర్వేశ్వరావు, బండి వేలాద్రి, లక్ష్మీనారాయణ, షేక్ ఫరనా, భిక్షం, చిట్టెమ్మ పాల్గొన్నారు.


ఖమ్మంరూరల్

**ఖమ్మంరూరల్ :** పెంచిన నిత్యావసర ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) నాయకులు పొన్నెకంటి సంగయ్య అన్నారు. నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని రామన్నపేట, జాన్ బాద్ తండాలో గురువారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తాటికొండ శ్రీనివాసరావు,భూక్య కష్ణ,భూక్య కోటేశ్,కూచిపూడి మధు,భూక్య వీర,పడిగల వీరయ్య, నాగేశ్వరరావు, మద్దినేని లక్ష్మయ్య, శ్రీనివాసరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


తల్లాడ



సత్తుపల్లిరూరల్


ముదిగొండ

# సీపీఐ(ఎం) అభివృద్ధికి నరసింహారావు ఎనలేని కృషి

### పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు

**నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్**



సీపీఐ(ఎం) అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన నాయకుడు ఎర్ర నరసింహారావు అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. రాత్రి 11:30 గంటల సమయంలో అనారోగ్యంతో ఖమ్మం సుందరయ్య నగర్‌లోని ఆయన స్వగహం నరసింహారావు మృతి చెందారు. నరసింహారావు భౌతిక కాయానికి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ ఎర్ర నరసింహారావు వ్యవసాయ మార్కెట్లో దడవాయ సంఘానికి అధ్యక్షుడిగా పనిచేసి వారి సమస్యల పరిష్కారానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. అంతేకాకుండా బోస్ సెంటర్లో పార్టీ అభివృద్ధికై ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని, వారి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటాన్ని కొనసాగించేవారని అన్నారు. అలాగే సుందరయ్య నగర్ ప్రాంతంలో కూడా కార్మిక వర్గం కోసం ప్రజా సమస్యల కోసం ఎంతో కాలం పని చేసి పార్టీకి నిబద్ధతతో సేవలందించారన్నారు. కార్యకర్తలకు పార్టీపై విశ్వాసం కలిగించే విధంగా వారిని చైతన్యపరిచేవారని అన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీకాంత్, వై విక్రం, బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, బండి పద్మ, ఎర్ర శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, వజినేపల్లి శ్రీనివాసరావు, తుషాకుల లింగయ్య, ఆర్‌జెసి కృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, బండారు యాకయ్య, బండారు వీరబాబు, ఎంఏ జబ్బర్, ఎండి గౌస్, ఎస్కే సైదులు, ఎర్ర రమేష్, ఎర్ర గోపి, ఎర్ర సుకన్య, షేక్ హిమామ్, పగడాల మోహన్ రావు, పోతురాజు జార్జి, నాయిని నరసింహారావు, ఎర్ర మల్లికార్జున్, రంగు హనుమంతచారి, పెద్దోజు ఉపేంద్ర చారి, బెజవాడ చంద్రశేఖర్, జంగం నగేష్, రంగు పుష్పావతి, సోమనబోయిన వెంకటేశ్వర్లు, ఎర్ర అప్పారావు, పత్తిపాక రమేష్, ముక్కాల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.




## కమ్యూనిస్టులు లేకుంటే తెలంగాణా ఊసే లేదు

### రావినారాయణరెడ్డి వర్ధంతి సభలో బాగం

**నవతెలంగాణ-ఖమ్మం**

కమ్యూనిస్టులు, ముస్లీంలకు వ్యతిరేకంగా సాయుధపోరాటాన్ని నిర్వహించ లేదని, పెత్తందార్లు, దొరతనానికి బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే నిజాం రాజ్యం దేశంలో విలీనమైందని కమ్యూనిస్టుల పోరాటం లేకుండా తెలంగాణ ఊసేలేదని ఆయన స్పష్టం చేశారు. సాయుధపోరాట యోధుడు రావినారాయణ రెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాపితంగా సాయుధ పోరాట వార్షోవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 17వ తేదీన ముగింపు సందర్భంగా హైదరాబాదులో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు, ఈ సభలో సి.పి.ఐ జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గసభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కె.జానిమియా, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### భారత్ జోడోయాత్రకు ఏడాది పూర్తైన సందర్భంగా పాదయాత్ర

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నేటితో ఏడాది పూర్తి అయిన సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాదయత్ర నిర్వహించారు. ఈ పాదయత్రలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ..ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతంగా జరిగి మొదటి వార్షికోత్సవం అవుతున్న సందర్భంగా నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వన్ టౌన్ పరిధిలోని మయూరి సెంటర్ నుండి జెడ్పి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలనే ప్రజల సమిష్టి కోరిక బలంగా పెరిగింది అన్నారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలు అందరూ కష్టపడి కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశలో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, కొత్తా సీతారాములు, యడ్లపల్లి సంతోష్, మువ్వా విజయ్ బాబు, బేబీ స్వర్ణ కుమారి, రామిరెడ్డి చరణ్ రెడ్డి, అమర్జహాన్ బేగం, దొబ్బల సౌజన్య, పొంగులేటి ప్రసాదరెడ్డి, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు ,కొప్పెర సరితా ఉపేందర్, తోటకూర రవి శంకర్, పాలకుర్తి నాగేశ్వరావు, భోజడ్ల సత్యనారాయణ, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కల్లూరు :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్దబోయిన దుర్గాప్రసాద్ అధ్యక్షతన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం నుండి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు బైరెడ్డి మనోహర్ రెడ్డి, స్టేట్ ఎస్సీ సెల్ కన్వీనర్ కొండూరు కిరణ్, ఎంపిటిసి మాదిరాజు లక్ష్మణరావు, మాజీ ఎంపిపి గోపాలస్వామి, మాజీ ఎంపిటిసి జిల్లేళ్ళ కృష్ణారెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు గుండ్ల పుల్లారావు, మండల ఎస్‌సీ సెల్ అధ్యక్షులు లింగపోగు కృష్ణ, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు చోటు, ప్రచార కమిటీ అధ్యక్షులు బొడ్డు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు తోట జనార్ధన్, కోటి కృష్ణారెడ్డి, జినుగు భాస్కర్‌రావు, చుక్కా, చెన్నూరు సొసైటీ డైరెక్టర్ బండి శ్రీను, ఎక్కిరాల వీరయ్య పాల్గొన్నారు.

**తిరుమలాయపాలెం :** రానున్న ఎన్నికల్లో భారత దేశానికి కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీ అని జడ్పిటిసిల రాష్ట్ర సంఘ అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్ తెలిపారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో బెల్లం శ్రీనివాస్ తన ఛాంబర్‌లో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామసహాయం అరవింద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరన్న, కాంగ్రెస్ నాయకులు షేక్.గోరేమియా, సోమయ్య, సుదర్శన్, తాటికొండ కిరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**కారేపల్లి :** జాతీయ కాంగ్రెస్ కార్యదర్శి రాహుల్ గాంధీ చేసిన జోడో యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తి అయిన స,ందర్భంగా వైరాలో టీపీసీసీ సభ్యులు ధరావత్ రాంమ్మూర్తి నాయక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంఘీబావ యాత్రకు కారేపల్లి మండలం నుండి కాంగ్రెస్‌కార్యకర్తలు తరలి వెళ్ళారు. టీపీసీసీ మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు వాహనాలల్లో వైరా వెళ్ళి ర్యాలీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు వాంకుడోత్ గోపాల్‌నాయక్, నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, దారావత్ భద్రునాయక్, బోళ్ల రమేష్, ఓంప్రకాశ్ బూబ్, పురం అంజన్‌కుమార్, బాబు, గమిడి నర్సింహారావు, వీరన్న భడూక్యా బాలు, లాకావత్ రాజేష్, మూడు సంజు, రవి, రాజేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**బోనకల్ :** వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘీభావంగా మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏఐసిసి, పిసిసి, సిఎల్పీ నాయకులూ పిలుపు మేరకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో యాత్రకు సంఘీభావంగా రావినూతల గ్రామంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.ముందుగా యాత్రను పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ ఇందిరాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి పాదయాత్రకు జండా ఊపి ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు బైక్ ర్యాలీతో బోనకల్లు చేరుకొని అంబేద్కర్, జగజ్జీవన్ రావు విగ్రహాల వద్ద నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో జడ్పిటిసి మోదుగు సుధీర్ బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు సర్పంచులు భూక్య సైదా నాయక్, చిలకా వెంకటేశ్వర్లు, ములకారపు రవి, ఎర్రంశెట్టి సుబ్బారావు, ఉమ్మినేని బాబు, యంగళ దయామని, కలకోట సొసైటీ అధ్యక్షులు కర్నాటి రామ కోటేశ్వరరావు, నాయకులు ఉమ్మనేని కృష్ణ, చేబ్రోలు వెంకటేశ్వరరావు, గాంధీ పథం నాయకులు పాసంగుల పాటి కోటేశ్వరారావు, బోయినపల్లి మురళి, బంధం తిరుపతిరావు, నల్లమోతు సత్యనారాయణ పాల్గొన్నారు.


ఖమ్మంకార్పొరేషన్

**వైరాటౌన్ :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ చేపట్టిన హార్ట్ సే హాత్ జోడో యాత్ర చేసి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో వైరాలో సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. వైరా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మహిళా కాంగ్రెస్ నాయకులు వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు టిపిసిసి సభ్యులు ధరావత్ రామ్మూర్తి నాయక్ కు తిలకం దిద్ది, హారతి ఇచ్చి సంఘీభావ యాత్రను ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి స్థానిక క్రాస్ రోడ్డు వరకు సంఘీభావ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షు రాలు పగడాల మంజుల, ఉప్పెర్ల ఆనంద ప్రసాద్, కట్ల సంతోష్, కట్ల నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు, నంద్రు నాగరాజు, గుత్తికొండ వీరబాబు, పాణ్యం భాస్కర్, కట్ల సాయికిరణ్, గుత్తా సిద్దు, బలగం నరసింహారావు, వెంపటి రంగారావు, కంభంపాటి సత్యనారాయణ, బాణాల జనార్ధన్, అంజన్ కుమార్ యాదవ్, బద్రు నాయక్, గోపాల్, ఓం ప్రకాష్, బొల్లా రమేష్, వీరన్న, సాగర్, రవి, శంకర్, బానోత్ సైదా, రేచర్ల పుల్లయ్య, తేజావత్త రామకృష్ణ, నంద్రు గోపి,పాల్గొన్నారు.

**తల్లాడ :** కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర సంవత్సరం గడిచిన సందర్భంగా గురువారం తల్లాడలో ర్యాలీ నిర్వహించారు. తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్ నుంచి ప్రారంభమైన రోడ్ షో అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాపా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దగ్గుల రఘుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు కటికి కిరణ్, కిసాన్ సెల్ అధ్యక్షులు ఎర్రి కృష్ణారావు, ఎస్టీ సంఘం అధ్యక్షులు భూక్య అంజయ్య ఎస్సీ సెల్ అధ్యక్షులు తాళ్ల వెంకటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షులు రాఘవ, లంబాడీ హక్కుల సమితి అధ్యక్షుడు దశరథ్ నాయక్, కాపా శ్రీనివాసరావు, కాప వీరభద్రరావు, నరసింహారావు, టౌన్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జోసెఫ్ గుండ్ల వెంకటేశ్వర్లు, జమాల్, తదితరులు పాల్గొన్నారు.

**ఎర్రుపాలెం :** దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, విభజన రాజకీయాలు, ప్రజాస్వామ్య పరిరక్షణపైనా, దేశానికి ద్వేషం కాదు కావాల్సింది ప్రేమ అంటూ కన్యా కుమారి నుంచి కాశ్మీర్ దాకా రాహుల్ గాంధీ జోడో పాదయాత్ర చేపట్టి చరిత్ర సృష్టించారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన జూడో పాదయాత్ర సంవత్సరం అయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఎర్రుపాలెంలో పాదయాత్రను నిర్వహించారు. రింగ్ సెంటర్, గాంధీ విగ్రహం వద్ద నుండి అంబే ద్కర్ సెంటర్ వరకు కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శీలం ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నర్సింహారావు, షేక్ ఇస్మాయిల్, కడియం శ్రీనివాస్‌రావు, అనుమోలు వెంకట కృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, లక్కిరెడ్డి నర్సిరెడ్డి, యరమల వెంకట రెడ్డి, దేవరకొండ శ్రీను, గూడేటి బాబురావు, కంచర్ల వెంకట నర్సయ్య పిల్లి బోస్ బాబు, సగ్గుర్తి వెంకట నారాయణ, నాగిరెడ్డి శ్రీను, తల్లపురెడ్డి వెంకట రామిరెడ్డి, బాణవతు శ్రీను, పాముల లక్ష్మణరావు, గద్దల రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రుపాలెం


కల్లూరు


బోనకల్


కారేపల్లి


తల్లాడ


తిరుమలాయపాలెం


వైరాటౌన్



## విద్యాబోధనతో పాటు సామాజిక స్పృహ ఉండాలి

### - ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షౌకత్‌అలీ

**నవతెలంగాణ-సత్తుపల్లి**

ఉపాధ్యాయులకు విద్యాబోధనతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్‌అలీ అన్నారు. గురువారం సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన సభలో షౌకత్‌అలీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సన్మా గ్రహీతలు చిత్తలూరి ప్రసాద్, కంభంపాటి వెంకటేశ్‌ల సన్మాన కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు. ఉత్తమ అవార్డు గ్రహీతలు ప్రసాద్, వెంకటేశ్‌లు సమాజసేవకు పాటుపడటం అభినందనీయమన్నారు. గత కొని దశాబ్దాలుగా వీరిరువురు సమాజ సేవలో తరిస్తున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూసుమంచి ఎస్సై కృష్ణప్రసాద్, సృజన సాహితీ వేదిక బాధ్యులు గట్టే వాసు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత బొల్లేపల్లి మధుసూదనరాజు, విశ్వశాంతి యాజమాన్య బాధ్యులు నరుకుళ్ల సత్యనారాయణ, అవినాశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కౌన్సెలింగ్ తేదీ పొడిగింపుపై విద్యార్థుల హర్షం

### మంత్రి హరీష్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం

**నవతెలంగాణ- ఖమ్మం**

తెలంగాణ విద్యార్థులకు నీట్ రెండో విడత పొడిగింపుపై డాక్టర్ అకాడమీ విద్యార్థులు హర్ష వ్యక్తం చేశారు. గురువారం ఖమ్మంలోని డాక్టర్స్ అకాడమీ డైరెక్టర్ సష్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులు వారి తల్లిదండ్రులు మూడు రోజుల నుంచి చేస్తున్న ఆందోళనకు మంత్రి గురువారం జరగవలసిన రెండో విడత కౌన్సిలింగ్ను శుక్రవారం వరకు పొడిగించారని తెలిపారు. కౌన్సిలింగ్ పొడిగించడం పట్ల విద్యార్థులు హర్ష వ్యక్తం చేశారు.

## కార్మికుడికి ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ఆర్థికసాయం

**నవతెలంగాణ- ఖమ్మం**

ప్రగతిశీల రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు ) ఆధ్వర్యంలో రాడ్ బెండింగ్ మేస్త్రి కుంట్ల సతీష్ కార్మికుడు పని ప్రదేశంలో గాయపడటం జరిగిందని, దానివలన కుడి కాలు బొటనవేలు మొత్తం తీసివేయడం జరిగిందని, ఈ సందర్భంగా సతీష్‌ను, వారి కుటుంబాన్ని పరమర్శించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయు) జిల్లా అధ్యక్షులు షేక్ సుభాహన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ పటేల్, నాయకులు గౌని మోహన్ రావు పాల్గొన్నారు.

## నేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**నవతెలంగాణ-ఖమ్మం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఖమ్మంఅర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) ఖమ్మం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ ఒక ప్రకటనలో కోరారు. పెరిగిన ధరలతో ప్రజలపై భారం పడుతుందన్నారు.

## చెట్టు తొలగించుటకు వేలం పాట

**నవతెలంగాణ-వైరాటౌన్**

వైరా మునిసిపాలిటీ పరిధిలోని 13 వార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న వేప చెట్టు తొలగించి విక్రయించేందుకు సెప్టెంబర్ 11వ తేదీ ఉదయం 11 గంటలకు వైరా ఆరోగ్య కేంద్రంలో వేలం పాట నిర్వహించుటకు కమిటీ ద్వారా నిర్ణయించటం జరిగిందని, కావున వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు వైరా ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో కోరారు.



## గొర్రెలు పంపిణీ

**నవతెలంగాణ-ముదిగొండ**

మండలంలోని న్యూలక్ష్మీపురంలో యాదవ కురుమ లబ్దిదారులు 18 మందికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెలను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి పి అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను యాదవులు వినియోగించుకొని సద్వినియోగపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాగదాని కన్నయ్య, ఎంపీటీసీ సభ్యురాలు నానబాల మాధవికిరణకుమార్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శి వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకట్ గౌడ్, యాదవ సంఘం మండల అధ్యక్షులు ధనియాకుల వీరస్వామి, గ్రామపంచాయతీ వార్డు మెంబర్ మారుతి వీరయ్య, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మోరం పాపారావు, నాయకులు వెల్లటూరు గురవయ్య, కుటుంబరావు, బాబు, వాకదాని చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## బాలభారతి విద్యాలయం విద్యార్థి ఎంపిక

**నవతెలంగాణ- తల్లాడ**



తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్స్ సెలక్షన్లో బాల భారతీయ విద్యాలయ విద్యార్థి కోటగిరి హితేష్ అర్హత సాధించారు. ఆగస్టు 10న హకీంపేటలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌లో తన ప్రతిభను చాటి అర్హత సాధించారు. కోటగిరి రితేష్‌ను మండల విద్యాశాఖ అధికారి ఎన్ దామోదర్ ప్రసాద్, బాలభారతి విద్యాలయ కరస్పాండెంట్ కోట గిరి ప్రవీణ్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన బోడియతండా యువకుడు

**నవతెలంగాణ-కొణిజర్ల**



మండల పరిధిలోని బోడియతండా గ్రామానికి చెందిన వడ్తియ్యా వంశీ అనే యువకుడికి హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. బోడియతండా నుంచి మొట్టమొదటి వైద్య విద్యార్థిగా సీటు సాధించిన వంశీకి గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా వంశీ తల్లిదండ్రులు హరిసింగ్ సునీతలు ఆనందం వ్యక్తం చేశారు.

## ‘శ్రీ రామకష్ణ’లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్**



శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శ్రీ రామకృష్ణ విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలో గుట్టల బజార్‌లోని శ్రీ రామకృష్ణ విద్యాలయం చిన్నారి, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పిల్లలు అందరూ వచ్చి శ్రీ కష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారి విద్యార్థులు కలిసి కష్ణుడు కు పూజ చేసి, పిల్లలందరూ కలిసి ఉట్టి కొట్టి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యా సంతోషా గౌతమ్, పాఠశాల అధ్యక్షులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, పాఠశాల కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు సురేఖ, సహ కార్యదర్శి చరణ్, పాఠశాల లోని ఆచార్యులు పాల్గొన్నారు.

# ఏటీఎంల నుంచి డబ్బులు దోచుకుంటున్న ముఠా అరెస్ట్

**నవతెలంగాణ- ఖమ్మం**



జిల్లాలో ఏటీఎంల నుంచి డబ్బులుకొల్లగొడు తున్న ఓ ముఠాను ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం వన్ టౌన్ సిఐ స్వామి తెలిపారు. గురువారం ఖమ్మంలోని ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ స్టేషన్ రోడ్డులో గల సంభాధ్రి బ్యాంక్ ఏటియం వద్ద పట్టుకుంటామని తెలిపారు. వీరి వద్ద నుండి 34 ఏటీఎం కార్డులు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వీరు హర్యానా రాష్ట్రం తహశీల్ మేవు జిల్లాకు చెందిన వారిస్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంహమీర్ పూర్ తాసీల్‌కు చెందిన నిషాద్ రాధేశ్యామ్, నిషాద్ సంజయ్‌లు ముఠా సభ్యులు ఏటీఎంల నుంచి డబ్బులు దోచుకున్నట్లు పోలీసుల విచారణలో తేలిసిందని తెలిపారు. నగరంలోని ప్రవేటు బ్యాంక్ ఏటీఎంలో డబ్బు కాజేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఈ ముఠా సభ్యులు హరియాణా రాష్ట్రం తహశీల్ మేవ్ జిల్లా పిప్రోలి గ్రామం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, బట్‌పుర్తండా జలాలా, కురారా ఠానా గ్రామం, భామిలి పోస్ట్, హమీర్‌పూర్ తాసిల్ ప్రాంతాలకు చెందిన వ్యక్తుల ద్వారా బ్యాంక్ ఖాతాలు ప్రారంభించి వారి ఒక్కొక్కరి ఖాతాలలో ముప్పై నుండి నలభై వేల వరకు డబ్బు జామ చేస్తారని, వారి ఏటియం కార్డులు తీసుకుంటారని, ఇలా ఏటీఎం కార్డులు తీసుకుని చోరీలకు పాల్పడు తున్నారని తెలిపారు. ముఠా సభ్యులు జట్టుగా ఏర్పడి ఒకరు ఏటీఎం లోపలకు వెళ్లి యధా విధిగా డబ్బులు డ్రా చేస్తారని, డబ్బులు ఏటియం మిషన్ నుండి కొద్ది పాటి కనిపించే వరకు బయటకు వస్తున్న క్యాష్ ను చేయి అడ్డుపెట్టి నిలిపేస్తారు. రెండు సార్లు బిప్ శబ్దం రాగనే డబ్బులు తీసుకుంటారు. ఇలా చేయడం వల్ల యంత్రంలో నుంచి నగదు బయటికి వస్తుందే కానీ..సంబంధిత ఖాతాదారుడి ఖాతాలో మాత్రం లావాదేవీలు విఫలం అయిందని రిసెప్ట్ వస్తుందని, వెంటనే కస్టమర్ కేర్ కు కాల్ చేసి విషయం చెపుతారని, 15 రోజుల్లో తిరిగి వారి ఖాతాలో నగదు జామ అవుతుందని, ఇలా వచ్చిన సొమ్మును ముఠా సభ్యులు, వాటాగా పంచుకుంటారని తెలిపారు. వీరిని అదుపులో తీసుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి

### జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు

### పలు కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

**నవతెలంగాణ - ఎర్రుపాలెం**



మధిర నియోజకవర్గ శాసన సభ్యులుగా మూడు పర్యాయాలు గెలిచి భట్టి విక్రమార్క ఏ ఒక్క కుటుంబానికైనా సహాయం చేశారా, తన హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని, ఎప్పుడో ఒకసారి నియోజకవర్గానికి వచ్చిపోయే భట్టిని ఓడించి తనకు ఒక్కసారి ఎంఎల్‌ఏగా అవకాశం ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు కోరారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి కమల్‌రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనిగండ్లపాడు గ్రామంలో సిద్ధారెడ్డి ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రి శిథిలమై పోతే ఎమ్మెల్యేగా భట్టి పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి 60 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి శిథిలమైన ప్రభుత్వ ప్రాథమిక కేంద్రాన్ని నూతనంగా నిర్మిస్తున్నామని అన్నారు. ఒక్కసారి శాసన సభ్యుడిగా మధిర నియోజకవర్గంలో అవకాశం ఇవ్వాలని, మిమ్మల్ని కడుపులో పెట్టుకొని చూసుకుంటానని, పార్టీ మీకు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం ఎర్రుపాలెం, మీనవోలు, భీమవరం, పెద్ద గోపవరం గ్రామాల నుండి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నుండి పలు కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, ఎంపీపీ దేవర కొండ శిరీష, ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు పంబి సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, మొగిలి అప్పారావు, షేక్ మస్తాన్ వలి, కిషోర్ బాబు, కొండపాటి సాంబశివరావు, దేవరకొండ రవి, పులి శిరీష, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీపీఐ(ఎం) సానుభూతిపరురాలు పెదపాక రాంబాయమ్మ మృతి

**నవతెలంగాణ-నేలకొండపల్లి**



మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) సానుభూతిపరాలు పెదపాక రాంబాయమ్మ(71) గురువారం మృతి చెందారు. ఆమె గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు భర్త, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె భౌతికకాయాన్ని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంబాయమ్మ మృతి పార్టీ అభివృద్ధికి తీరని లోటు అన్నారు. ఆమె భర్త పెదపాక పుల్లయ్య పార్టీ శాఖ సీనియర్ నాయకులుగా గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలలో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పెదపాక రాంబాయమ్మ పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకిత భావంతో ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే ఆమెకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి పెద్దపాక భాస్కరరావు, పెదపాక మల్లేశ్వరరావు, పసుపులేటి నారాయణ, పెదపాక వెంకటేశ్వర్లు, పెదపాక నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై లైంగికదాడికియత్నం

### కేసు నమోదు

**నవతెలంగాణ - బోనకల్**

పొలములో ఒంటరిగా పనిచేసుకుంటున్న ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోనే మోటమర్రి గ్రామంలో గురువారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మోటమర్రి గ్రామానికి చెందిన బాధితురాలు గురువారం తన పొలంలో ఒంటరిగా పని చేసుకుంటుంది. ఇదే సమయంలో అదే గ్రామానికి చెందిన వంగాల కిరణ్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. దీంతో మహిళ అతను నుంచి విడిపించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసింది. అయినా ఆ యువకుడు వదిలిపెట్టకపోవడంతో పెద్దగా కేకలు వేయటంతో సమీపంలో ఉన్న కిరణ్ తల్లి రావటంతో తల్లితోపాటు కిరణ్ వెళ్ళాడు. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది.

**ఎస్ఐ అవమానకరంగా మాట్లాడారు : బాధితురాలు**

తనపై వంగాల కిరణ్ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని బాధితురాలు విలేకరుల ముందు తెలిపింది. తన ఫిర్యాదును చదివిన ఎస్సై బొల్లెద్దు సాయికుమార్ తనను అవమానిస్తూ మాట్లాడారని తెలిపింది. పొలం సమీపంలో గుబురుగా చెట్లు గాని, రూము గాని లేదు కదా అందులోనూ ఉదయం పూట నీపై ఎలా అత్యాచారయత్నానికి పాల్పడతాడని, తనతో ఎస్సై అవమానకరంగా మాట్లాడారని బాధితురాలు బోరిన విలపించుకుంటూ చెప్పింది. తనకు అన్యాయం జరిగింది న్యాయం చేయమని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళితే మహిళ అని కూడా చూడకుండా తనను పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అవమానపరిచాడని తెలిపింది. అత్యాచారయత్నం కేసు నమోదు చేయనని, కిరణ్ నిన్ను కొట్టినట్లు మాత్రమే కేసు నమోదు చేస్తానని, తాను రాసిన పిటిషన్ ను మరల మార్చి రాశారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పెనుగులాటలో తన జాకెట్టు చినిగిన విషయాన్ని విలేకరులకు చూపించి బోరున విలపించింది.

కేసు నమోదు చేశాం : ఎస్ఐ

తాను మహిళ పట్ల అవమానకరంగా మాట్లాడలేదని ఎస్సై సాయి కుమార్ తెలిపారు. విచారణలో భాగంగానే తాను ఆమెను ప్రశ్నించినట్లు తెలిపారు. సంఘటన తీరును మాత్రమే ఆమెను అడిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మండలంలో ఎంఎల్‌ఏ సండ్ర పర్యటన

**నవతెలంగాణ- కల్లూరు**

మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గురువారం పట్టణంలోని ఖాన్ ఖాన్ పేటలో ఆర్టీసి డ్రైవర్ దాసరి వెంకటేశ్వరావు (డి.వి) కుమార్తె వివాహ వేడుకలో, క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన షారోన్ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ షాప్‌ను ప్రారంభించారు. శాంతినగర్‌కు చెందిన ఎంబిబిఎస్‌లో సీట్లు సాధించిన ఖమ్మంపాటి అమూల్య, కొత్తపల్లి వంశీలను, వారి తల్లిదండ్రులను అభినందించారు. కొర్లగూడెం గ్రామానికి చెందిన కారుమంచి రాకేష్, స్వాతి ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. చెన్నూరు, ఏర్రబోయినపల్లి గ్రామలలో జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకంక్షలు తెలిపారు. ఎర్రబోయినపల్లి, కల్లూరు, రామనగర్ ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను. పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలెపు రామారావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, ఏఎంసి వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, జడ్పీ మండల కోఆప్షన్ సభ్యులు ఎండి ఇస్మాయిల్, షేక్ కమ్లి, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ , మండల సెక్రెటరీ కొరకొప్పు ప్రసాద్, నాయకులు దేవరపల్లి భాస్కర రావు, పోట్రు ప్రవీణ్, కిరణ్ బ్రదర్స్, మాజీ జెడ్పీటీసీ మేకల కృష్ణ, మాజీ సర్పంచ్ బంకా బాబు, సర్పంచ్‌లు నందిగాం ప్రసాద్, శింగిసాల పద్మ ప్రసాద్, బైరెడ్డి నరసింహారెడ్డి, కొమ్మినేని నరసింహారావు, పసునూరి శ్రీనివాసరావు, కట్టా అర్జప్ప, కొంగల లేహం, చారుగుండ్ల సందీప్, ఆలయ డైరెక్టర్లు అజ్మీరా జమలయ్య, భానోత్ బాలు, ఎస్సిసెల్ నాయకులు బొక్కా వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా ప్రతినిధులు కిరణ్, ఏనుగుల అంజి, మోదుగు వీరయ్య, చాట్ల సునీల్, పోట్రు రామకష్ణ, ఎంపిటిసి జినుగు శ్రీనివాసరావు, జాలా అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి కేటీఆర్‌ను కలిసిన మదన్‌లాల్

**నవతెలంగాణ-వైరాటౌన్**

తెలంగాణ రాష్ట్ర ఐటీ అండ్ పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరావు విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ వచ్చిన సందర్భంగా వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బానోత్ మదన్ లాల్ గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి మంత్రి కేటీఆర్ ను మర్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు



## ఘనంగా నవదుర్గామాత వార్షికోత్సవ వేడుకలు

**నవతెలంగాణ - బోనకల్**

బోనకల్‌లోని నవదుర్గామాత దేవాలయ రెండవ వార్షికోత్సవ వేడుకలను గురువారం మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అమ్మవారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అమ్మవారి నామస్మరణతో దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ బోనాల కార్యక్రమంలో చింతల పద్మ, లలిత కుమారి, లక్కీ శెట్టి అన్నపూర్ణ, పోటు పద్మ, నిమ్మల సుజాత, వెచ్చా దేవి తదితరులు పాల్గొన్నారు.



## దేశెట్టి కోటిరెడ్డి జ్ఞాపకార్థం సెటిల్ టోర్నమెంటు

**నవతెలంగాణ- ఖమ్మం**

ఖమ్మం టూ టౌన్‌లో 53 డివిజన్లో దేశెట్టి కోటిరెడ్డి జ్ఞాపకార్థం సెటిల్ టోర్నమెంటు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా బోడపట్ల వెంకన్న ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బుర్రి వెంకట్ కుమార్, మాజీ కార్పొరేటర్ సిపిఎం నాయకులు శ్రీనివాసరావు, భాస్కర్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల ఎన్నిక

**నవతెలంగాణ-ముదిగొండ**





సీఎల్పీ నేత మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మినేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ముదిగొండ, చిరుమర్రిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన అధ్యక్షులను గురువారం ఎన్నుకున్నారు. ముదిగొండ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా మందరపు ఉపేందర్‌రావు, చిరుమర్రి గ్రామశాఖ అధ్యక్షులుగా సామినేని సాంబయ్యలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో నాలుగో జోన్ ఇంచార్జిలు పిల్లుట్ల రాఘవ, తాటికొండ రమేష్, బిసి సెల్ మండల అధ్యక్షులు పల్లపాటి కృష్ణ, ముదిగొండ గ్రామ ఉపసర్పంచ్ తాళ్ల శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు చావగాని వెంకటనాగప్రసాద్, మండేపూడి ఆనందరావు, ఇనప గోవిందరావు, బండి శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు తిరుమలశెట్టి అన్వేష్, రాచకొండ వెంకట్, కట్టకూరి ఉమారావు, మందరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ అజయ్‌బాబుకు నాయకుల పరామర్శ

**నవతెలంగాణ-కారేపల్లి**

కారేపల్లి మండలం విశ్వనాథపల్లికి చెందిన సీపీఐ(ఎం)ఎంపీటీసీ వడ్డే అజయ్‌బాబు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయనను కారేపల్లి మండల ప్రజాప్రతినిధులు నాయకులు గురువారం పరామర్శించారు. ఆసుపత్రికి ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సర్పంచ్ మాలోత్ కిషోర్, బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు అజ్మీర వీరన్న, మార్కెట్ కమిటీ డైరక్టర్ వాంకుడోత్ నరేష్‌లు వెళ్ళి వడ్డే అజయ్‌బాబు ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## నియోజకవర్గ స్థాయి సమావేశానికి తరలిరండి

**నవతెలంగాణ-కారేపల్లి**

వైరాలో శుక్రవారం జరగనున్న బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ స్థాయి సమావేశానికి కార్యకర్తలు తరలిరావాలని బీఆర్ఎస్ కారేపల్లి మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్ కోరారు. గురువారం కారేపల్లి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైరా నియోజవర్గంలో బీఆర్ఎస్ పటిష్టానికి ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

## వధూవరులను ఆశీర్వదించిన సీపీఐ(ఎం) నాయకులు

**నవతెలంగాణ-కారేపల్లి**



కారేపల్లి మండల కమిటీ సభ్యులు ఉసిరికాయలపల్లికి చెందిన దాసరి మల్లయ్య కుమార్తె అనూష, వివాహ వేడుకకు గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హాజరై వధువరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, ఎండీ. జబ్బార్, కొండబోయిన నాగేశ్వరరావు, మెరుగు రమణ, శాఖ కార్యదర్శి మండల వెంకన్న, ఉసిరికాయలపల్లి సర్పంచ్ బానోత్ బన్సీలాల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | సెప్టెంబర్ 08, 2023 | www.navatelangana.com



## బ్రిలియంట్ లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**నవతెలంగాణ -బూర్గంపాడు**

మండలంలోని సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థలలో కిడ్స్ ప్లే స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని బ్రిలియంట్ ఉపాధ్యాయులు అంగ రంగ వైభవంగా వేడుకలు గురువారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలతో చూపరులను ఎంతగానో అలరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా బ్రిలియంట్ విద్యా సంస్థల అధినేత బి.ఎస్.ఆర్ అమ్మవారికి పూల మాలలు వేసి అనంతరం సాంప్రదాయ బద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటి కాలంలో విద్యార్థుల్లో దైవత్వాన్ని నింపడం మన బాధ్యత, మన దేశ సంప్రదాయాలను పిల్లలకు గుర్తు చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు వారిలో ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒకరిపై ఒకరి పోటీతో ఉట్టి కొట్టి అందర్నీ అలరించారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు.

## మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేసేలా సిఫారసు చేయండి

**డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల**

**నవతెలంగాణ-పాల్వంచ**



మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల విధులను రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నాయకులు, గౌరవ సలహాదారులు కొత్వాల నాయకత్వంలో మున్సిపల్ కమిషనర్ అజ్మీరా స్వామితో చర్చించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కార్మికులు మున్సిపాలిటీలో పనిచేస్తున్నారని పెరుగుతున్న ధరలతో కుటుంబాల పోషణ భారం అవుతుందన్నారు. ప్రభుత్వం వీరి బాధలను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ భద్రత కలిగించేలా రెగ్యులరైజ్ చేయాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ నాయకులు బొందిల రాంబాబు,మహమ్మద్ సిరాజుద్దీన్, షేక్ జానీ, బి. కిరణ్, చావా రవి, వి. ప్రసాద్, జె. రమేష్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారికి అభినందనలు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర చారిని పాఠశాల క్రీడా కార్యదర్శి స్టెల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిసిన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జరగాల్సిన మండల, జోనల్, జిల్లా స్థాయి క్రీడల నిర్వహణ కోసం చేపట్టాల్సిన చర్యలపై తెలిపారు. స్పందించిన డిఇఓ తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన విషయంలో మండల విద్యాధికారులు ప్రధాన ఉపాధ్యాయులు అందరూ చాలా విస్తృతంగా పని చేస్తున్నారని, ఐనప్పటికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్ కుమార్, నాగ లక్ష్మి, వేణు గోపాలరావు, సుజాత, రాము తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

**కొత్తగూడెం :** పోయిన బ్రాస్లెట్ ను తిరిగి ఇచ్చి ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. రామవరం 2 ఇన్‌క్లైన్‌కు చెందిన సగ్గు మల్లేశ్వరి అనే మహిళ కూతురు సరయు రెడ్డితో కలిసి రామవరం నుండి కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ జంక్షన్‌కు ఆటోలో ప్రయాణిస్తు ఉండగా తన చేతి బంగారు గొలుసు (బ్రాస్లెట్) ఎక్కడో పడిపోయింది. ఇట్టి విషయం తెలుసుకున్న 5 ఇన్ క్లైన్ ఏరియాకు చెందిన ఆటో డ్రైవర్ సంపంగి సాంబా తన ఆటోలో పడిపోయిన బంగారు గొలుసును (బ్రాస్లైట్)ను రామవరం 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో అందజేశాడు. పోలీసులు సదరు మహిళకు అప్పగించారు. ఆటో డ్రైవర్‌ను పోలీసులు అభినందించారు. కొత్తగూడెం ఆటో డ్రైవర్లు అందరూ ఇలా బాధ్యతగా ఉండాలని పోలీస్ సూచించారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

**నవతెలంగాణ-దమ్మపేట**



కేంద్రంలో బీజేపీ సర్కారు రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకొని ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను తక్షణం అమలు చేయాలని దమ్మపేట సీపీఐ(ఎం) మండల కమిటి స్పష్టం చేసింది. గురువారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ధర్నా కార్య క్రమం యండ్రాతి అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మినారాయణ మాట్లాడారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సి.హెచ్. మధుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి కేశవరావు, రావుల శోభన్‌బాబు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వీరయ్య గోపరాజు, జ్యోతి, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## 9,10 తేదీలలో సీఐటియూ జిల్లా ట్రేడ్ యూనియన్ అవగాహన తరగతులు

- జయప్రదం చేయండి : సీఐటియూ అధ్యక్ష, కార్యదర్శులు విజ్ఞప్తి

**నవతెలంగాణ-కొత్తగూడెం**

అనునిత్యం కార్మిక, ఉద్యోగుల సమస్యలపై ఉద్యమిస్తున్న సీఐటీయూ జిల్లా ట్రేడ్ యూనియన్ అవగాహన తరగతులను పట్టణంలో ఈ నెల 9, 10 తేదీలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి, కార్యదర్శి ఏజె.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక రంగంలో కేంద్రంలో, రాష్ట్రంలో బిజేపి, బీఆర్ఎస్ పాలక ప్రభుత్వాలు కార్మిక చట్టాలలో అనేక మార్పులు తెస్తూ, కార్మిక హక్కులను హరిస్తున్నారని, కార్మిక సమస్యలపై చేస్తున్న పోరాటాలను అణచివేసేందుకు తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తున్నారన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ విధానాలకు, కార్మిక రంగంలో వస్తున్న సమస్యలకు ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, కార్మిక ఐక్యతకు విఘాతం కలిగిస్తున్న మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన కార్యక్రమాలను రూపకల్పన చేసేందుకు ఈ తరగతుల్లో తగిన శిక్షణ ఇస్తామని వారు తెలిపారు.

## 11 నుంచి అంగన్వాడీల సమ్మె కు సిద్ధం కండి

- ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలి
- అంగన్వాడీ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్

**నవతెలంగాణ-పాల్వంచ**

తెలంగాణ ప్రభుత్వం అంగన్వాడీ టీచర్ అండ్ హెల్పర్స్‌ల సర్వీస్ క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం ఉపాధ్యాయులకు ఇస్తున్న దానికి సమానంగా ఇవ్వాలని ప్రధాన డిమాండ్‌లతో పాటు 19 రకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి సమ్మె బాట పట్టనున్నారని అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద జరిగిన సమావేశంలో తెలియచేసారు. సమ్మె నేపథ్యంలో ఐసీడీఎస్ కమిషనర్ భారతి హెూలీ కేరి సమ్మెలోకి వెళ్లకుండా అంగన్వాడీలపై ఒత్తిడి తెస్తూ జిల్లాలో పీడీలను సీడీపీఓల నుంచి ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కారం చూపకుండా సమ్మె విచ్చిన్నం చెయ్యాలను కోవటం తగదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గొనె మణి, ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాయం శ్రీలత, రూప , సరోజినీ , తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులకు రాయితీలు- పేదలపై భారాలు



భద్రాచలంలో నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) శ్రేణులు

- ఇదే ప్రధాని మోడీ పాలన
- మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

**నవతెలంగాణ-భద్రాచలం**

కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పేదలపై పన్నుల భారం మోపుతూ కార్పోరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తోందని మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత సంపన్నులకు కొమ్ముకాస్తూ పేదవారిపై అన్ని రకాలుగా భారాలు మోపుతున్నారని అన్నారు. దేశంలో రోజురోజుకీ నిత్యావసర సరుకుల ధరలు హద్దూ అదుపు లేకుండా పెరుగుతున్నాయని, బియ్యం, పప్పు,ఉప్పు కూరగాయలు, నూనె ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. పేదరికంలో మగ్గుతున్న కోట్ల మంది ప్రజలపై పన్నుల భారం మరింత పెంచి దారిద్రంలోకి నెడుతున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని నిరుద్యోగ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. కరోనా సమయంలో ఉపాధి అవకాశాలు కోల్పోయిన అనేకమందికి భరోసాగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. బిజెపి పాలనలో గిరిజనులు, దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయని అన్నారు. మరోపక్క రాష్ట్రాల హక్కులను హరిస్తూ ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని అన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న తొమ్మిది లక్షల ఎకరాలు పోడు భూములకు కేవలం నాలుగు లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుందని అన్నారు. గృహలక్ష్మి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన పేదలకు ఇవ్వడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కీ బాలరాజు, పార్టీ సీనియర్ నాయకులు బిబి జి.తిలక్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, ఎం.రేణుక, ఎస్.గంగ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై వెంకట రామారావు, పి సంతోష్ కుమార్, ఎస్ లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి. సీతాలక్ష్మి, బి కుసుమ, ఎస్ నాగరాజు, పసిడి ఫిరోజ్, లక్ష్మణ్ పాల్వంచ పట్టణ నాయకులు సత్య తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడులో నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎం) శ్రేణులు

### సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన

**బూర్గంపాడు :** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిర సిస్తూ బూర్గంపాడు మండల కేంద్రంలో గురువారం ప్లకార్డులు పట్టుకొని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బత్తుల వెంక టేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాపినేని సరోజన, ఎస్కె అబీద, భయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు,బర్ల తిరపతయ్య ,బోళ్ల ధర్మ, ఝాన్సీ, ఉపేందర్, మల్లి కార్జున్, లక్ష్మీ మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భారత్ జోడో యాత్ర ర్యాలీ

- దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ
- టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ

**నవతెలంగాణ-కొత్తగూడెం**

దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని, రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ప్రారంభించి నేటికీ సంవత్సరం అవుతుందని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం పట్టణ పరిధి ఏఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం నుండి పోస్టాఫీసు అంబేద్కర్ సెంటర్ వరకు భారత్ జోడోయాత్ర నేటికీ సంవత్సరం అవుతున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎడవల్లి కృష్ణ ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి పోస్టాఫీసు సెంటర్ వరకు వెళ్లి అంబేత్కర్ విగ్రహంకి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడోయాత్ర చేసి చరిత్ర సృష్టించాడన్నారు. దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని అన్నారు. ఆయన చేపట్టిన భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు విజయవంతంగా ముగిసిందని, ఈ యాత్రలో రాహుల్ బిజేపి, బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను ఏవిధంగా ఇబ్బంది పెడుతున్నాయో ప్రజలకు వివరించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే మీ బాధలు, కష్టాలు తొలిగితాయని ప్రజలు రాహుల్‌కి స్పష్టం చేశారు. రాహుల్ భారత్ జోడోయాత్ర దేశంలో ఒక చరిత్ర సృష్టించిందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా అఖండ మెజారిటీతో కాంగ్రెస్ గెలుపు తధ్యమన్నారు. ఈ కార్యక్రమములో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్యా, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియూసీ నాయకులు జలీల్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





**తాటి నేతృత్వంలో భారీ ర్యాలీ**

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

గతేడాది రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర మొదటి వార్షికోత్సవాన్ని అశ్వారావుపేటలో గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి స్థానిక మూడు రోడ్ల కూడలిలో గల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు 145 రోజులు, 12 రాష్ట్రాలు,2 కేంద్ర పాలిత ప్రాంతాలు 4081 కిలోమీటర్ల సాగిందని అన్నారు.భారత్ జోడో యాత్ర ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా రాహుల్ గాంధీ కి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, దాసరి నాగేందర్ రావు, మాజీ సర్పంచ్ లు పొట్ట రాజులు, కారం ఎర్రయ్య, మోహన్ రావు, తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**అశ్వాపురం :** మండలంలోని సీతారాంపురం నుండి అశ్వాపురం ప్రధాన రహదారి వరకు మాజీ జడ్పీటీసి బట్టా విజయ్ గాంధీ ఆధ్వర్యంలో జోడో యాత్ర సంఘీభావం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోడుయాత్ర యొక్క ప్రాముఖ్యతపై వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం, గుండాల మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, కొడెం.ముత్యం చారి, బేతం రామకృష్ణ, బచ్చు రమణ,తూము రాఘవులు, కృష్ణరావు, సీనియర్ నాయకులు కాక రాములు, తాటి వెంకటేశ్వర్లు, తాటి సతీష్, చాప ముత్తయ్య పాల్గొన్నారు.





**దమ్మపేట :** రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించి సంవత్సరం అయిన సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ తెలంగాణ వస్తే అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని అనుకుంటే ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ బడుగు, బలహీన వర్గాలకు తెలంగాణ రాష్ట్రంలో నిరంతరం అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ అరాచక కెసిఆర్ దగా పాలనను వచ్చే ఎన్నికల్లో తరిమి కొట్టాలన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవడం ఖాయమని ఆశా భావం వ్యక్తం చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎవరికి టిక్కెట్ కేటాయించినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పానుగంటి సత్యం, మండల పార్టీ అధ్యక్షుడు సత్యప్రసాద్, యువజన నాయకుడు చామర్తి గోపి శాస్త్రి, ఎంపీటీసీ నాయుడు శ్రీను, కక్కిరాల రమేష్, చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని వరప్రసాదరావు, రొయ్యల కుమార్, చిన్నశెట్టి గోపి, భద్రరావు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**జూలూరుపాడు :** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జోడోయాత్ర సంవత్సరం పూర్తయిన సందర్భంగా సంఘీభావం తెలుపుతూ పాపకొల్లు నుండి సుమారు మూడు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. పాదయాత్రలో మండల కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ కిషన్, ప్రియాంక, భానోత్ రాములు, గూగుల్ శ్రీను, భూక్యా లోక, గుగులోతు రాంబాబు, నారాయణ, భూక్య శ్రీను, లకావత్ రవి, గోపాల్, పవన్, పండులు పాల్గొన్నారు.

**భద్రాచలం :** ఏఐసీసీ, టీపీసీసీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య పిలుపుమేరకు భద్రాచల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ల నరేష్ ఆధ్వర్యంలో గురువారం భద్రాచలం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వందలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలతో స్ఫూర్తి ర్యాలీగా బయలుదేరి బ్రిడ్జి సెంటర్ నందు గల ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలవేసి, తిరిగి ర్యాలీగా వస్తూ అంబేద్కర్ సెంటర్ నందు గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ర్యాలీ ముగింపు అనంతరం కాంగ్రెస్ నాయకులు నాయకులు, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతిరేల రవికుమార్ మాట్లాడారు. ఈ స్ఫూర్తి ర్యాలీలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాసరెడ్డి, అడబాల వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చింతరేల సుధీర్, ఎన్ఎస్‌యుఐ డివిజన్ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్ పాల్గొన్నారు.





## కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు న్యాయమైనవి

- ప్రభుత్వం మీరందరినీ రెగ్యులర్ చేయాల్సిందే
- యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లంపాటి
- కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళనకు యుటీఎఫ్ మద్దతు

**నవతెలంగాణ పాల్వంచ**



కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు న్యాయమైనవి ప్రభుత్వం వీరందరినీ రెగ్యులర్ చేయాల్సిందే యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లంపాటి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ లో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగుల 7వ రోజు దీక్షలో ఆందోళనకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మద్దతు. తెలిపారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా కార్యదర్శి మల్లెంపాటి ప్రభుత్వానికి మాట్లాడుతూ విద్యాశాఖలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో సుమారు 15-20 సంవత్సరాలుగా పనిచేస్తూ, ఉద్యోగ భద్రత లేక, పనికి తగిన వేతనం రాక తమ న్యాయమైన డిమాండ్స్ ను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ , సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలు అనుగుణంగా వేతనాలు పెంచాలని, జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళన కార్యమాలకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె రాంబాబు, ఉపాధ్యక్షులు బానోత్ మంగిలాల్ నాయక్, సీనియర్ నాయకులు అర్వపల్లి సత్యనారాయణ, జేఏసీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూక్యా మోహన్, బట్టు చందు, హతీరామ్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కష్టార్జితాన్ని ప్రభుత్వానికి దోచిపెట్టేందుకే ఏరియర్స్ జాప్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా
- ఏఐటియుసి ఆధ్వర్యంలో సింగరేణి హెక్టాఫీస్ ఎదుట దీక్ష

**నవతెలంగాణ-కొత్తగూడెం**



రాష్ట్ర ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్న సింగరేణి యాజమాన్యం కార్మికుల కష్టార్జితాన్ని దోచిపెట్టి మెప్పు పొందేందుకే కార్మికులకు రావాల్సిన వేజ్ బోర్డు ఏరియర్స్ చెల్లింపులో జాప్యం చేస్తోందని సిపిఐ భద్రాది జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా ఆరోపించారు. 23 నెలలకు సంబంధించి 11వ వేజ్ బోర్డులు పెరిగిన వేతనాలు ఒకే దఫా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. దీక్షలను ప్రారంభించిన అనంతరం సాబీర్ పాషా మాట్లాడుతూ సిఎస్ఆర్, డిఫిర్ ట్యాక్సు, ఎమ్మెల్యేలకు ప్రత్యే నిధుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి ఖజానాకు గండి కొడుతోందని, దీనికి సింగరేణి యాజమాన్యం, సర్కారు సంఘం టిబిజికెఎస్ సహకరిస్తూ సంస్థను దివాలా తీయిస్తున్నారని అన్నారు. విద్యుత్ సంస్థలకు సంబందించి సింగరేణి సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలు చెల్లింపులో మీనమేశాలు లెక్కిస్తోందని విమర్శించారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో, కర్రపెత్తనంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను దోచుకుంటోందని విమర్శించారు. కోల్ ఇండియాలో 11వ వేజ్ బోర్డుకు సంబందించి 23 నెలల బకాయిలు చెల్లిస్తుంటే సింగరేణి యాజమాన్యం కార్మికులకు చెల్లించకుండా, వాయిదాల పద్ధతిలో చెల్లించేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, గనిగళ్ళ వీరస్వామి మాట్లాడారు. కొత్తగూడెం, కార్పోరేట్ బ్రాంచి కార్యదర్శులు వి.మల్లికార్జునరావు, ఎస్. రమణమూర్తి, జె.గట్టయ్య, ఉమాయున్, సందేబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హెూంగార్డ్ ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వమే కారణం

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్

**నవతెలంగాణ-కొత్తగూడెం**

చాలీచాలని జీతాలతో జీవితాలను వెల్లదీస్తున్న హెూంగార్డులపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వల్లే హెూంగార్డ్ రవీందర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. గురువారం బీఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 సంవత్సరంలో అసెంబ్లీ సమావేశాల సాక్షిగా హెూంగార్డులందరినీ పర్మినెంట్ చేస్తానని, హెూంగార్డులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా లాంటి సౌకర్యాలు కల్పించి కడుపులో పెట్టుకొని చూసుకుంటా అని హామీ ఇచ్చి కేసీఆర్ మోసం చేసారని ఆరోపించారు. ఆరు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికీ ఆ హామీ నీటి మీద రాతలా నిలిచిపోయిందన్నారు. హెూంగార్డ్‌లతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ వారికి సకాలంలో జీతాలు సైతం చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు నిర్వహించి రిటర్మెంట్ తీసుకున్న తర్వాత వారికి భరోసా కల్పించేందుకు ఏ విధమైన బెనిఫిట్స్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నడిబొడ్డులో ఆత్మహత్యాయత్నం ఘటన జరిగినప్పటికీ ముఖ్యమంత్రికి, హెూం మంత్రికి వెళ్లి పరామర్శించే తీరిక లేకపోవడం బాధాకరమన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం హెూంగార్డులు సైతం రోడ్లపైకి వచ్చే పరిస్థితిని బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కెసిఆర్ కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున రావు, సాయి, పట్టణ అధ్యక్షుడు వంగా రవిశంకర్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**నవతెలంగాణ-చండ్రుగొండ**

మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు, పూజలు, నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు బోడ వెంకటేశ్వర శర్మ గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తలకు నజరానా ప్రకటించడం కాదు సమ ధర్మాన్ని పాటించండి

**నవతెలంగాణ-చంద్రుగొండ**

తలకు నజరానా ప్రకటించడం కాదు సమధర్మాన్ని పాటించాలని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాయి రాజా అన్నారు. కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కొన్ని సంవత్సరాల నుంచి కుల వివక్షత, అంటరానితనం కొనసాగుతూ ఉందని ఈ వివక్షతను రూపుమాపాల్సిన పాలకులు స్వామీజీలకు వంత పలకడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ధర్మం గురించి కేంద్రంలో ఉన్న మంత్రులు స్వామీజీలు మాట్లాడుతున్నారు గాని మణిపూర్ ఘటనపై ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. అదేవిధంగా స్వామీజీలకు అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కేవీపీస్ మండల కార్యదర్శి మిర్యాల మోహన్ రావు, తలారి పవన్ కళ్యాణ్, నందునూరి. వినోద్, తిట్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో దళిత మండల కమిటీ సభ్యులు పర్యటన

**నవతెలంగాణ- టేకులపల్లి**

మండలంలోని పలు గ్రామాల్లో దళిత మండల కమిటీ సభ్యులు పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించినట్లు గురువారం తెలిపారు. రాష్ట్ర సంక్షేమ పథకాలను జరుగుతున్న అభివృద్ధిని గ్రామ ప్రజలకు వివరించామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అన్ని విధాలుగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ప్రతి ఇంటికి తాగునీరు ప్రతి ఇంటికి ఏదో ఒక దశలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇల్లందు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి ఎప్పటికప్పుడు సమస్యలను తీసుకెళ్తూ నిధులు మంజూరు చేయించి సంక్షేమానికి పెద్దపీట వేసిన నాయకురాలు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కాలే ప్రసాదరావు, మంద రాజు, కుమ్మరి కిరణ్, ముచ్చ జయరాజు, కనకం రమణయ్య పాల్గొన్నారు.

## సర్కులేషన్ వెంటనే రద్దు చేయాలి

**నవతెలంగాణ-టేకులపల్లి**

సింగరేణిలో కాంటాక్ట్ ప్రాతిపదికన ఎంవిటిసిలలో ఇటీవల పదవి విరమణ పొందిన అధికారులు, ఈఅండ్ఎం అధికారులు సూపర్వైజర్ల నియమానికి జారీ చేసిన సర్కులర్‌ను వెంటనే రద్దు చేయాలని కార్మికులు గురువారం సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో మైనింగ్ సభ్యులు నిరసన తెలుపుతూ గని మేనేజర్ సౌరత్ సుమన్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా మైనింగ్ స్టాప్ సభ్యుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరుణా శంకర్, సమ్మయ్య, మనోజ్ కుమార్, ఇంతియాజ్, వి శంకర్, బాలుకుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమ్మెను జయప్రదం చేయండి

**నవతెలంగాణ-ఇల్లందు**

అంగన్వాడీకి గ్రాట్యూటీ రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ తదితర డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 11 నుండి సీఐటీయూ, ఏఐటియుసిల ఆధ్వర్యంలో చేపట్టే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని గురువారం ఏలూరు భవన్లో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఇల్లందు ప్రాంతీయ సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, సీఐటీయూ ప్రాంతీయ కన్వీనర్ అబ్దుల్ నబీలు పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్‌లు గ్రాట్యూటీ టీచర్లకు రూ.10లక్షలు మినీ టీచర్, ఆయాకు రూ. 5లక్షలు గ్రాడ్యూటీ,పెన్షన్ సౌకర్యం కల్పించాలని రిటైర్మెంట్ వయసు 60 ఏళ్ళే ఉండాలని ప్రభుత్వం ప్రకటించిన మినీ అంగన్వాడీలను మెయిన్ టీచర్లుగా చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది, దీనిపై విధివిధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. వెంటనే జీఓ జారీ చేయాలన్నారు. ప్రభుత్వం దిగివచ్చి ఈ సమస్యలన్నీ పరిష్కరించే వరకు సమ్మె యథావిధిగా కొనసాగించాలని బీఎల్ఓ డ్యూటీలు కూడా చేయబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాట్ల రాంబాయి, కల్లేపల్లి మరియా, ఫాతిమా, అరుణ, సుజాత, శ్రీలత, రేణుక, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచల వాసికి నేషనల్ క్లబ్ అవార్డు ప్రదానం

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**



ఎస్‌బీఐ లైఫ్‌లో అతి కీలకమైన నేషనల్ క్లబ్ అవార్డు కంట్రీ హెడ్ ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డికి దక్కింది. కలకత్తాలో ఐటిసి రాయల్ బెంగాల్ హెటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి యస్.బి.ఐ.లైఫ్ కంట్రీ హెడ్ పాండ్యన్ ముంబాయి ముఖ్య అతిథిగా విచ్చేసి అవార్డు ప్రదానం చేశారు. ఇంత వ్యాపారం చేయటానికి సహకరించిన తమ కస్టమర్లకు, రీజనల్ మేనేజర్ అర్జునరావుకి, డీఆర్ఎం రవీందర్ రెడ్డికి, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జయక్రావుకి, యూనిట్ మేనేజర్ కిరణ్ కుమార్‌కి, సిబ్బందికి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



## కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరిక

**నవతెలంగాణ-పినపాక**


మండలంలోని మల్లారం గ్రామపంచాయతీ నుండి 50 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో మల్లారం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్ పార్టీ కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**నవతెలంగాణ-పినపాక**

కృష్ణాష్టమి వేడుకలను మండల పరిధిలోని ఈ .బయ్యారం గ్రామపంచాయతీ యాదవ బజార్ లో గల శ్రీకృష్ణ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. మండలంలో పలు గ్రామాలలో జన్మాష్టమి వేడుకలు జరిపారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషాధారణలతో అలరించారు. బుడిబుడి అడుగుల కృష్ణులు దర్శనమిచ్చారు. మండల వ్యాప్తంగా పలుచోట్ల ఐక్యంగా ఉండి ఉట్టి కొట్టారు.

## సీపీఐ(ఎం) నిరసన



**పినపాక :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దుబ్బా గోవర్ధన్, మడివి రమేష్, పాండురంగాపురం సర్పంచ్ భవతి, సిపిఎం శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## 11న మెగా జాబ్ మేళా

**నవతెలంగాణ-సుజాతనగర్**

డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో ఈ నెల 11న వేపల గడ్డలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు జరిగే మెగా జాబ్ మేళాను జయప్రదం చేయాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చావా లక్ష్మీనారాయణ, చైర్మన్ దోసపాటి వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, మార్కెటింగ్ వంటి 40 కంపెనీల ద్వారా 2000 మందికి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్సి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్ చేసిన వారు అర్హులన్నారు.

## దేశం పేరు మార్చుడు కాదు పేదల ఆర్థిక స్థితిని మార్చు..

**నవతెలంగాణ-చంద్రుగొండ**



దేశం పేరు మార్చుడు కాదు పేదల ఆర్థిక స్థితిని మార్చాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో పార్టీ మండల నాయకులు పెద్దిని వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఐలూరి.రామిరెడ్డి మాట్లాడుతూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెంచడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో అయ్యన్నపాలెం శాఖ కార్యదర్శి చల్లపల్లి రాజా, మండల కమిటీ సభ్యుడు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, బన్నీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అందరి వాడు మెచ్చా



- మరొక్క సారి అవకాశం ఇవ్వండి
- ఎమ్మెల్సీ తాతా మధు

**నవతెలంగాణ - అశ్వారావుపేట**

సౌమ్యుడు, స్నేహశీలి, అందరూ బాగుండాలని ఆకాంక్షించే ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును కొద్ది నెలల్లో జరగబోతున్న ఎన్నికల్లో మళ్ళీ ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్సీ తాతా మధు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి జరగాలంటే "మెచ్చా" గెలుపు అవసరం అని స్పష్టం చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మెచ్చాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే మెచ్చా కు సీఎం కేసీఆర్ పూర్తి అండగా ఉన్నారని, ఈయన ఏ పని చెప్పినా ఆపొద్దని సీ.ఎస్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని వివరించారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధి మెచ్చాతో సాధ్యమైందని, ఈ నాలుగున్నర ఏళ్ళ కాలంలో రూ.200 కోట్లకు పైగా అభివృద్ధికి నిధులు తీసుకొచ్చారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు అవుతున్నా ఈ ప్రాంత ప్రజలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని, తెలంగాణ స్వరాష్ట్రంలో అభివృద్ధి పరులుగు తీశాయని చెప్పారు. ఎమ్మెల్యే 'మెచ్చా' అంటే సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీలో అత్యంత గౌరవం ఉందని, సీఎం కేసీఆర్ తిరిగి పార్టీ టిక్కెట్లను ఇవ్వటం ఆయన పనితీరుకు నిదర్శమని గుర్తు చేశారు. దేశానికే తెలంగాణ వ్యవసాయం ఆదర్శంగా సీఎం కేసీఆర్ నిలిపారని చెప్పారు. ఆంధ్ర పాలనలో ఎరువులు, విత్తనాలు, కరెంట్ కోసం రైతులు నానా అవస్థలు పడ్డారని, పోలీసుల రక్షణలో విత్తనాలు పంపిణీని టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సమస్యలన్నింటికీ పరిష్కరించి, వ్యవసాయ పెట్టుబడి కోసం ఎకరాకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందిస్తుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మోసగాళ్ళు వస్తారని, వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఒక్క అవకాశం అంటూ ఓటు అడిగే కాంగ్రెస్ పార్టీ 55 ఏళ్ళ పాటు అధికారంలో ఉన్న మీరు అప్పుడు చేయలేని అభివృద్ధిని ఎప్పుడు మాత్రం ఎలా చేస్తారని నిలదీశారు. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని, ఆయనకు ప్రత్యామ్నాయం అవసరం లేదని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశరావు, నాయకులు సత్యవరపు సంపూర్ణ, మందపాటి రాజమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

- హాజరైన జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

**నవతెలంగాణ-ఇల్లందు**

భారత్ జోడో యాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా దానికి కొనసాగింపుగా ఏఐసీసీ కమిటీ పిలుపు మేరకు గురువారం పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై కరెంట్ ఆఫీస్ సెంటర్ నుంచి గోవింద్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేలు, పులి సైదులు,జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు డా.జీ.రవి,పట్టణ ప్రధాన కార్యదర్శి మహ్మద్ జాఫర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మసూద్, ఎస్టీ సెల్ అధ్యక్షులు నాగరాజు, బి.సి సెల్ అధ్యక్షులు నాగరాజు, పట్టణ ఉపాధ్యక్షుడు హైజాక్, ఐఎన్టియూసీ మహబూబ్, సీనియర్ నాయకులు భద్రం, వాసుదేవ్, ఇమామ్, వెంకన్న పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పార్టీని నిర్మించడమే టీవీఆర్‌కు ఇచ్చే ఘన నివాళి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ డాక్టర్ మీడియా బాబురావు

**నవతెలంగాణ - భద్రాచలం**



భద్రాచలం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి క్షేత్రస్థాయిలో నిర్మించడమే అమరజీవి కామ్రేడ్ టివిఆర్ చంద్రంకు మనం ఇచ్చే ఘన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు. మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబు అన్నారు. అమరజీవి కామ్రేడ్ టివిఆర్ చంద్రం 17వ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ మిడియం బాబురావు మాట్లాడుతూ ఉమ్మడి భద్రాచలం డివిజన్‌లో మార్క్సిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతల్లో కామ్రేడ్ టీ.వి.ఆర్ చంద్రం ఒకరు అని అన్నారు. చంద్రం మార్క్సిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారని అన్నారు. ఆయన ఎమర్జెన్సీ లాంటి అనేక నిర్బంధాలను ఎదుర్కొని భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ నిర్మాణానికి కృషి చేశారని అన్నారు. ఆయన ఆశయాలు ఇంకా మిగిలి ఉన్నాయని వాటిని ముందుకు తీసుకుపోవటం కోసం మార్క్సిస్టు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని, పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ క్షేత్రస్థాయిలో సీపీఐ(ఎం)ని బలోపేతం చేయడం, పార్టీని నిర్మించడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కీ బాలరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, ఎం రేణుక, సున్నం గంగా పార్టీ సీనియర్ నాయకులు బిబిజి తిలక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై వెంకట రామారావు పాల్గొన్నారు.

## ఎంసీ క్వార్టర్స్‌లలో కారు షెడ్లు ఏర్పాటు చేయాలి

**నవతెలంగాణ-మణుగూరు**

పివీ కాలనీ సింగరేణి ఏరియా ఎంసీ కోటర్స్‌లో కారు షెడ్లు ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో నాయకులు మాట్లాడుతూ.. వర్షాలకు కార్లు తడిచి పాడైపోతున్నాయన్నారు. ఎంసీ క్వార్టర్స్‌లో కారు షెడ్స్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. సత్వరమే ప్రారంభించేలా చూడాలన్నారు. సింగరేణి యాజమాన్యానికి ఐఎఫ్టియు నాయకులు నాసర్ పాషా విజ్ఞప్తి విజ్ఞప్తి చేశారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా పీవీ కాలనీలో సింగరేణి యాజమాన్యం ఎంసీ క్వార్టర్లలో నిర్మించ తలపెట్టిన కార్ షెడ్స్ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. మణుగూరు ఎంసీ క్వార్టర్స్ లో కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కార్మిక సంఘాల కార్మికుల అభ్యర్థన మేరకు పరిష్కార మార్గంగా నిధులు మంజూరు చేశారని, కార్ షెడ్స్ పనుల ప్రారంభానికి ఏరియా జిఎం దుర్గం రామచందర్ శంకుస్థాపన చేశారని అన్నారు. అదేవిధంగా ఎంసీ యేతర క్వార్టర్స్ లో కూడా కార్ షెడ్స్ లేకపోవడంతో రోడ్లపై కార్లు పార్కింగ్ చేయాల్సి వస్తోందని ఈ సమస్యకు కూడా పరిష్కార మార్గం చూడాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు.



# నాణ్యత ప్రమాణాలు పాటించని గుత్తేదారు

- చోద్యం చూస్తున్న అధికారులు

**నవతెలంగాణ-ములకలపల్లి**



నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణం చేస్తున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ఆరోపించారు. గురువారం పార్టీ మండల నాయకులతో మండల పరిధిలోని మాధారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ కార్యాలయం పనులు పరిశీలించి గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. ఇసుక అధికారక ర్యాంపు నుండి తెప్పించాల్సి ఉండగా స్థానిక వాగులు నుండి మట్టితో కూడిన ఇసుకతో నిర్మాణ పనులు చేస్తున్నారని విమర్శించారు. నాణ్యత లేని సిమెంటు ఇటుకలతో నిర్మించిన భవనం ఎన్ని సంవత్సరాలు నిలుస్తుందన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ప్రధాన రహదారి ప్రక్కన నాణ్యత లేని పనులు జరుగుతుంటే సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూకంటి రవికుమార్, వినోద్ గడ్డం వెంకటేశ్వర్లు, పసులు రాజసూర్య, ముదిగొండ రవికుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

**మణుగూరు :** పేద ప్రజల అభ్యున్నతే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని మణుగూరు జడ్పీటీసీ పోశం నరసింహ రావు అన్నారు. గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు లక్ష్యం కూడా పినపాక నియోజకవర్గం పేద ప్రజల అభ్యున్నతికే అన్నారు. కేసీఆర్ పల్లె ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్ (ఎస్సార్‌కె స్కూల్ ఏరియా) జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గం అభివృద్ధే మన ఎమ్మెల్యే లక్ష్యమని, ఈ ప్రాంత ప్రజలందరూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, నిరంతరం పరితపిస్తూ ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావుకు మనమందరం రుణపడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎడ్ల శ్రీనివాస్, బాబ్జాని, లక్ష్మీ శెట్టి ప్రసాద్, శ్రీనివాసరావు, కోటమ్మ, సుధా వెంకటేశ్వర్లు, తాళ్లూరి అరుణ, నరసింహారావు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలి

**కమిషనర్ కు వినతిపత్రం**

**నవతెలంగాణ-మణుగూరు**





మణుగూరు మున్సిపల్ కార్యాలయంలో వివిధ కేటగిరీలలో కంప్యూటర్ ఆపరేటర్లు బిల్లు కలెక్టర్లు పారిశుధ్య సిబ్బంది వాటర్ మ్యాన్ సిబ్బంది ఎలక్ట్రిషన్ వర్క్ ఇన్స్పెక్టర్లు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలలో పనులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని గురువారం మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావుకి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మణుగూరు గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా 2005లో ఏర్పాటు చేశారు. ప్రస్తుత మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీవో నెంబర్ 14, 60, 63, ప్రకారం అందరికీ వేతనాలు పెంచడం జరిగిందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి శానిటేషన్ సిబ్బందికి సానిటేషేతర సిబ్బందికి వెయ్యి రూపాయలు పెంచడం జరిగిందన్నారు. మణుగూరులో మున్సిపాలిటీలో 63 అవుట్ సోర్సింగ్ సిబ్బంది కూడా రూ.1000 పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.అనిల్ కుమార్, యాకూబ్ వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాస్, రమేష్, ఎస్. విజయ్ కుమార్, బి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ పార్టీతోనే అభివృద్ధి

- కలిసి రండి : ఎమ్మెల్యే హరిప్రియ

**నవతెలంగాణ-ఇల్లందు**

సిఎం కేసీఆర్ బాటలోనే గులాబీ జెండా నీడలోనే మనమంతా కలిసి నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములదామని ఎమ్మెల్యే హరిప్రియ పిలుపునిచ్చారు. నియోజకవర్గ అసెంబ్లీ స్థానం నుండి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్‌ను ప్రకటించినందుకుగాను గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 18, 24 వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆంబజార్లో వ్యాపారులను, వివిధ వర్గాల ప్రజలను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు, శ్రీనివాస్, ఆజాం, ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, ఇంచార్జ్ సుదీర్ తోతల, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గంగా భవాని అమ్మవారి జాతర

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

దుమ్ముగూడెం గ్రామంలో తరతరాలుగా గోదావరి నది తీరాన వెలసిన శ్రీశ్రీశ్రీ కాశీ గంగాభవాని అమ్మవారి జాతర మహోత్సవములు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పవిత్ర గోదావరి నది శుద్ధ జలాలతో ఆలయాన్ని శుద్ధి చేసి అనంతరం ఐదు గంటలకు గంగాభవాని అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించి ఎనిమిది గంటలకు కుంకుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 12 గంటల నుండి దాతలు అందజేసిన విరాళాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు మేళ తాళాలు డప్పు వైద్యాలు విచిత్ర వేషధారణల మధ్య అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు పవిత్ర గోదావరి నదీ తీరాన తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు కనుక నరసింహారావు, ముసలి రాంబాబు, గోవిందు, వీర్రాజు తో పాటు గంగపుత్ర సంఘం సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నపిల్లలను కృష్ణుడు గోపిక అవతారంలో అలంకరణ కోసం ఒకరి ఒకరు పోటీపడి ప్రత్యేకత చాటుకున్నారు. దీంతోపాటు మండల కేంద్రమైన లక్ష్మీనగరంతోపాటు పలు గ్రామాల్లో సాయంత్రం పూట భక్తిశ్రద్ధలతో ఉట్ల పండుగ నిర్వహించారు ఈ సందర్భంగా యువకులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు.

# 11 నుండి రాష్ట్రవ్యాప్త సమ్మె

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**





ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్పు చేసి నియమించాలని సీఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మచారి రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. సీఐటియు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ టీచర్లు చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తామని ఆగస్టు 25న ప్రకటన జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం జీవోను విడుదల చేయలేదని వెంటనే జీవోను విడుదల చేయాలని అన్నారు. గురువారం చర్ల, దుమ్ముగూడెం ప్రాజెక్టులోని మినీ అంగన్వాడీ టీచర్ల జనరల్ బాడీ సమావేశం ములకపాడు ఎలమంచి సీతారామయ్య భవన్‌లో సావిత్రి అధ్యక్షతన జరిగింది. బ్రహ్మచారి మాట్లాడుతూ గతంలో జనాభా ప్రాతిపదికన, కేంద్రాలకు వచ్చే పిల్లలు తల్లుల సంఖ్యను పరిగణలోకి తీసుకోవాలని షరతులు విధించారని అలాంటి షరతులు ఏమీ లేకుండా మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలన్నారు. కనీస వేతనం 26000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని 2017 నుంచి రావాల్సిన టిఏడిఏలు చెల్లించాలని బిఎల్ఓ డ్యూటీ నుంచి అంగన్వాడీ టీచర్లు విన వాం చాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 11వ తేదీ నుంచి జరుగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు దుమ్ముగూడెం మండల కన్వీనర్ కొరసా చిలకమ్మ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చర్ల, దుమ్ముగూడెం ప్రాజెక్ట్ నాయకురాలు కమలాదేవి కృష్ణవేణి, సావిత్రి, సుశీల రాణి, సరిత జోష్ణ, ఆదిలక్ష్మి లక్ష్మి, పాల్గొన్నారు.

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

## ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | సెప్టెంబర్ 08, 2023 | www.navatelangana.com




## సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ తరగతులు

- ఏరియా సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు ఎం.మధుర వాణి షాలెం రాజు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

కొత్తగూడెం సింగరేణి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి శిక్షణ తరగతులను సేవా అధ్యక్షురాలు ఎం.మధుర వాణి రాజు ప్రారంభించారు. గురువారం ఆర్.సి.ఓ.ఏ క్లబ్ నందు రుద్రంపూర్, గౌతమ్ పూర్, రామవరం సేవా సభ్యులతో ఉచిత వృత్తి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇందులో టైలరింగ్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను సేవ సమితి అధ్యక్షురాలు ఎం. మధుర వాణి షాలెం రాజు ప్రారంభించి, మాట్లాడారు. సింగరేణి సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. సింగరేణి సేవా సమితి ద్వారా ఈ ఉచిత వృత్తి శిక్షణ తరగతులకు హాజరై నిరుద్యోగ మహిళలు, గృహిణులు వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు శ్రద్ధగా హాజరై నేర్చుకోవాలని, ఇతరులకు నేర్పించాలన్నారు. నూతన వృత్తి శిక్షణ తరగతులను ప్రారంభించాలని సంబంధిత సింగరేణి సేవా సమితి ఆఫీసర్ జి.సంఘమిత్రకు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ డి.కిరణ్ బాబు, లేడీస్ క్లబ్ సెక్రటరీ అనిత, ఫాతిమా రజాక్, సీనియర్ పిఒ. జి. సంఘమిత్ర, సింగరేణి సేవా సమితి కో-ఆర్డినేటర్ సిహెచ్. సాగర్, కమ్యూనికేషన్ కో-ఆర్డినేటర్ రామాల ప్రసాద్, సింగరేణి సేవా సెక్రటరీ ఆదిలక్ష్మి, శిక్షణ తరగతుల శిక్షకులు ఫ్యాకల్టీ, ఇతర సేవ సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీరాగాలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

కొత్తగూడెంలోని మెదర బస్తీలో గల శ్రీరాగా ప్లే స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా యాజమాన్యం మల్లారపు వరప్రసాద్, కవిత కలిసి శ్రీకృష్ణుడి విగ్రహానికి పూలమాల వేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఫాన్సీ డ్రెస్సుల్లో వచ్చిన చిన్నారుల కోలాటం, రాధా కృష్ణుల నడుమ చిలిపి కృష్ణయ్య చిలిపి చేష్టలు అలరించాయి. వెన్నదొంగా, ఉట్టి కొట్టే సన్నివేశం ముచ్చటగా సాగాయి ఈ కార్యక్రమానికి బీసీ సొసైటీ నేషనల్ ప్రెసిడెంట్ అంకినేడు ప్రసాద్, బీసీ జిల్లా అధ్యక్షులు శ్యామ్, సురేష్, ప్లే స్కూల్ స్టాఫ్ పూజిత, నాగమణి, స్వాతి, సంధ్య, కీర్తి, సంధ్యారాణి, రాంబాబు, యాస్మిన్, మాధవి, సుహాసిని విద్యార్థులు పాల్గొన్నారు.




## ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ సమావేశం

- బందోబస్తుపై సమాలోచనలు

**నవతెలంగాణ-అశ్వారావుపేట**

త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో చెక్ పోస్టులు ఏర్పాటు, పలు అసాంఘిక కార్యక్రమాల నివారణ కోసం పటిష్ఠమైన నిఘా నిర్వహణకు తెలంగాణ ఎలక్షన్ కమిషన్, తెలంగాణ డీజీపీ ఆదేశానుసారం గురువారం స్థానిక లహరి లాడ్జిలో పోలీస్ శాఖ అంతర్రాష్ట్ర పోలీస్ అధికారుల సన్నాహక సమావేశం నిర్వహించినట్లు పాల్వంచ డిఎస్పి ఎస్.వెంకటేష్ తెలిపారు. అశ్వారావుపేట నియోజక వర్గం ఆంధ్ర ప్రదేశ్‌కు సరిహద్దు కావడంతో ఆ రాష్ట్రంలోని అశ్వారావుపేటకు సరిహద్దుగా ఉన్న సర్కిల్, మండలాలు అధికారులతో సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెం, నూజివీడు డిఎస్పీలు ఎం.ధనుంజయ్, ఈ.అశోక్ కుమార్, తెలంగాణలోని కల్లూరు ఏసిపి బి.రామానుజం, పాల్వంచ, అశ్వారావుపేట, సత్తుపల్లి, జీలుగుమిల్లి, నూజివీడు రూరల్, చింతలపూడి, అశ్వారావుపేట ఎక్సైజ్ సీఐలు వి.వినయ్ కుమార్, జే.మోహన్ బాబు, టి.కరుణాకర్, బి.వెంకటేశ్వరరావు, ఆర్.అంకబాబు, కే.నాగయ్య, ఎం.మల్లేశ్వరరావులతో పాటు అశ్వారావుపేట -1, అశ్వారావుపేట -2, దమ్మపేట, ములకలపల్లి, వేంసూరు, బూర్గంపాడు, వేలేరుపాడు హాజరు అయ్యారు.




## దేవాలయానికి స్టూళ్లు వితరణ

**నవతెలంగాణ-కల్లూరు**

కల్లూరు సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు దారా సురేష్ ఆధ్వర్యంలో 5 వేలు విలువగల ఎత్తు స్టూళ్లు వితరణగా అందించారు. లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దారా సురేష్ ఆర్థిక సహాయంతో ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం శ్రీనివాసరావు సమక్షంలో గుడి కమిటీకి అందించారు. కార్యక్రమానికి లైన్స్ క్లబ్ జెర్సీ చలువది నగేష్, ప్రెసిడెంట్ దారా సురేష్ ,సెక్రెటరీ అప్పలనాయుడు , ట్రెజరర్ రాయల సత్యనారాయణ, ధారా మీనాక్షి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గుండ్ల కృష్ణయ్య, అయ్యారపు నరేంద్ర ఆలయ పూజారి రామాచార్యులు పోపూరి కష్ణ పాల్గొన్నారు. అనంతరం వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం శ్రీనివాసరావు, లైన్స్ క్లబ్ సభ్యులందరన్నీ సన్మానించారు.

## రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

**నవ తెలంగాణ- మధిర**

మధిర పట్టణంలోని అండర్ బ్రిడ్జ్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గూడ్స్ రైలు కింద పడి మధిర పట్టణానికి చెందిన గూడెల్లి వెంకట నరసయ్య (31) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎనిమిది ఏండ్లుగా ఏ ఉద్యోగం లేకపోవడంతో మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

## హకీంపేట క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

**నవతెలంగాణ- కల్లూరు**

తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత క్రీడా ప్రమాణాలు కలిగినటువంటి హైదరాబాదులోని హకింపేట క్రీడా పాఠశాలకు కల్లూరు మండలం నుండి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. నాలుగవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పూర్తిగా ఉచిత విద్య, వసతి క్రీడలలో నాణ్యమైన శిక్షణ ఇవ్వనున్నారు. కల్లూరు నుండి నాలుగో తరగతికి కె.పృధ్విని, జి.కుశాల్, ఐదవ తరగతికు బి.షైన్,.ఎం ఉమామహేశ్వరి, మోక్షిత్ వీర్ ఎంపికైనట్లు పీటీ వీరరాఘవయ్య తెలిపారు. ఖమ్మం జిల్లా నుండి 32 మంది విద్యార్థులు క్రీడా పాఠశాల ఎంపికల్లో పాల్గొనగా అందులో 14 మంది విద్యార్థులకు ఖమ్మం జిల్లా నుండి ఎంపిక కావడం జరిగింది. అందులో ఐదుగురు కల్లూరు నుంచి ఎంపిక కావటం విశేషం. వీరి ఎంపిక కావడం పట్ల వీరిని ఖమ్మం జిల్లా యువజన మరియు క్రీడల అభివృద్ధి అధికారి టి.సునీల్ రెడ్డి, సీనియర్ అథ్లెటిక్స్ శిక్షకులు గౌస్ వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ అలాగే కల్లూరు మండల వ్యాయామ విద్యా విభాగం వ్యాయామ ఉపాధ్యాయులందరూ విద్యార్థిని విద్యార్థులను వారి తల్లిదండ్రులని ఆశీర్వదించి అభినందించారు.

## రాత్రంతా జోరు వాన

- సున్నం బట్టి వద్ద రహదారిని ముంచెత్తిన వర్షం వరద
- దుమ్ముగూడెంలో 83.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి నుండి గురువారం ఉదయం వరకు రాత్రంతా జోరుగా వాన కురిసింది. మండలంతో పాటు ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కురిసిన భారీ వర్షానికి మండలంలో ఉన్న ప్రధాన వాగులు వంకలు పొంగిపొర్లుతూ ఉధృతంగా ప్రవహించాయి. ఎటు చూసినా పంట పొలాలు సైతం సముద్రాన్ని తలపించాయి. సున్నం బట్టి బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారిని వర్షం వరద ముంచెత్తడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలో 83.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.



పేదలను కొట్టి...

# కార్పొరేట్లకు పెడుతున్న మోడీ ప్రభుత్వం







**దుమ్ముగూడెం :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్ కారం పుల్లయ్య అన్నారు. సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ములకపాడు సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు యలమంచిల వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, నిమ్మల మధు, గుడ్ల సాయి రెడ్డి పాల్గొన్నారు.

**దమ్మపేట :** పేదలను కొట్టి... కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం దోచి పెడుతుందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణలు అన్నారు. గ్యాస్‌పై రాయితీని పూర్తిగా ఎత్తివేసి కంటి తుడుపు చర్యగా సిలెండర్‌కు రూ.2 వందలు తగ్గించి ప్రజలను వంచించాలని కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. ఒక్కో గ్యాస్ సిలిండర్‌ను రూ.5 వందలకే ఇవ్వాలని డిమాండ్ చేసారు. పెట్రోల్, డీజిల్ ధరలను, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని అన్నారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచి కనీస వేతనం రూ.6 వందలు ఇవ్వాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 11 లక్షల ఎకరాలకు పోడు పట్టాలిస్తామని, 4 లక్షల ఎకరాలకే పట్టాలిచ్చిందని విమర్శించారు. అర్హులందరికి గృహలక్ష్మి పథకం వర్తింప చేయాలని, బీసీ, మైనార్టీ, దళిత బంధు పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకే ఇస్తున్నారని దుయ్యబట్టారు. రేషన్ కార్డులు, ఫించన్లు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యండ్రాతి అప్పారావు, మోరంపూడి కేశవరావు, రావుల శోబన్‌బాబు, కొలికపోగు శ్రీనివాసరావు, కొలికపోగు వెంకటేశ్వరరావు, రావి వెంకట వీరయ్య, ధర్మయ్య, గోపిరాజు, మడకం వెంకటేశ్వరరావు, జ్యోతిలు పాల్గొన్నారు.

**జూలూరుపాడు :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్, మండల నాయకులు వల్లమల్ల చందర్ రావు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకొచ్చి ప్రజలను అయోమయం పరిస్థితిలో ఉంచిందన్నారు. నిత్యవసర సరుకులు రోజురోజుకీ ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బానోత్ ఇస్రా, లకావత్ శ్రీను, బొల్లు లక్ష్మయ్య, గార్లపాటి పవన్ కుమార్, బోడ అభిమిత్ర, పెరుమల పవన్, జెమ్మి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

**సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన**

**అశ్వారావుపేట :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, అధిక ధరలు, నిరుద్యోగం, ఉపాధి కుదింపుకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ భాజపా ముసుగుతో ఆర్ఎస్ఎస్ భావజాలంతో అధికారం చేపట్టిన మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆదిమ కాలం నాటి బూజుపట్టిన సంప్రదాయాలను అమలు చేస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.చిరంజీవి, కమిటీ సభ్యులు ముళ్ళగిరి గంగరాజు, తగరం జగన్నాధం, మడకం గోవిందు, తగరం నిర్మల, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.





## తుమ్మలను మోసం చేసిన కేసీఆర్..

- కమ్మ సంఘం నాయకులు

**నవతెలంగాణ-దమ్మపేట**

సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన తుమ్మల నాగేశ్వరరావును తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మోసం చేశారని దమ్మపేట మండల చౌదరి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు స్పష్టం చేశారు. గురువారం మందలపల్లి గ్రామంలో ఎన్‌టీఆర్ చౌదరి వెల్ఫేర్ భవనంలో కమ్మ సంఘం సేవా సమితి సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా కమ్మ సంఘం నాయకులు గడ్డిపాటి సత్యం, పారుపల్లి వీరభద్రం, పోతినేని శ్రీరామ వెంకట్రావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న క్యాడర్ మొత్తాన్ని తుమ్మల నాగేశ్వరరావు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలపడేవిధంగా విలీనం చేయడం జరిగిందని తుమ్మలపై అభిమానంతోనే సుమారు 400 మంది సర్పంచులు, 300 మంది ఎంపీటీసీలు, 23 మంది జడ్‌పిటిసిలు ఒక డిసిసిబి చైర్మన్, ఒక జడ్పీచైర్మన్, స్థానికంగా బలంగా ఉన్న నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరటం జరిగిందని గత అసెంబ్లీ ఎన్నికల్లో తుమ్మల ఎదుగుదల చూసి ఓర్వలేక కొంతమంది నాయకులు తుమ్మలను కావాలని ఓడించారని, ఆ విషయం కె.సి.ఆర్‌కు సైతం తెలుసునని అనుభవజ్ఞుడైన తుమ్మలను కాదని పాలేరులో కెసిఆర్ వేరేవారికి టిక్కెటు ఇవ్వడం వలన తుమ్మల ఎఫెక్ట్ తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద పడుతుందని అందుకే తాము పార్టీలకు అతీతంగా తుమ్మల ఏ నిర్ణయం తీసుకున్నా తమ్మల వెంటే తాము ప్రయాణం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు వజ్జా శ్రీనివాసరావు, బాబ్జి, మొద్దులగూడెం సత్యం, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**నవతెలంగాణ -బూర్గంపాడు**

శ్రీకృష్ణ జన్మాష్టమి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం లోని యాదవుల వీధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ మహా అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. గాంధీనగర్ శ్రీకృష్ణ ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి ఉత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో సారపాక ప్రధాన వీధులలో ఊరేగింపుగా కోలాట నృత్యాలతో వీక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు**

**ములకలపల్లి :** లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ములకలపల్లిలోని శిశుమందిర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్ కేదారేశ్వరరావు, శిశుమందిర్ ప్రధానాచార్యులు కుంజా జగన్ల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనగా పలువురిని అలరించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉట్టి కొట్టి విజయం సాధించిన విద్యార్థికి రూ. 1000 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ కోశాధికారి గాదె తిరుపతిరెడ్డి, సెక్రటరీ రేపాక ప్రసాదరావు, క్లబ్ ట్రెజరర్ ఎండీ. రంజాన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడెం అన్ని రంగాల్లో అభివృద్ధి

- పలు పనులకు శంకుస్థాపనలు
- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్రంలో కొత్తగూడెం నియోజక వర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొత్తగూడెం మున్సిపల్ పరిధిలోని 19, 20, 21, 22, 32 వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సుమారు రూ.14 కోట్ల అభివద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిచి, సీఎంగా కేసీఆర్ హాట్రిక్ సాదించడం ఖాయ మన్నారు. అభివృద్ధిని సహించలేని ప్రతిపక్షాల గ్లోబల్ ప్రచారాలు సాగుతున్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పోడు పట్టాలను పంపిణీ చేశారని, గిరిజనుల ఆరాధ్యదైవమయ్యారని చెప్పారు. 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో, అధికారం వున్నా లేకునా ప్రజల మధ్యనే వున్నానని, వారి సా ద క బా ద కా ల లో పాలుపంచుకున్నానని చెప్పారు. తుది శ్వాస వరకు ప్రజా సేవలో ఉంటానని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి-అభివృద్ధి విరుదుల మధ్యన పోటీ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేంద్రరావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘు, మున్సిపల్ డిఈ రవి, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# పాలేరు నుండి రెండో జోన్‌కు సాగునీరు విడుదల

**ఎండుతున్న పంటలను ఆదుకునేందుకు నిర్ణయం**

**ఎమ్మెల్యే సండ్ర కృషితో ఐదు రోజులు పాటు సరఫరా**

**నవతెలంగాణ- కల్లూరు**

నాగార్జునసాగర్ ఎడమ కాలవ పరిధిలోని రెండోదంలో ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన వరి పైరు వర్షాలు లేక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కూడా రైతుల ఆశించింది లో పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో పాలేరు ఎగువ భాగమున భారీ వర్షాలు పడటంతో పాలేరుకు వరద నీరు రావడంతో రెండోసారి అలుగుపడ్డది. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తో మాట్లాడి పాలేరు రిజర్వాయర్ నుండి అలుగు ద్వారా వధాగా పోయే నీటిని ఐదు రోజులపాటు సరఫరా కోసం ఒప్పించారు. దీంతో సీఎం ఆదేశంతో బుధవారం రాత్రి ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేశారు. తొలిత 500 క్యూసెక్కులు విడుదల చేసి గురువారం మూడు వేలకు పెంచారు. దీంతో శుక్రవారం ఉదయానికి పాలేరు జలాలు కల్లూరు చేరే అవకాశం ఉంది. సుమారు ఐదు రోజులపాటు నీరు సరఫరా అయితే ఎండుతున్న పంటలకు ప్రాణం పోసినట్లే వీటితోపాటు మండలంలోని 17 చెరువులు నింపే అవకాశం కూడా ఉంది. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య చొరవ తీసుకోవడంతోనే ఇది సాధ్యపడిందని జడ్పిటిసి సభ్యుడు కట్టా అజయ్ కుమార్ తెలిపారు. రైతులు వచ్చిన నీటిని వృథా కానీయకుండా సద్వినియోగం చేసుకోవాలని. రైతులను కోరారు.

# ఉచిత బియ్యం డీలర్లకు వరం

**జోరుగా బియ్యం క్రయవిక్రయాల వ్యాపారం**

**నవతెలంగాణ ముదిగొండ**

రాష్ట్ర ప్రభుత్వం పేద వర్గాలకు చౌక దుకాణాల నుండి అందిస్తున్న ఉచిత బియ్యం మండలంలో డీలర్లకు వరంగా మారింది. మండలంలోని 25 గ్రామపంచాయతీలో 37 చౌక దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణ డీలర్లకు ప్రభుత్వం నుండి ప్రతినెల 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉచితంగా అందుతున్నాయి. గ్రామాలలో ఉన్న రేషన్ డీలర్లు కుటుంబంలో ఒక్కొక్క వ్యక్తికి 6 కేజీలు చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వము చౌక దుకాణాల నుండి పేదలకు సన్న బియ్యం అందజేస్తామని మాటలు చెప్పినా ఆచరణలో మాత్రం లావు బియ్యమే డీలర్లకు అందుతున్నాయి. లావు బియ్యం గ్రామీణ ప్రాంతాల్లో పేద వర్గాలు ఎవరూ తినటం లేదు. తినటానికి భోజనం బాగుండటం లేదని ప్రజలు కేజీ రూ.5 చొప్పున డీలర్లకే విక్రయించుకొని నగదు తీసుకువెళ్తున్నారు.ఆ నగదుతో ప్రజలు సన్న బియ్యం కొనుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నెల జరుగుతున్న తంతు ఇది. దీంతో రేషన్ డీలర్లకు ఉచిత బియ్యం వరమైంది. పేదల నుండి కొన్న బియ్యాన్ని రేషన్ డీలర్లు రూ.10 చొప్పున బ్లాక్‌లో ఇతర ప్రాంతాలకు విక్రయించి ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

## గ్రామాలలో ఘర్షణలు సృష్టించవద్దు

**మధిర సీఐ వసంత కుమార్**

**నవతెలంగాణ - ఎర్రుపాలెం**



గ్రామాలలో ప్రజలు స్నేహ పూర్వమైన వాతావరణం కలిగి ఉండాలని ఘర్షణలు, అలజడలు సృష్టించకుండా కలిసి మెలిసి తిరగాలని మధిర సీఐ వసంత కుమార్ సూచించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ నందు గతంలో వివిధ గ్రామాలలో కేసులు నమోదు జరిగిన నాయకులకు పలు సూచనలు సలహాలు అందించారు. భీమవరం, అయ్యవారిగూడెం గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాలను సమసాత్మక గ్రామాలుగా గుర్తించడం జరిగిందన్నారు. అయ్యవారిగూడెం గ్రామంలో 1970 నుండి తరచూ గొడవలు పడుతూ కేసులు నమోదు అవుతున్నట్లు పోలీస్ స్టేషన్ రికార్డులలో ఉం దని అన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో గ్రామాలు ప్రశాంత వాతావరణం కలిగి ఉండాలని తెలిపారు. సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌కి సమాచారం అందించి సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రజాస్వామ్యబద్ధంగా నడుచు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది జ్యోతి, కానిస్టేబుల్ ప్రకాష్, నరేష్ పాల్గొన్నారు.

## ఖమ్మం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెండ్‌గా వెంకటేశ్వర్లు కొనసాగింపు

**నవతెలంగాణ- ఖమ్మం**

ఖమ్మం ప్రభుత్వ ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్‌గా బి. వెంకటేశ్వర్లును మరో మూడు వారాలు కొనసాగిస్తూ గురువారం కోర్టు నుండి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ను ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై వెంకటేశ్వర్లు కోర్టుకు వెళ్ళగా కోర్టు ఈనెల 26వ తేదీ వరకు వెంకటేశ్వర్లును సూపరింటెండెంట్‌గా కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# రాజ్యసభలో 25 పెండింగ్ బిల్లులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభలో 25 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 1992 నాటి పంచాయితీ ఎన్నికలకు ఇద్దరు పిల్లల నిబంధనను అనుసరించడానికి సంబంధించిన బిల్లుతో సహా 25 బిల్లులు రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యసభ బులెటిన్ ప్రకారం పెండింగ్‌లో ఉన్న బిల్లులలో ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు-1997, అద్దెను నియంత్రించడానికి, అద్దె భవనాల మరమ్మతులు, దేశ రాజధానిలో అద్దెదారుల తొలగింపుకు సంబంధించిన బిల్లు, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టాన్ని సవరణ, రెగ్యులేటర్ల నియామకానికి షరతులు వంటి బిల్లులు ఉన్నాయి.

సాధారణంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లులు సభ రద్దుతో ముగిసిపోతాయి. ఏది ఏమైనప్పటికీ, రాజ్యసభ నిరంతర ఛాంబర్‌గా ఉండటం వల్ల రద్దు చేయబడదు. ఈ రాజ్యసభలో ప్రవేశపెట్టిన, పెండింగ్‌లో ఉన్న బిల్లులు ప్రభుత్వం ఉపసంహరించుకోని పక్షంలో లైవ్ రిజిస్టర్‌లో ఉంటాయి.

పంచాయతీ ఎన్నికల కోసం ఇద్దరు పిల్లల నిబంధనను ఆమోదించడానికి సంబంధించిన రాజ్యాంగ (79వ సవరణ) బిల్లు-1992ను పార్లమెంట్ ఎగువ సభలో పెండింగ్‌లో ఉన్న పురాతన ముసాయిదా చట్టం. "బిల్లుకు అనుకూలంగా రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం వల్ల రాజ్యాంగం (79వ సవరణ బిల్లు-1992) పార్లమెంట్‌లో

## పార్లమెంట్ బులెటిన్ ప్రకారం ఉన్న వివరాలు..



పెండింగ్‌లో ఉంది" అని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం 2005లో లోక్‌సభకు తెలిపింది.

పెండింగ్‌లో ఉన్న ఇతర బిల్లులలో మునిసిపాలిటీలు (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) బిల్లు-2001, ది సీడ్స్ బిల్లు-2004, ది ఇండియన్ మెడిసిన్ అండ్ హెూమియోపతి ఫార్మసీ బిల్లు-2005, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (సవరణ) బిల్లు-2008, ది మైన్స్ (సవరణ) బిల్లు-2011, ఇంటర్-స్టేట్ మైగ్రెంట్ వర్క్‌మెన్ (ఉపాధి నియంత్రణ, సేవా నిబంధనలు) సవరణ బిల్లు-2011 ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్‌లో ఉన్న బిల్లులలో తమిళనాడు లెజిస్లేటివ్ కౌన్సిల్ (రద్దు) బిల్లు-2012, బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికులకు సంబంధించిన చట్టాల (సవరణ) బిల్లు-2013, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీలు (ఖాళీల నిర్బంధ నోటిఫికేషన్) సవరణ బిల్లు-2013, రాజస్థాన్ లెజిస్లేటివ్ కౌన్సిల్ బిల్లు-2013, రిజిస్ట్రేషన్ (సవరణ) బిల్లు-2013, ఢిల్లీ అద్దె (రద్దు) బిల్లు, 2013 ఉన్నాయి.

అలాగే పెండింగ్‌లో ఉన్న ముసాయిదా చట్టాలలో అస్సాం లెజిస్లేటివ్ కౌన్సిల్ బిల్లు-2013, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) ప్రాతినిధ్య పునర్నిర్మాణం (మూడో) బిల్లు-2013, వక్ఫ్ ఆస్తులు, అక్రమాల తొలగింపు-2013, అస్సాంకు సంబంధించిన రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగలు) ఆర్డర్ (సవరణ) బిల్లు-2019, రాజ్యాంగం (నూట ఇరవై ఐదో సవరణ) బిల్లు-2019 ఉన్నాయి.

పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో ది రిజిస్ట్రేషన్ ఆఫ్ మ్యారేజ్ ఆఫ్ నాన్ రెసిడెంట్ ఇండియన్ బిల్లు-2019, అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల (సవరణ) బిల్లు-2019, పురుగు మందుల నిర్వహణ బిల్లు-2020 ఉన్నాయి. రద్దు, సవరణ బిల్లు-2023, పోస్ట్ ఆఫీస్ బిల్లు- 2023, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) బిల్లు-2023ని ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

## నేటినుంచి సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడురోజులపాటు సంగారెడ్డిలో జరగనున్నాయి. తొలి రోజు విద్యార్థుల ప్రదర్శన, బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను హాజరవుతారు. శనివారం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులతో సభ జరుగుతుంది. ఆదివారం విద్యారంగం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి భవిష్యత్ పోరాటాల కార్యక్రమాలను రూపకల్పన చేస్తారు. బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం సంక్షోభంలోకి కూరుకుపోయిన విషయాలతో, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోవడం, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలపై చర్చిస్తారు. అద్దె భవనాల్లో గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థుల వసతి, వారు ఎదుర్కొంటున్న సమస్యలపైనా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో చర్చిస్తారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు నిర్ణయం తీసుకుంటారు.

## బిజినెస్

### వాయిస్‌తోనూ యూపీఐ చెల్లింపులు

- అభివృద్ధి చేసిన ఎన్‌పీసీఐ




న్యూఢిల్లీ : యుపిఐ యాప్‌ల ద్వారా ఇకపై వాయిస్‌తోనూ నగదు చెల్లింపులు జరిపేలా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) టెక్నలాజీని అభివృద్ధి చేసింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వ్యవస్థతో సంభాషించడం ద్వారా లావాదేవీలు పూర్తి చేయవచ్చు. ఈ సౌలభ్యాన్ని 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2023'లో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ లాంచనంగా ఆవిష్కరించారు. యూపీఐ, యూపీఐ లైట్ ఎక్స్, ట్యాప్‌అండ్‌పే, వాయిస్ ద్వారా చెల్లింపుల కోసం హలో యూపీఐ, బిల్‌పే కనెక్ట్ తదితర ఐదు చెల్లింపు విధానాలను అందుబాటులోకి తెచ్చినట్లు శక్తికాంత దాస్ వెల్లడించారు. యూపీఐ లైట్‌ఎక్స్ ద్వారా ఇంటర్నెట్ లేకపోయిన చెల్లింపులు చేయడానికి వీలుందన్నారు. యూపీఐ క్రెడిట్ లైన్ ద్వారా బ్యాంకులు ముందుగా మంజూరు చేసిన రుణ పరిమితిని ఉపయోగించుకోవచ్చన్నారు.

### రూపాయి డీలా..

- డాలర్‌తో పోల్చితే 83.22కు పతనం



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో వరుసగా నాలుగో రోజూ భారత రూపాయి విలువ పడిపోయింది. గురువారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 9 పైసలు పతనమై ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా 83.22 కనిష్ట స్థాయికి దిగజారింది. డాలర్‌కు డిమాండ్ పెరగడంతో పాటుగా, పెరిగిన ముడి చమురు ధరల వల్ల రూపాయి విలువ మరింత ఒత్తిడికి గురైయ్యింది. దీంతో వరుసగా నాలుగో రోజూ నేల చూపులు చూసినట్లయ్యింది. చమురు ఉత్పత్తి దేశాలు ఈ ఏడాది డిసెంబరు వరకు సరఫరా కోతను పొడగించాలని భావించడంతో.. ముడి చమురు బ్యారెల్ 90 డాలర్లకు చేరింది. ఈ పరిణామంతో ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకం వద్ద డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ 83.15 వద్ద ప్రారంభం కాగా.. తుదకు ఇంతక్రితం రోజు ముగింపుతో పోల్చితే 9 పైసల పతనాన్ని నమోదు చేసింది. బుధవారం 9 పైసలు కోల్పోయి 83.13 వద్ద ముగిసింది. ఇంతక్రితం ఆగస్టు 21న భారత కరెన్సీ అత్యల్పంగా 83.13 వద్ద నమోదయ్యింది. "బలమైన డాలర్, పెరిగిన ముడి చమురు ధరలు రూపాయిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. యుఎస్ ట్రెజరీ దిగుబడులు పెరగడం, ప్రపంచ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు కూడా రూపాయిపై ప్రభావం చూపుతున్నాయి." అని బిఎన్‌పి పరిబాస్‌కు చెందిన షేర్‌కాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి పేర్కొన్నారు.

### శాఖాహారులపై టమాటా దెబ్బ

- ప్లేట్ ధర 24% ప్రియం : క్రిసిల్ రిపోర్ట్



న్యూఢిల్లీ : దేశంలో ఓ దశలో మూడంకెల స్థాయికి పెరిగిన కిలో టమాటా ధర శాఖాహారుల భోజనంపై తీవ్ర ప్రభావం చూపిందని రేటింగ్ ఎజెన్సీ క్రిసిల్ పేర్కొంది. 2022 ఆగస్టుతో పోల్చితే గడిచిన నెలలో సగటు భారతీయ కుటుంబంలో శాఖాహారం థాలీ (ప్లేట్) ధర 24 శాతం పెరిగిందని క్రిసిల్ విడుదల చేసిన నెలవారీ రోటీ రైస్ రేట్ నివేదికలో తెలిపింది. 2023-24లో కూరగాయల భోజనం ధర పెరగడం ఇది రెండోసారని పేర్కొంది. 24 శాతంలో 21 శాతం టమాటా ధరనే కారణమని తెలిపింది. గతేడాది కిలో ధర రూ.37గా ఉండగా.. ఈ ఏడాది 176 శాతం ఎగిసి రూ.100పైకి ఎగబాకిందని పేర్కొంది. వెజ్ థాలీలో రోటీ, కూరగాయలు (ఉల్లిపాయలు, టొమాటో మరియు బంగాళదుంపలు), బియ్యం, పప్పు, పెరుగు, సలాడ్ ఉంటాయి. దీని సగటు ధర ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ భారతదేశంలో ఉన్న ధరల ఆధారంగా లెక్కించింది. గడిచిన నెలలో మాంసహార ప్లేట్ ధర 13 శాతం పెరిగింది. కాగా.. సెప్టెంబర్‌లో తగ్గుతోన్న టమాటా ధరల వల్ల ప్లేట్ భోజనం ధర దిగిరావొచ్చని క్రిసిల్ పేర్కొంది.

### మార్కెట్లోకి మోటో జి54 5జి స్మార్ట్‌ఫోన్

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ మోటో మార్కెట్లోకి తన కొత్త మోటో జి54 5జి ఫోన్‌ను విడుదల చేసింది. ఇందులో 8జిబి, 128జిబి దరను రూ.15,999గా, 12జిబి, 256జిబి ధరను రూ.18,999గా నిర్ణయించింది. ఇందులో 120 హెర్జ్ రిఫ్రెష్ రేట్ ఉన్న హోల్ పంచ్ డిస్‌ప్లేను ఉపయోగించినట్లు ఆ కంపెనీ తెలిపింది. మీడియాటెక్ డైమన్సిటీ 7020 ప్రాసెసర్‌పై పని చేయనుందని పేర్కొంది. 6000 ఎంఎహెచ్ భారీ బ్యాటరీ ఉంది.

### ఎయిర్ టర్బో టెక్నాలజీతో చల్లధనంగా పాదరక్షలు

- క్యాంపస్ యాక్టివ్‌వేర్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రముఖ స్పోర్ట్స్, అథ్లెయిజర్ పాదరక్షల బ్రాండ్‌లో ఒక్కటైనా క్యాంపస్ యాక్టివ్‌వేర్ కొత్తగా ఎయిర్ టర్బో టెక్నాలజీతో ప్రత్యేక శ్రేణీ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఈ పాదరక్షల సాంకేతికతను భారతీయ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు పేర్కొంది. క్యాంపస్ ఎయిర్ టర్బోతో రోజంతా వినియోగదారుల పాదాలను చల్లగా, తాజాగా, సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపింది. షూ వెనుక భాగంలో ఇన్లెట్, అవుట్‌లెట్ పోర్ట్ ఉండటంతో గాలి ప్రసరణకు గేట్‌వే లా ఉంటుందని క్యాంపస్ యాక్టివ్‌వేర్ లిమిటెడ్ సిఎంఒ ప్రేరణా అగర్వాల్ తెలిపారు. క్యాంపస్ ఎయిర్ టర్బో శ్రేణీ ప్రారంభ ధర రూ.2,299గా నిర్ణయించింది.

### రూ.12,999కే రియల్‌మీ నార్జో 60ఎక్స్

న్యూఢిల్లీ : రియల్‌మీ కొత్తగా మార్కెట్లోకి నార్జో 60 ఎక్స్ 5జి స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. బడ్జెట్ ధరలో ఆకర్షణీయమైన ఫీచర్లతో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. 4జిబి ర్యామ్ ధర రూ.12,999గా, 6జిబి ర్యామ్ ధరను రూ.14,999గా నిర్ణయించింది. దీని అమ్మకాలు సెప్టెంబర్ 12న మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభిస్తున్నట్లు పేర్కొంది. వెనుకవైపు 50 మెగా పిక్సెల్ ఎఐ కెమెరా సహా మరో కెమెరాను అమర్చింది. సెల్ఫీ కోసం 8ఎంపి కెమెరాతో రూపొందించింది.

## పాలమూరు జిల్లా ప్రజల కల సాకారం

- కొల్లాపూర్, అచ్చంపేట అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు కాబోతున్నాయి
- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు 16న సీఎం ప్రారంభోత్సవం
- ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పాలమూరు ప్రజల కలలు సెప్టెంబర్ 16న సాకారం కాబోతున్నయని ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సెప్టెంబర్ 16వ తేదీన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు చేతుల మీదుగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో ప్రారంభోత్సవం చేస్తారని చెప్పారు. అక్కడ బహిరంగ సభ కోసం పరిశీలించడానికి గురువారం కోల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్‌తో కలిసి మంత్రి కొల్లాపూర్, నార్లాపూర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో కృష్ణా నది పాలమూరు గుండా ప్రవహిస్తున్నప్పటికిని తాగడానికి గుక్కెడు నీళ్ళు కరువయ్యేదన్నారు. అప్పటి పాలకులను అడిగితే.. నది కిందికి ఉంటే మీ పాలమూరు గడ్డ మీద ఉన్నది.. నీళ్ళు ఎలా వస్తాయి అని హేళన చేసేవారు అన్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఉద్యమ సమయంలో అలంపూర్ వద్ద పాలమూరు గోస చూసి కన్నీరు పెట్టుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచంలోనే అత్యంత పెద్ద మోటార్లు పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు ఏర్పాటు చేసి నీళ్లను ఎత్తి పోసేవిధంగా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. సెప్టెంబర్ 16వ తేదీన నార్లాపూర్ కంట్రోల్ రూం వద్ద స్విచ్ ఆన్ చేసి ఇంటేక్ వద్ద కృష్ణమ్మకు పూలు చల్లనున్నారని వెల్లడించారు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలో భూములు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. కొల్లాపూర్, అచ్చంపేట పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి అవుతాయన్నారు.

## నేటివరకు ఎంబీబీఎస్ రిపోర్టింగ్ గడువు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ రెండవ విడత ప్రవేశాల రిపోర్టింగ్ గడువును శుక్రవారం సాయంత్రం వరకు పొడిగిస్తున్నట్టు పత్రికా ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి ఈ గడువు గురువారంతోనే ముగియనుండగా, అభ్యర్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు గడువు పెంచాలని ఆరోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు అధికారుల్ని ఆదేశించారు. దీనిపై యూనివర్సిటీ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది.

## నాలుగేండ్లయినా ముందల పడ్తలే..

- అక్కడ అలా.. ఇక్కడ ఇలా..
- అవస్థల నడుమ మెడికోలు
- నల్లగొండ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..
- సూర్యాపేటలో ఇప్పటికే ఓపెన్




నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

కాలేజీ మంజూరై దాదాపు నాలుగేండ్లు కావొస్తున్నా.. నేటికీ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. పక్క జిల్లా సూర్యాపేటలో మాత్రం మెడికల్ కాలేజీ ఇప్పటికే అట్టహాసంగా ప్రారంభమైంది. కానీ నల్లగొండ జిల్లా కేంద్రంలోని గంధవారిగూడెం సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో మొదటగా రాష్ట్ర ప్రభుత్వం 2019లో మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లాకూ మెడికల్ కాలేజీ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే, సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే పనులు పూర్తయ్యి.. కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యాయి. నల్లగొండలో మాత్రం నిర్మాణ దశకే పరిమితమైంది. దాంతో నల్లగొండ జిల్లా కేంద్రాస్పత్రిలోని భవనాల్లోనే మెడికల్ కాలేజీని రన్ చేస్తుండటంతో సరైన వసతులు లేక విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాస్తవానికి మొదట్లో మెడికల్ కాలేజీని గంధవారిగూడంలోని ఎస్ఎల్‌బీసీలో నిర్మించాలని భావించారు. కానీ బీఆర్ఎస్ నేతలు పట్టుబట్టి జిల్లా కేంద్రాస్పత్రి ఆవరణలో నిర్మించాలని నిర్ణయించారు. అయితే, మెడికల్ కాలేజీ నిర్మాణానికి కనీసం 40 ఎకరాల స్థలం కావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రాస్పత్రిలో కాలేజీ నిర్మాణం సాధ్యపడేలా లేకపోవడంతో తిరిగి ఎస్ఎల్‌బీసీకి మార్చారు. మెడికల్ కాలేజీని 48 ఎకరాల్లో రూ.117కోట్లతో నిర్మించేందుకు నిర్ణయించారు. నిర్మాణానికి టెండర్లు సైతం పూర్తి చేశారు. కానీ శంకుస్థాపన దశలోనే దాదాపు రెండు సంవత్సరాల కాలం వృథాగా గడిచిపోయింది. ఆలస్యానికి సాక్షాత్తూ సీఎం కేసీఆర్ వచ్చి మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేయాలని బీఆర్ఎస్ నేతలు పట్టుబట్టడమే కారణం. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ జిల్లాలో రెండుమూడు సార్లు పర్యటించి వెళ్లినా మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేయలేదు. చివరకు ఐటీ హబ్‌కు శంకుస్థాపన చేసే సమయంలోనే మంత్రులతో మెడికల్ కాలేజీ శంకుస్థాపన చేయించారు. అనంతరం నిర్మాణ పనులు మొదలైనా.. మళ్లీ పనుల్లో జాప్యం నెలకొంది.

**సూర్యాపేటలో కాలేజీ ఓపెన్..**

నల్లగొండ, సూర్యాపేట మెడికల్ కాలేజీలు ఒక్కసారే మంజూరైనా.. సూర్యాపేట మెడికల్ కాలేజీ భవనాలు అట్టహాసంగా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి సమీపంలోని ఎస్సీ కాలేజీలో మెడికల్ కాలేజీని అత్యద్భుతంగా నిర్మించారు. అయితే రెండూ పక్క పక్క జిల్లాలైనా.. అభివృద్ధి పనుల్లో నల్లగొండ జిల్లా అధికార పార్టీ నేతలు వెనుకబడిపోయారు. ఈ నెలలోనైనా మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారా..? లేక పనులు నత్తతో పోటీ పడతాయా..? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**సమస్యలతో మెడికోలు సతమతం..**

నల్లగొండ మెడికల్ కాలేజీలో నిత్యం సమస్యలే దర్శనమిస్తున్నాయి. మెడికోలు కాకపోతే అధ్యాపకులు.. వీరు కాకపోతే వారు అన్నట్టుగా నిరసనలు, ధర్నాలు జరుగుతున్నాయి. హాస్టల్‌లో వసతులతోపాటు కాలేజీకి దూరంగా ఉండటంతో రాత్రి సమయంలో సెక్యూరిటీ విషయంలో మెడికోలు ఇప్పటికే పలుమార్లు ఆందోళనకు దిగారు. ఉన్నత సిబ్బంది.. కిందిస్థాయి సిబ్బందిని పలు కారణాలతో వేధిస్తున్నారని, అటెండెన్స్, సెలవులు తదితర విషయాల్లో టార్గెట్ చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. దీనికితోడు విద్యార్థులకు సంబంధించి ప్రాక్టికల్స్ కోసం ల్యాబ్స్, ఇతర సౌకర్యాలు వేధిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు ఆ సమస్యల పరిష్కారం దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపాలి

- హైదరాబాద్‌లో స్మృతిచిహ్నాలను నిర్మించాలి
- సీఎం కేసీఆర్‌కు చాడ లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విలీన దినోత్సవం సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలను స్మృతిచిహ్నాలుగా గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. హైదరాబాద్‌లో స్మృతి చిహ్నాలను నిర్మించాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు గురువారం ఆయన లేఖ రాశారు. తెలంగాణ ఆవిర్భవించి పదేండ్లు అవుతున్నా ఇప్పటికీ మల్లారెడ్డి గూడెం, బొల్లెపల్లి, గుండ్రాంపల్లి, బైరాన్‌పల్లి, మందాపూర్, కూటిగల్లు, కడివెండి, పాలకుర్తి వంటి అనేక రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలలో ప్రజల తరపున ఏర్పాటు చేసిన చిహ్నాలు శిథిలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ విలీన దినోత్సవాన్ని జరపకుండా ఆనాటి ప్రభుత్వాలు అన్యాయం చేశాయంటూ సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు.

తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత కూడా ఆనాటి రైతాంగ సాయుధ పోరాటాన్ని నేటి తరాలకు, రాబోయే తరాలకు అందించేందుకు నాటి త్యాగధనుల చరిత్రను పాఠ్యాంశాలలో పొందుపరచబడలేదని విమర్శించారు. ఈనెల 11 నుంచి 17 వరకు జరిగే సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాలలో చేర్చాలని కోరారు.

# బీసీల లక్ష ప్రయాస

**ఎన్నికల పథకాలపైనా వీడని ప్రభుత్వ నిర్లక్ష్యం**

- నాడు దరఖాస్తు కోసం అవస్థలు.. నేడు ఎదురుచూపులు
- 4 లక్షలకు పైగా అప్లికేషన్లు.. లక్ష మందికీ చేకూరని లబ్ది
- ఖమ్మం జిల్లాలో 26,451కి 1500 మందికే చెక్కులు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వెనుకబడిన కులాలు, చేతివృత్తిదారులకు (బీసీ) రాష్ట్రప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. బీసీలు వృత్తి పనిముట్లు, ముడిసరుకు కొనుగోలుకు ఈ నిధులు ఉపయోగించుకోవచ్చని పేర్కొన్న ఈ పథకం అమల్లో పారదర్శకత లోపించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం నాలుగున్నర లక్షల దరఖాస్తులు వచ్చాయి. జూన్ 26వ తేదీ నుంచి లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్నా.. ఇంత వరకు లక్ష మందికి కూడా సాయం అందలేదని అధికారిక సమాచారం. ఖమ్మం జిల్లాలో 26,451 దరఖాస్తులు రాగా 14,883 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. వీరిలో నియోజకవర్గానికి 300 చొప్పున ఐదు సెగ్మెంట్లకు 1500 మందికి మాత్రమే ఇప్పటి వరకు చెక్కులు పంపిణీ చేశారు.

**దరఖాస్తులు మొదలు అవస్థలు..**

ఈ పథకం కోసం జూన్ 6వ తేదీ నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించి 20వ తేదీ వరకు స్వీకరించారు. రకరకాల నిబంధనలు పెట్టడంతో దరఖాస్తుల ప్రక్రియ ముగిసేలోపు సంబంధిత ఆదాయ సర్టిఫికెట్లు అందక చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. కొంత మంది దరఖాస్తులు వివిధ కారణాల రీత్యా తిరస్కరణకు గురయ్యాయి. 'గులాబీ' నేతలు నేరుగా తీసుకొచ్చి ఇచ్చిన దరఖాస్తుల్లో మాత్రం అధిక భాగం ఎంపికయ్యాయని ప్రచారం జరుగుతోంది. కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందకపోవడం, రేషన్‌కార్డులు లేకపోవడంతో లక్షలాది మంది అప్లై చేసుకోలేకపోయారు. అయినప్పటికీ ఇది నిరంతర ప్రక్రియన్న బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ నెలకు ఎంతమంది లబ్దిదారులను ఎంపిక చేస్తారనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో గడువు తేదీ పెంచాలని డిమాండ్ వచ్చినా.. పలుచోట్ల జనం ఆందోళనలు చేసినా.. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దరఖాస్తుల సమయంలో అందరూ ఏకకాలంలో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవడంతో సర్వర్లు మొరాయించాయి. దాంతో కొంతమందికి ఈ సర్టిఫికెట్ల నెంబర్లు రాసిచ్చారు. కొన్నిచోట్ల ఆర్ఐలు, తహసీల్దార్లు సంతకం చేయకపోవడంతో సర్టిఫికెట్లు జారీ కాలేదు. ఇలా పలువురు దరఖాస్తు చేసుకోలేకపోయారు.

**గైడ్‌లైన్స్‌లోనూ గందరగోళం**

గైడ్‌లైన్‌లోనూ గందరగోళం నెలకొనడంతో అప్లికేషన్‌ల సమయంలో కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో కలెక్టర్లు ఈ అంశంపై సందేహాలు లేవనెత్తారు. ఈ నేపథ్యంలో ఈ పథకం జీవోను మార్చి ఎవరెవరు అనే అంశాలతో మరో మెమో జారీ అయింది. అందులో 14 కులాలతో పాటు ఎంబీసీ కులాలకూ అప్లై చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పలువురు రేషన్‌కార్డులు లేక అప్లై చేసుకోలేక పోయారు. అప్లికేషన్‌కు ఆధార్‌కార్డు ఎంటర్ చేయగానే రేషన్‌కార్డు నెంబర్ అడుగుతుండటంతో రేషన్‌కార్డు లేని చాలామంది దరఖాస్తు చేయలేకపోయారు. 2018 ఎన్నికలప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 2021లో ప్రభుత్వం 3 లక్షల మందికి కార్డులు జారీ చేసింది. మిగిలిన 6 లక్షల మంది కార్డులను వివిధ కారణాలతో నిలిపివేసింది. తదితర సాంకేతిక సమస్యలతో లక్షలాది మంది అప్లై చేయలేకపోయినా.. పలువురి దరఖాస్తులు తిరస్కరణకు గురైనా ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా రూ.లక్ష బీసీ సాయం ఇవ్వడంపై లబ్దిదారులు మండిపడుతున్నారు. చేసే కొద్దిపాటి సాయం కూడా అందరికీ కాకుండా కొందరికి మాత్రమే ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

**ఖమ్మం జిల్లాలో ఇదీ పరిస్థితి..**

ఖమ్మం జిల్లాలో మొత్తం ఐదు నియోజకవర్గాలకు గాను ఖమ్మంలో 3,933 దరఖాస్తులు రాగా 2,284 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. 1649 అప్లికేషన్లు రిజక్టయ్యాయి. వీరిలో మూడు వందల మందికే లబ్ది చేకూరింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరలో 6079 అప్లికేషన్‌లకు 2,897 అర్హత సాధించగా అత్యధికంగా 3,182 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అర్హులకన్నా అనర్హులే ఈ నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది ఉండటం గమనార్హం. పాలేరు నుంచి 5,760 దరఖాస్తులు రాగా 2,952 అర్హత సాధించగా 2,808 తిరస్కరించారు. సత్తుపల్లిలో 5,488 దరఖాస్తులకు గాను 3,477 ఎంపికయ్యాయి. వైరాలో 5,191కి 3,273 అర్హత సాధించగా 1,918 దరఖాస్తులను తిరస్కరించారు. జిల్లావ్యాప్తంగా 26,451కి గాను 10,568 దరఖాస్తులు ఎంపిక కాకపోవడం గమనార్హం.

**ఎంపికైనట్టు మెసేజ్ వచ్చి నెలైంది..**

బీసీ రూ.లక్ష సాయానికి ఎంపికైనట్టు మెసేజ్ వచ్చి నెలరోజులైంది. కానీ ఇంత వరకు సాయం మాత్రం అందలేదు. సెలూన్ షాప్ కొత్తడబ్బా కోసం బయట రూ.1.5 లక్షలు అప్పుతెచ్చా. వడ్డీలు పెరుగుతున్నాయి. రూ.లక్ష సాయం అందుతుందో లేదోనని భయంగా ఉంది.

- ఏడుకొండలు, నాయీబ్రాహ్మణ వృత్తిదారుడు, ఖమ్మం రూరల్



చిన్నప్పటి నుండి పరిశోధన పట్ల మక్కువ ఎక్కువ. దానికి తోడు తండ్రి ప్రోత్సాహం. పెండ్లి తర్వాత భర్త వెన్నుదన్నుగా నిలబడ్డారు. ఓ మహిళ తనలోని ప్రతిభను ఆచరణలో పెట్టేందుకు ఇంకేం కావాలి. ఆ పట్టుదలతోనే సహర్ష్ ఫార్మా. సంస్థను స్థాపించారు. చిన్నారుల కోసం సబ్బులు, బేబీ వైప్స్, డైపర్స్ మొదలైనవి తయారు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. రెయిన్‌బో హాస్పిటల్స్‌తో టై-అప్ అయ్యి తన ఫార్మా సంస్థను అభివృద్ధి పథంలో నడిపిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. ఆమే డా.సుమలత. అంచలంచలుగా ఎదుగుతున్న యువ పారిశ్రామికవేత్త జీవిత విశేషాలు మానవి పాఠకుల కోసం...

# ప్రతిభను ఆచరణలో పెట్టింది

డాక్టర్ గుంటుపల్లి సుమలత తల్లిదండ్రులు చిన్నారావు, మల్లీశ్వరి. వారి స్వగ్రామం గుంటూరు. తండ్రి ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. ఆయన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కావడం వల్ల సుమలత చదువు గుంటూరు, బాపట్లతో పాటు కొంతకాలం హైదరాబాద్‌లో సాగింది. 2001 నుండి 2005 వరకు ఆమె విశ్వభారతి ఇన్‌స్టిట్యూట్ గుంటూరు నుండి బి.ఫార్మసీ, 2005 నుంచి 2007 వరకు భారతి ఇన్‌స్టిట్యూషన్స్ ఇబ్రహీంపట్నంలో (జేఎన్‌టీయూ,హైదరాబాద్) ఎం. ఫార్మసీ చేశారు. ప్రాజెక్ట్ వర్క్ చేస్తున్న క్రమంలో పరిశోధనపై ఆమెకున్న ఆసక్తిని గమనించి ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ తన పనిని మెచ్చుకుని పి.హెచ్.డి చేయమంటూ ప్రోత్సహించారు.

### రెండో బాబు పుట్టినపుడు

ఆంధ్ర యూనివర్సిటీలో 2008లో పి.హెచ్‌డిలో సీటు వచ్చింది. 2010లో పి.హెచ్‌డి పట్టా అందుకున్నారు. చదువు పూర్తి చేసిన తర్వాత సుమలత తండ్రి ప్రోత్సాహంతో ఫార్మసీ రంగంలో అడుగు పెట్టారు. తండ్రి స్థాపించిన సుప్రాసిస్ అనే ఒక ఫార్మా మార్కెటింగ్ కంపెనీ బాధ్యతలు చూసేవారు. శైలేష్‌తో 2010లో ఆమె వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. రెండో బాబును పెంచే క్రమంలో ఆమెకు కొన్ని సమస్యలు వచ్చాయి. అంటే సబ్బులు, డైపర్స్ పడక బాబు వంటి మీద రాషెస్ వచ్చేవి. ఎందుకిలా జరిగింది? లోపం ఎక్కడుంది? అని తనని తాను ప్రశ్నించుకుని పరిశోధన మొదలు పెట్టారు. తండ్రి నడుపుతున్న ఫార్మా కంపెనీ చూస్తున్న అనుభవంతో తానే స్వయంగా తన సమస్యను పరిష్కరించాలని సుమలత నిశ్చయించుకున్నారు. ఫార్మసీ R&Dలో తీవ్ర పరిశోధన మొదలుపెట్టారు.

### ఓ బ్రాండ్ సృష్టించారు

అత్తగారింటిలో కూడా సుమలతకు మంచి ప్రోత్సాహమే లభించింది. పరిశోధనపై ఉన్న మక్కువ, ఉత్సాహం, శ్రద్ధ వల్ల కొడుకు పేరు మీద 2021లో 'సహర్ష్ ఫార్మా' అనే సంస్థను స్థాపించి 'మీచు' అనే బ్రాండ్ సృష్టించారు. అప్పుడే పుట్టిన పిల్లల (నియో నాటల్) నుండి మూడేండ్ల పిల్లలకు అవసరమయే వైప్స్, డైపర్స్, సబ్బులు మొదలగు ఉత్పత్తులను లాంచ్ చేశారు. బేబీ వైప్స్, బేబీ లోషన్, బేబీ సోప్, బేబీ డైపర్స్, అబ్సార్‌బెంట్ వెట్ షీట్స్ కొన్ని వీరి ఉత్పత్తుల్లో ఉన్నాయి. అయితే ఈ ఉత్పత్తులన్నీ ఢిల్లీలో తయారవుతాయి. మధ్య మధ్యలో తానే స్వయంగా అక్కడికి వెళ్ళి తయారయ్యే ఉత్పత్తులను పర్యవేక్షిస్తుంటారు. ఫైనల్ ప్రొడక్ట్స్ వచ్చేంత వరకు దగ్గరుండి చూసుకుంటారు.




### అంతకు ముందు ఎన్ని ఉన్నా...


అంతకు ముందే పెద్ద పెద్ద సంస్థలు చేసిన ఉత్పత్తులు ఉన్నవి కదా, నీవు చేసినవి ఏం నడుస్తాయన్న వాళ్లకు సమాధానంగా ఎదిగి ఉన్నత స్థాయిలో మంచి డిమాండ్‌తో తన ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నారు సుమలత. ఈ ఉత్పత్తులను ఆన్‌లైన్ సంస్థలైన అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మీషో, జియో మార్ట్, బిగ్ బాస్కెట్, టాటా ఐఎన్‌జి ద్వారా మార్కెటింగ్ చేస్తున్నారు. అలాగే రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌తో కూడా టై-అప్ చేసుకున్నారు. తన తెలివితో ప్రకృతి సిద్ధమైన వస్తువులను ఉపయోగించి పిల్లలకు ఎటువంటి రాషెస్ రాని ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. అంతే కాదు తన సంస్థలో పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

### నమ్మకమే కారణం

మార్కెట్‌లోకి వచ్చిన వారంలోపే అన్ని ఉత్పత్తులు అమ్ముడు పోవడం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేశారు డా. సుమలత. తాము ఉత్పత్తి చేసిన వస్తువుల మీద వినియోగదారులకు ఉండే నమ్మకమే దీనికి కారణమంటూ ఆనందంగా చెబుతున్నారు. 2021 అక్టోబర్‌లో ఆమె తన ఉత్పత్తులను మొదలు పెట్టారు. అనతి కాలంలోనే రూ.70 లక్షల రూపాయల టర్నోవర్‌తో మీచు ప్రొడక్ట్స్ ముందుకు దూసుకుపోతున్నది. రాబోయే కాలంలో బేబీ టూత్ పేస్ట్, బేబీ షాంపూ, మసాజ్ ఆయిల్, బేబీ వెట్ వైప్స్ కూడా వీరి సంస్థ నుండి వస్తాయంటున్నారు. 6 నుండి 17 ఏండ్ల పిల్లలకు కూడా పనికివచ్చే విధంగా ఉత్పత్తులు చేస్తామన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.




- డా.చీదెళ్ళ సీతాలక్ష్మి, హైదరాబాద్



బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానం. తల్లిపాలు, పాపాయి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలో విటమిన్‌లు, మినరల్స్, ప్రొటీన్‌లు, కార్బోహైడ్రేట్లు.. వంటి ఎన్నో పోషకాలతో పాటు చిన్నారి శరీరానికి అవసరమైన కొవ్వులు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇవి వారి ఆరోగ్యానికి, ఎదుగుదలకు చాలా అవసరం. తల్లి, బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లీబిడల మధ్య బంధం మరింత దృఢమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. పాలివ్వడం వల్ల పిల్లలకే కాదు, తల్లికీ మేలు జరుగుతుంది. పాలు పట్టడం వల్ల డయాబెటిస్, అధిక రక్తపోటు బారిన పడే అవకాశం చాలా వరకు తగ్గుతుంది. అందువల్ల పాలిచ్చేప్పుడు ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోకూడదో తెలుసుకుందాం...

## ఈ ఆహారం వద్దు...!



### కాఫీ..

ఈ రోజుల్లో 95 శాతం ఆపరేషన్ ద్వారానే డెలివరీలు అవుతున్నాయి. అటువంటి వారికి ఒక వారం పదిహేను రోజులు కాఫీ తాగమని హాస్పిటల్ సిబ్బంది సలహా ఇస్తుంటారు. కుట్లు మానేందుకు ఇది సహకరిస్తుందని వారి సూచన. ఆ కొద్ది రోజులు తీసుకుంటున్నారు కూడా. చాలా మందికి ఉదయం, సాయంత్రం కాఫీ తీసుకోవడం అలవాటుగా ఉంటుంది. పాలిచ్చే తల్లులు ఒకటి, రెండు సార్లు కాఫీ తాగొచ్చు. అంతకు మించి తాగొద్దు. దీని వల్ల అజీర్ణ సమస్యలు వస్తాయి. కాఫీలోని కెఫిన్ కంటెంట్ పెద్దవారికి జీర్ణమవుతుంది. కానీ, పాల రూపంలో శిశువులోకి వెళ్ళగానే వారు ఆ పాలని జీర్ణించుకోలేరు. కాలక్రమేణా పెద్ద మొత్తంలో కెఫిన్ మీ చిన్నారుల వ్యవస్థలో పేరుకుపోతుంది. ఈ కారణంగా వారికి చికాకు, నిద్రకు భంగం ఏర్పడుతుంది.

### పచ్చి కూరగాయలు

ఆరోగ్యం కోసం అని కొద్దిమంది క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బ్రోకలీ వంటి పచ్చి కూరగాయలను అల్పాహారంలో చేర్చుకుంటారు. ఇలా తీసుకోవడం వల్ల తల్లి ప్రేగులో గ్యాస్ ఏర్పడే ప్రమాదం ఉంది. దీని కారణంగా తల్లికి ఫుడ్ పాయిజనింగ్ అయ్యే అవకాశం కూడా ఉంది.

### హై మెర్క్యూరీ చేపలు..

హై మెర్క్యూరీ కంటెంట్ శిశువు కేంద్ర నాడీ వ్యవస్థను శాశ్వతంగా ప్రభావితం చేస్తుంది. బిగ్ ఐ ట్యూనా, కింగ్ మాకెరెల్, మార్లిన్ ఫిష్‌లలో మెర్క్యూరీ ఎక్కువగా ఉంటుంది, ఇది విష పూరితమైన లోహం. చిన్నారులకు ఇది హాని చేస్తుంది. దీని కారణంగా వారు బలహీనంగా మారే ప్రమాదం ఉంది.

### ఆల్కహాల్..

పాలిచ్చే తల్లులు ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది పాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఆల్కహాల్ తాగడం వల్ల పిల్లలు పాలు తాగడం 20 నుంచి 23 శాతం తగ్గుతుంది. పాపాయి నిద్ర భంగం, చికాకు కలుగుతుంది.

### చాక్లెట్స్...

చాక్లెట్లు, బిస్కెట్లు, స్వీట్లు, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం సర్వసాధారణమైన అంశం. అయితే వీటిని బాగా తగ్గించాలి. వీటిలో ఉండే కెఫీన్, చక్కెరలు తల్లుల్లో పాల ఉత్పత్తిని తగ్గిస్తాయి. అలాగే పిల్లలు తల్లిపాలు తాగడం వల్ల వారికీ దగ్గు, జలుబు, జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి పిల్లలకు పాలివ్వడం ఆపే వరకు తల్లులు ఇలాంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంటే మంచిది.

## గోడ కూలి ముగ్గురు కూలీలు మృతి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. అయితే, అనుమతులు లేకుండా ఆరో అంతస్థు కూడా నిర్మించారు. ఈ క్రమంలో స్లాబు పైన ప్రహరీ కడుతున్న క్రమంలో గురువారం పక్కకు ఒరిగిన గోడ ఒక్కసారిగా అక్కడ పనిచేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన కూలీలపై కూలింది. దాంతో ఐదుగురు కూలీలు కిందకు పడిపోయారు. ఈ ఘటనలో సంతోష్(23), సోనీ(19) అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా సోనియా బద్నాయక్(18) చనిపోయాడు. మిగతా ఇద్దరు బలరాం, బుధ బద్నాయక్‌లో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. వారిని దగ్గరలోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. స్థలానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డబ్బు సంపాదన యావలో పడి అనుమతులకు మించి భవన నిర్మాణాలు చేపడుతున్న వారి పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

**మరో ఘటనలో బాలుడు..**

3వ అంతస్థుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాసూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సూరారం రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న కనకరత్నం కుమారుడు తులసినాథ్(10) సమీపంలోని పాఠశాలలో చదువుతున్నాడు. గురువారం కృష్ణాష్టమి సెలవు కావడంతో ఇంటి దగ్గర ఉన్న బాలుడు స్నేహితులతో కలిసి 29వ బ్లాక్ 3వ అంతస్థులో ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి మృతితో సూరారం రాజీవ్ గృహకల్పలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సూరారం పోలీసులు.. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

## నేడు మీడియా స్వేచ్ఛపై ఎం-20 సదస్సు

**న్యూఢిల్లీ :** జీ-20 దేశాలలోని మీడియా సంస్థలు ఒకే రకమైన సమస్యలను, అవరోధాలను ఎదుర్కొంటున్నాయి. అయితే వీటిపై ఆయా దేశాల ప్రభుత్వాలు కనీసం చర్చించేందుకు సైతం సుముఖత చూపడం లేదు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో శుక్రవారం నాడు మీడియా స్వేచ్ఛపై ఎం-20 సదస్సును ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. మన దేశానికి చెందిన 11 మంది సంపాదకులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో కూడిన నిర్వాహక కమిటీ ఈ సదస్సును ఏర్పాటు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన పాత్రికేయులు ఈ సదస్సులో భాగస్వాములవుతారు. ఇప్పటికే మహిళలపై డబ్ల్యూ-20, పౌర సమాజంపై సీ-20, వ్యాపారంపై బీ-20, వాతావరణ మార్పుపై సీ-20 పేరిట సదస్సులు జరుగుతున్నాయి. జీ-20 దేశాధినేతలు మీడియా స్వేచ్ఛపై చర్చించేందుకు ముందుకు రావడం లేదు. ఎందుకంటే వారికి పత్రికా స్వేచ్ఛపై గౌరవం లేదు. ఈ నేపథ్యంలోనే ఆయా దేశాలలోని మీడియా సంస్థల ప్రతినిధులు ఒక్క తాటిపైకి వచ్చి, తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు సిద్ధపడ్డారు. మన దేశంలో జర్నలిజంను నేరపూరితం చేసే కుట్రలో భాగంగా చట్టాన్ని దుర్వినియోగం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కాశ్మీర్‌కు చెందిన న్యూస్ పోర్టల్ 'కాశ్మీర్ వాలా' సంపాదకుడిని ఒక సంవత్సర కాలం నుండి జైలులో నిర్బంధించారు. ఓ కథనాన్ని రాసినందుకు 'మారియన్ కౌంటీ రికార్డ్' సంస్థపై దాడి చేసి కంప్యూటర్లు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. జీ-20 దేశాలలో స్వతంత్ర వార్తా సంస్థల మనుగడ అసాధ్యంగా కన్పిస్తోంది. నిఘా పరికరాల సాయంతో పాత్రికేయుల కదలికలపై కన్నేసి ఉంచుతున్నారు. అమెరికాలో జూలియన్ అసాంజే పైన, ఫిన్లాండ్‌లో హెల్సింగిన్ సాలోమట్ సంపాదకుడి పైన వేధింపులు మితిమీరాయి. మరోవైపు గూగుల్, మేటా, ఎక్స్ వంటి బడా సాంకేతిక సంస్థల నుండి పోటీ పెరుగుతోంది. అసత్య వార్తలు, సమాచారం వ్యాప్తి చెందుతున్నాయి. ఈ సమస్యలన్నింటి పైన ఎం-20 సమావేశంలో చర్చిస్తారు. దేశంలో పత్రికా స్వేచ్ఛ కనుమరుగవుతోందని హిందూ పత్రిక పబ్లిషింగ్ గ్రూప్ డైరెక్టర్ ఎన్.రామ్ తెలిపారు. ఐటీ చట్టానికి, డిజిటల్ మీడియా మార్గదర్శకాలకు సవరణలు చేయడంతో ఏ వార్తనైనా అడ్డుకునేందుకు ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు సంక్రమించాయని విమర్శించారు.

## ఏడుపాయల సాక్షిగా..మెదక్ బీఆర్‌ఎస్‌లో కొట్లాట

(మొదటిపేజీ తరువాయి)

చూసుకోవాలి.. ఏడుపాయల దుర్గమ్మ బంగారం విషయంలో అవినీతి జరిగింది. ఈవో శ్రీనివాస్‌ను దేవేందర్‌రెడ్డి కాపాడుతున్నారు. భూ ఆక్రమణలు చేశారు. మెదక్ అభ్యర్థి విషయంలో సీఎం పునరాలోచన చేయాలి. మేం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతం. మాలో ఒకరు రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తం" ఇదీ..! బీఆర్‌ఎస్ అసమ్మతి నేతల హెచ్చరికలు..

"నదిలో తడిబట్ట స్నానం చేసి అమ్మవారి సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్న. నేను పైసా అవినీతి చేయలే. ఏడుపాయల ఈఓ విషయంలో నేనెందుకు వెనకేసుకొస్తా.. బంగారం విషయం నాకు తెల్వదు. నేను అవినీతికి పాల్పడుతున్నట్టు ఓ ఉన్నతాధికారి సీఎంకు నివేదిక ఇచ్చినట్టు తప్పుడు ప్రచారం చేశారు. అది అబద్ధం. సోషల్ సర్వీస్ పేర చేసేది చారాణ.. చెప్పుకునేది బారాణ.. మేమూ సర్వీస్ చేస్తున్నాం. ఎక్కడా చెప్పుకోం. నా పై కుట్రతోనే తప్పుడు ఆరోపణలు, ప్రచారాలు. వీటిని ప్రజలు గమనిస్తున్నారు" ఇదీ.. దేవేందర్‌రెడ్డి చేసిన ప్రమాణం.

బీఆర్‌ఎస్‌లో గ్రూపు రాజకీయాల తంతు ముదిరిపాకాన పడింది. మెదక్ ఎమ్మెల్యే పద్మకు మూడోసారి టికెట్ ఇవ్వడంతో ఆ పార్టీలోని కొందరు నాయకులు సీఎం జాబితా ప్రకటించిన రోజు నుంచే అసమ్మతి గళం వినిపిస్తున్నారు. ఆమె అభ్యర్థిత్వాన్ని మార్చాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అసమ్మతి గళం వినిపిస్తున్న నాయకులంతా ఏడాది క్రితం వరకు పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులుగా పనిచేశారు. నియోజకవర్గంలో మైనంపల్లి హనుమంతరావు కొడుకు రోహిత్ సేవా కార్యక్రమాల పేరిట ఎంట్రీ ఇవ్వడంతో పద్మాదేవేందర్‌రెడ్డి పట్ల అసంతృప్తిగా ఉన్న నాయకులంతా మైనంపల్లికి దగ్గరయ్యారు. మైనంపల్లి రోహిత్‌కే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. సీఎం మాత్రం పద్మకే టికెట్ ప్రకటించడంతో అసమ్మతి గ్రూపు మరింత దూరమైంది. పద్మాదేవేందర్‌రెడ్డి వర్సెస్ మైనంపల్లి ఆధిపత్య పోరు రచ్చకెక్కింది.

**కొట్లాటకు వేదికైన ఏడుపాయల దేవాలయం**

మెదక్ పట్టణ సమీపంలో ఉన్న ఏడుపాయల వనదుర్గాభవానీ దేవాలయం కేంద్రంగా బీఆర్‌ఎస్‌లో రెండు గ్రూపుల మధ్య కొట్లాట నడుస్తోంది. దేవాలయానికి సంబంధించిన రూ.2 కోట్ల విలువైన బంగారం, 100 కిలోల వెండి హుండీలో భక్తులు వేశారు. రెండేండ్ల క్రితం హుండీలో వేసిన ఆభరణాలను కరిగించేందుకు తరలించిన విషయం వివాదంగా మారింది. ఈవో శ్రీనివాసరావు పాలక మండలికి చెప్పకుండా తరలించడం, బ్యాంకు సమయం దాటిపోవడంతో తన ఇంటికి తీసుకెళ్లడంతో ఏదో తప్పు జరిగిందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. బంగారం, వెండి ఆభరణాల విషయంలో తప్పు జరిగినట్టు నిర్ధారణ కాకపోయినా దాన్ని ఆసరా చేసుకుని బీఆర్‌ఎస్‌లోని అసమ్మతి నాయకులు ఈవోపై ఆరోపణలు చేశారు. దేవాలయంలో పనులు చేయకున్నా బిల్లులు తీసుకున్నారంటూ ఆరోపణలు చేస్తూనే ఈవోకు ఎమ్మెల్యే భర్త దేవేందర్‌రెడ్డికి లింకు పెడుతూ ఆరోపణలు చేశారు. సీఎం ఆఫీస్ నుంచి పైరవీ చేసి ఈవోను దేవేందర్‌రెడ్డి కాపాడుకొస్తూ అవినీతిని ప్రోత్సహిస్తున్నారని వ్యాఖ్యానించారు. దేవేందర్‌రెడ్డి అవినీతి చేయలేదని నిరూపించుకునేందుకు అమ్మవారి వద్దకొచ్చి ప్రమాణం చేసి చెప్పాలని సవాల్ విసిరారు. సవాల్‌ను స్వీకరించిన దేవేందర్‌రెడ్డి.. ఏడుపాయల నదిలో స్నానం చేసి దేవాలయంలో పూజలు చేశారు. ప్రమాణ పూర్వకంగా తాను ఎలాంటి అవినీతి చేయలేదనీ, దేవాలయ ఆభరణాల గురించి తెల్వదనీ ప్రకటించారు. దేవాలయం పెద్దది అయినందున అసిస్టెంట్ కమిషనర్ స్థాయి ఈవో కావాలని తానే పాలక మండలికి చెప్పి తీర్మానం చేయించి దేవాదాయ శాఖలో ఇచ్చినట్టు తెలిపారు. ఏసీ స్థాయి అధికారి రావాలని కోరిన తాను.. ఈఓను ఎందుకు కాపాడుతానని స్పష్టం చేశారు. ఆ తర్వాత అసమ్మతి నాయకులు వందలాది మంది మద్దతుదారులతో దేవాలయం వద్దకు చేరుకున్నారు. పసుపు బట్టలు ధరించి అమ్మవారి ముందు దేవేందర్‌రెడ్డి చేసిన అవినీతికి సంబంధించిన కొన్ని ఆధారాలంటూ అక్కడ పెట్టారు. ఆయన సంగతి అమ్మవారే చూసుకుంటారంటూ సవాళ్లు విసిరారు. పద్మను మార్చకపోతే తాము బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతూ రెబల్‌గా పోటీ చేస్తామని ప్రకటించారు.

**మైనంపల్లి వర్సెస్ పద్మాదేవేందర్‌రెడ్డి**

మెదక్‌లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వర్సెస్ మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మధ్య వార్ నడుస్తోంది. ఇద్దరూ మెదక్‌కు చెందిన నాయకులే. ఒకే పార్టీలో వేర్వేరు జిల్లాల నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో మెదక్ నుంచి తన కొడుకు రోహిత్‌క్ టికెట్ ఇవ్వాలని హన్మంతరావు పట్టుపట్టారు. సీఎం మాత్రం పద్మకే టికెట్ ఇవ్వడంతో తీవ్ర స్థాయిలో మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేసిన మైనంపల్లి ప్రస్తుతం దేవేందర్‌రెడ్డిని టార్గెట్ చేశారు. ఆయన అనుచరులతో అసమ్మతి గళం వినిపిస్తూనే దేవేందర్‌రెడ్డి అవినీతి పరుడంటూ పలు ఆరోపణలు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యే భర్తపై అవినీతి ఆరోపణలు చేస్తుండటంతో నియోజకర్గంలోని బీఆర్‌ఎస్ శ్రేణులు ఆయోమయానికి గురవుతున్నారు.

**అసమ్మతి నాయకులంతాం ఒకప్పుడు దేవేందర్‌రెడ్డి అనుచరులే**

మెదక్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లో అసమ్మతి గళం వినిపిస్తున్న అసమ్మతి నాయకులంతా గతంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అనుచరులే కావడం విశేషం. ఎమ్మెల్యే పీఆర్‌ఓగా చేసిన అడ్వకేట్ జీవన్‌రావు, పాపన్నపేట ఎంపీపీ ప్రశాంత్‌రెడ్డి, చిన్న శంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంగా నరేందర్ మరికొందరు చాలా కాలం పాటు పద్మదేవేందర్‌రెడ్డి అనుచరులుగా ఉన్నారు. పదవులు, కాంట్రాక్టులు, భూముల వ్యవహారాల్లో తేడాలు రావడంతో వీరంతా ఒక్కొక్కరుగా దేవేందర్‌రెడ్డికి దూరమవుతూ వచ్చారని తెలిసింది. నియోజకవర్గంలో ఎమ్మెల్యేను కాదని బయటపడలేదు. మైనంపల్లి రోహిత్ నియోజకవర్గంపై కేంద్రీకరించి పనిచేయడంతో అసంతృప్తితో ఉన్న వాళ్లంతా ఒక్కసారిగా దేవేందర్‌రెడ్డికి దూరమయ్యారు. కోనాపూర్ సొసైటీలో రూ.2.50 కోట్ల అవినీతి జరిగిందని, చిన్న శంకరంపేటలో భూముల అక్రమాలకు పాల్పడుతున్నారంటూ దేవేందర్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ వచ్చారు. తాజాగా ఏడుపాయల ఆభరణాల వ్యవహారంతో మరింత రచ్చ రచ్చ అయ్యింది.

## 12న మరో వంద మహిళా ఆరోగ్య క్లినిక్స్

(మొదటిపేజీ తరువాయి)

పారదర్శకంగా పూర్తిచేయాలని మంత్రి టీ హరీశ్‌రావు అధికారుల్ని ఆదేశించారు. అలాగే ఈనెల 15వ తేదీ మరో 9 మెడికల్ కళాశాలల్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రారంభిస్తారనీ, దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ ఏడాది కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం మెడికల్ కాలేజీలు కొత్తగా ప్రారంభమవుతున్నాయనీ, వాటిలో చేరే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి హరీశ్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ చైర్మెన్ సుధాకర్‌రావు, హెల్త్ సెక్రెటరీ రిజ్వి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రమేష్‌రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ జీ శ్రీనివాసరావు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, కాళోజీ వర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ వైద్య విద్యను తెలంగాణ విద్యార్థులకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. గతేడాది 8 కాలేజీలు ప్రారంభం కాగా, ఈనెల 15న మరో 9 మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 26 కు చేరుతుందనీ, కొత్తగా 900 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. దీనితో మొత్తం సీట్ల సంఖ్య 3,915కు పెరిగిందని చెప్పారు.

**ప్రగతిభవన్లో మేఘాలయ సీఎం**

రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా, గురువారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంగ్మాను సీఎం కేసీఆర్ సాదరంగా ఆహ్వానించి, తేనీటివిందు ఆతిథ్యం ఇచ్చారు. ఇరువురు ముఖ్యమంత్రులు కొంతసేపు ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకున్నారు. తిరుగుప్రయాణమైన సంగ్మాకు సీఎం కేసీఆర్ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఎందుకీ ఆర్భాటం?

(మొదటిపేజీ తరువాయి)

తల దాచుకుంటున్నారు. పేవ్‌మెంట్లపై వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుంటాయి. మురికివాడలు, అనుమతి లేని నివాస గృహాలను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తున్నారు. జీ-20 సదస్సును ఘనంగా నిర్వహించే పేరుతో మూడు లక్షల మంది వీధి వ్యాపారులను ఖాళీ చేయించారు' అని గార్డియన్ పత్రిక తెలిపింది.

అధికారులు తమకు అసౌకర్యంగా ఉన్న వాస్తవాలను మరుగుపరచేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమైన విషయమని అని 'ప్రాజెక్ట్ సిండికేట్' రాసింది. భారతదేశంలో మందగిస్తున్న అభివృద్ధి, పెరుగుతున్న అసమానతలు, సన్నగిల్లుతున్న ఉద్యోగావకాశాలు వంటి వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారని వ్యాఖ్యానించింది. భారత్‌లో ఆర్థిక అసమానతలు చాలా ఎక్కువగా ఉన్నాయని 'టెలిగ్రాఫ్' పత్రిక ఎత్తిచూపింది. విద్యా ప్రమాణాలు దారుణంగా పడిపోతున్నాయని, పౌష్టికాహార లోపంతో చిన్నారులు అనారోగ్యాలకు లోనవుతున్నారని తెలిపింది.

## 18 నుంచి గణేశ్ ఉత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

చేసే అవకాశముందని పోలీస్ అధికారులు ఓ అంచనాకు వచ్చారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మూడు కమిషనరేట్ల పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గణేశ్ ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం(సీసీసీ)లో నగర సీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రా, నగర అదనపు సీపీ, ట్రాఫిక్ కమిషనర్ సుధీర్‌బాబు పాల్గొన్నారు. ఉత్సవాల ఏర్పాట్లు, భద్రతపై చర్చించారు. గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉత్సవాలపై గత అనుభవాలను వెల్లడించారు. పలు అభిప్రాయాలు, సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఉత్సావాలపై కోర్టు ఆదేశాలను పాటించాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.


గణేశ్ నిమజ్జనం జరిగే చెరువు, కట్టల వద్ద టెంట్లు, విద్యుత్ లైట్లు, బారికేడ్లను ఏర్పాటు చేయాలని, మంచి నీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహాల ప్రతిష్టాపన వివరాలు, ఎవరు ఏర్పాటు చేస్తున్నారు, మండపాల వద్ద సభ్యులు ఎంతమంది ఉంటారు, ఎలాంటి వాహనాలను ఉపయోగిస్తున్నారు అనే తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ట్రై పోలీస్ కమిషనర్లు అభిప్రాయపడ్డారు. గణేశ్ నిమజ్జనం ప్రణాళిక ప్రకారం జరగాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సూచించారు. విగ్రహాల ప్రతిష్టాపన విషయంలో నిర్వాహకులతో, సీఐ స్థాయి అధికారి ముందుగానే సమావేశమై సమీక్షించాలన్నారు. గణేశ్ వేడుకల్లో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రానివ్వవద్దని, ఈ విషయంలో అందరూ సమిష్టిగా కృషి చేయాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ప్రత్యేక భద్రతతోపాటు అదనంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు.

రోడ్ల మరమ్మతులతోపాటు రహదారులకు అడ్డుగావున్న చెట్ల కొమ్మలను తొలగిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పారు. బేబీ పాండ్‌లు, చెరువుల పూడికతీత తదితర చర్యలు వెంటనే చేపడ్తామని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పారు. క్రేయిన్లు, మొబైల్ టాయిలెట్ల సౌకర్యాలు, నిరంతర విద్యుత్‌పై బస్సు సౌకర్యం, ఇతర అంశాలపై ఆయా శాఖల అధికారులు వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో రాచకొండ డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోజ్, భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంతరావు, ఖైరతాబాద్ గణేష్ సమితి ప్రతినిధులు, విద్యుత్‌శాఖ, అగ్నిమాపక, ఆర్టీ, వాటర్ వర్క్స్, హెచ్ఎండీఏ, నీటిపారుదల, మెట్రో అధికారులు పాల్గొన్నారు.

# సెమీస్‌కు అల్కరాజ్‌, మెద్వదెవ్‌

**• యుఎస్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ**



**న్యూయార్క్‌:** యుఎస్‌ ఓపెన్‌ గ్రాండ్‌స్లామ్‌ టోర్నీ పురుషుల సింగిల్స్‌ సెమీఫైనల్లోకి టాప్‌సీడ్‌, స్పెయిన్‌కు చెందిన కార్లోస్‌ అల్కరాజ్‌, 3వ సీడ్‌, రష్యాకు చెందిన డానియేల్‌ మెద్వదెవ్‌ ప్రవేశించారు. గురువారం జరిగిన క్వార్టర్‌ ఫైనల్లో అల్కరాజ్‌.. 6-3, 6-2, 6-4 తేడాతో 12వ సీడ్‌, జర్మనీకి చెందిన అలెగ్జాండర్‌ జ్వెరేవ్‌ను వరుససెట్లలో చిత్తుచేశాడు. ఈ మ్యాచ్‌ సుమారు 2 గంటల 30 నిమిషాలపాటు సాగింది. అల్కరాజ్‌ ఆదినుంచి ఆధిపత్యం కనబర్చి వరుస సెట్లలో ఈ మ్యాచ్‌ను ముగించాడు. ఈ మ్యాచ్‌లో భారత మాజీ కెప్టెన్‌ ఎంఎస్‌ ధోనీ సందడి చేశాడు. అతని స్నేహితులతో కలిసి స్టేడియానికి వెళ్లి ప్రత్యక్షంగా వీక్షించాడు. ఆట మధ్యలో అల్కరాజ్‌ కాసేపు విశ్రాంతి తీసుకుని డ్రింక్స్‌ తాగుతుండగా అతడి వెనుకవైపు ప్రేక్షకుల సీట్లలో కూర్చుని ఉన్న ధోనీ తన ఫ్రెండ్స్‌తో ముచ్చటిస్తూ కనిపించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్‌ మీడియాలో హల్‌చల్‌ చేస్తోంది. మరో క్వార్టర్‌ఫైనల్లో మెద్వదెవ్‌ 6-4, 6-3, 6-4తో 8వ సీడ్‌, రష్యాకే చెందిన రుబ్లేవ్‌ను ఓడించాడు. తొలి సెట్‌లో 0-3తో వెనుకబడ్డ మెద్వదెవ్‌ ఆ సెట్‌ను 6-4తో చేజిక్కించుకున్న తీరు అద్భుతం. ఇక మ్యాచ్‌ పాయింట్‌ను గెలిచేందుకు సుమారు ఏడు డ్యూస్‌లను ఎదుర్కొని మరీ మ్యాచ్‌ను ముగించాడు.

# సుతీర్థ ముఖర్జీ సంచలనం

**• 40వ ర్యాంకర్‌పై గెలుపు**
**• ఆసియా టేబుల్‌ టెన్నిస్‌ ఛాంపియన్‌షిప్‌**



**ప్యాంగ్‌చాంగ్‌(ద.కొరియా):** ఆసియా టేబుల్‌ టెన్నిస్‌(టిటి) ఛాంపియన్‌షిప్‌ మహిళల సింగిల్స్‌లో సుతీర్థ ముఖర్జీ సంచలనం నమోదు చేసింది. తనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న చైనీస్‌ తైపీకి చెందిన సు-యు-చెన్‌ను చిత్తుచేసి రౌండ్‌-32కు ప్రవేశించింది. గురువారం జరిగిన రౌండ్‌-64 మహిళల సింగిల్స్‌ పోటీలో ప్రపంచ 104వ ర్యాంకర్‌ సుతీర్థ ముఖర్జీ 40వ ర్యాంకర్‌పై 10-21, 11-8, 11-7, 11-7తో గెలిచింది. ఇక భారత్‌కే చెందిన మనిక బత్రాకు తొలిరౌండ్‌లో వాకోవర్‌ లభించింది. మరో పోటీలో అహితా ముఖర్జీ 11-2, 11-0, 11-1తో నేపాల్‌కు చెందిన సువాల్‌ సిక్కాపై నెగ్గింది. ఇక స్టార్‌ టిటి ప్లేయర్‌ శ్రీజ ఆకుల 5-11, 6-11, 9-11తో 8వ ర్యాంకర్‌ మిమా ఇటో(జపాన్‌) చేతిలో, దియా ఛితాలే 3-11, 6-11, 8-11తో 2వ ర్యాంకర్‌ చైనాకు చెందిన చెన్‌ మెంగ్‌ చేతిలో ఓడారు. ఇక మహిళల డబుల్స్‌లో అహితా-సుతీర్థ 11-1, 13-11, 10-12, 11-7తో కజకిస్తాన్‌ జంటను ఓడించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. ఇక పురుషుల జట్టు కాంస్య పతక పోటీలో ఓటమిపాలై నిరాశపరిచారు.

## యూఎస్‌ ఓపెన్‌ విజిటర్స్‌ గ్యాలరీలో ధోనీ..



**న్యూయార్క్‌ :** భారత మాజీ కెప్టెన్‌ మహేంద్ర సింగ్‌ ధోనీ తన అభిమాన ఆటగాడిని చూసేందుకు అమెరికా వెళ్లాడు. అక్కడ జరుగుతున్న యూఎస్‌ ఓపెన్‌ విజిటర్స్‌ గ్యాలరీలో కూర్చొని వరల్డ్‌ నంబర్‌ 1 కార్లోస్‌ అల్కరాజ్‌ మ్యాచ్‌ను ఎంజాయ్‌ చేశాడు. అవును.. మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ నిన్న యూఎప్‌ ఓపెన్‌లో సందడి చేశాడు. తన ఫేవరెట్‌ ప్లేయర్‌ అయిన అల్కరాజ్‌ గేమ్‌ చూసి మురిసిపోయాడు. దాంతో, 'ఈ దిగ్గజ క్రికెటర్‌ అల్కరాజ్‌ ఫ్యాన్‌' అంటూ సోషల్‌ మీడియాలో కొందరు కామెంట్లు పెడుతున్నారు.

మాజీ చాంపియన్‌గా ఈ టోర్నీలో బరిలోకి దిగిన అల్కరాజ్‌ దుమ్మురేపుతున్నాడు. నిన్న జరిగిన పురుషుల సింగిల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో అలెగ్జాండర్‌ జ్వెరెవ్‌ను ఓడించాడు. హెూరాహెూరీ జరిగిన పోరులో 6-3, 6-2, 6-4తో జ్వెరెవ్‌ను మట్టి కరిపించి వరుసగా రెండో సారి సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. ఫైనల్‌ చేరి వరుసగా రెండో టైటిల్‌ గెలవాలనుకుంటున్న అతడికి డానిల్‌ మెద్వెదేవ్‌ రూపంలో బలమైన ప్రత్యర్థి ఎదురుపడనున్నాడు.



# సిద్ధమవుతున్న టీమిండియా

**• పాక్‌తో 10న మ్యాచ్‌**
**• పేస్‌ బౌలింగ్‌పైనే ప్రధాన దృష్టి**

**కొలంబో:** ఆసియా కప్‌లో భారత జట్టు పాకిస్తాన్‌తో కీలక పోరుకు సిద్ధమవుతోంది. ఆదివారం కొలంబో వేదికగా జరిగే సూపర్‌ 4 మ్యాచ్‌లో విజయంపై కన్నేసిన టీమిండియా.. ప్రధానంగా పేస్‌ బౌలింగ్‌పైనే దృష్టి సారించింది. గురువారం వర్షం పడడంతో భారత క్రికెటర్లు ప్రాక్టీస్‌ను ఇండోర్‌ స్టేడియంలో సాధన చేశారు. కొలంబోలో గురువారం ఉదయం నుంచే వర్షం ప్రారంభమైంది. దాంతో, అందరూ ఇండోర్‌లో చెమటోడ్చి ప్రాక్టీస్‌ చేశారు. తొలి రెండు మ్యాచ్‌లకు దూరమైన కేఎల్‌ రాహుల్‌ కూడా బ్యాటింగ్‌ చేశాడు. అతడితో పాటు విరాట్‌ కోహ్లీ, సూర్యకుమార్‌ యాదవ్‌ బ్యాటింగ్‌ ప్రాక్టీస్‌ చేస్తున్న ఫొటోలను బీసీసీఐ ట్విటర్‌లో పోస్ట్‌ చేసింది. హెడ్‌ కోచ్‌ రాహుల్‌ ద్రవిడ్‌.. బ్యాటింగ్‌ కోచ్‌ విక్రం రాథోడ్‌.. సూర్యకుమార్‌, శుభ్‌మన్‌ గిల్‌కు సలహాలిస్తూ కనిపించారు. సూపర్‌ 4లో భాగంగా సెప్టెంబర్‌ 10న భారత్‌, పాకిస్తాన్‌ జట్లు తలపడనున్నాయి. ఇరుజట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌ వర్షం కారణంగా తుడిచిపెట్టుకుపోవడంతో ఈసారి హోరాహోరీ పోరు జరిగేలా ఉంది. ఇక పాకిస్తాన్‌ జట్టు బంగ్లాదేశ్‌పై భారీ విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఇక నేపాల్‌తో మ్యాచ్‌కు దూరమైన జస్ప్రీత్‌ బుమ్రా కూడా పాక్‌తో మ్యాచ్‌కు ఫిట్‌నెస్‌ సాధించే అవకాశముంది.

**అకెర్మన్‌, మెర్వ్‌లకు పిలుపు..**
**వన్డే ప్రపంచకప్‌కు నెదర్లాండ్స్‌ జట్టు ఇదే!**

ఐసిసి వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించిన నెదర్లాండ్స్‌ జట్టులో సీనియర్‌ బ్యాటర్లు అకెర్మన్‌, వాన్‌ డెర్‌ మెర్వ్‌లకు చోటు దక్కింది. నెదర్లాండ్స్‌ క్రికెట్‌ బోర్డు ప్రకటించిన 15మందితో కూడిన జట్టుకు స్కాట్‌ ఎడ్వర్డ్స్‌ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్‌ క్వాలిఫయర్స్‌లో వీరిద్దరూ ఆడలేదు. ఇక తెలుగు రాష్ట్రానికి చెందిన తేజ నిడమనూరుకు నెదర్లాండ్స్‌ ప్రపంచకప్‌ జట్టులో చోటుదక్కింది. ఆల్‌రౌండర్‌ అయిన తేజ.. విజయవాడలో పుట్టి నెదర్లాండ్స్‌ జాతీయ జట్టుకు 2022 నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. జింబాబ్వేలో జరిగిన క్వాలిఫయర్స్‌లో నెదర్లాండ్స్‌ సత్తాచాటింది. సూపర్‌ సిక్స్‌ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై భారీ విజయం సాధించి చివరి బెర్తును సొంతం చేసుకుంది. నెదర్లాండ్స్‌ ప్రపంచకప్‌ ఆడటం ఇది ఐదోసారి. న్యూజిలాండ్‌ జట్టు చివరిసారిగా భారత్‌ వేదికగా జరిగిన 2011 వన్డే ప్రపంచకప్‌లో ఆడింది. ఈ ఏడాది ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌ తన తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌ హైదరాబాద్‌ వేదికగా (అక్టోబర్‌ 6న) జరగనుంది.

నెదర్లాండ్స్‌ జట్టు: స్కాట్‌ ఎడ్వర్డ్స్‌(కెప్టెన్‌), మాక్స్‌ ఓ'డౌడ్‌, బాస్‌ డి లీడే, విక్రమ్‌ సింగ్‌, తేజ నిడమనూరు, పాల్‌ వాన్‌ మీకెరెన్‌, కోలిన్‌ అకెర్మాన్‌, రోలోఫ్‌ వాన్‌ డెర్‌ మెర్వే, లోగాన్‌ వాన్‌ బీక్‌, ఆర్యన్‌ దత్‌, ర్యాన్‌ క్లైన్‌, వెస్లీ బరేసి, సకిబ్‌ జుల్ఫికర్‌, షరీజ్‌ అహ్మద్‌, సిబ్రాండ్‌ ఎంగెల్‌బ్రెచ్ట్‌.




# ఛెత్రీ సేనకు నిరాశ..

**• కింగ్స్‌ కప్స్‌ సెమీస్‌లో ఇరాక్‌ చేతిలో ఓటమి**



**చింగ్‌మై(థాయ్‌లాండ్‌):** కింగ్స్‌కప్‌-2023 సెమీస్‌లో ఛెత్రీ సేనకు నిరాశ తప్పలేదు. ఈ ఏడాది హ్యాట్రిక్‌ ట్రోఫీలతో జోరుమీదున్న భారత ఫుట్‌బాల్‌ జట్టుకు కింగ్స్‌ కప్‌లో షాక్‌ తగిలింది. గురువారం జరిగిన సెమీస్‌లో భారతజట్టు పెనాల్టీ షూటౌట్‌లో ఇరాక్‌ చేతిలో ఓటమిపాలైంది. థాయ్‌లాండ్‌ స్టేడియం 700వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆట కీలక దశలో ఇరాక్‌ ఆటగాడు జిందాన్‌ ఇక్బాల్‌ రెడ్‌ కార్డ్‌ కారణంగా మైదానం వీడాడు. దాంతో ఆ జట్టు పది మంది ఆటగాళ్లతోనే మిగతా మ్యాచ్‌ను పూర్తిచేసింది. నిర్ణీత సమయం పూర్తయ్యే సరికి ఇరుజట్లు 2-2గోల్స్‌తో సమంగా నిలిచాయి. అనంతరం పెనాల్టీ షూటౌట్‌లో 5-4గోల్స్‌ తేడాతో ఇరాక్‌ చేతిలో ఓటమిపాలైంది. పెనాల్టీ తొలి గోల్‌ను కొడ్డంలో భారత స్ట్రయికర్‌ బ్రాండన్‌ విఫలమయ్యాడు. ఇరాక్‌ ఐదు గోల్స్‌ చేయగా.. భారత్‌ నాలుగు గోల్స్‌ మాత్రమే చేసింది. దీంతో సొంత గడ్డపై జరిగిన ముక్కోణపు టోర్నమెంట్‌, ఇంటర్‌ కాంటినెంటల్‌ కప్‌, శాఫ్‌ చాంపియన్‌షిప్స్‌లో విజేతగా నిలిచింది. కెప్టెన్‌ సునీల్‌ ఛెత్రీ అద్భుత ప్రదర్శనకు తోడూ యువ ఆటగాళ్లు రాణించడంతో ఈ ఏడాది భారత జట్టు వరుస విజయాలు సాధించింది. అంతేకాదు ఫిఫా ర్యాంకింగ్స్‌లో 100లోపు నిలిచింది. ఈ సీజన్‌లో టీమిండియా ఫైనల్‌ చేరకపోవడం ఇదే మొదటిసారి. రెండో సెమీస్‌ లెబనాన్‌-థాయ్‌లాండ్‌ జట్ల మధ్య మ్యాచ్‌ జరగనుంది.

## రేపటి నుంచి రాష్ట్ర ఎలైట్‌ చెస్‌ టోర్నీ

**• ముఖ్య అతిథులుగా సాట్స్‌ చైర్మన్‌, డీజీపీ**



**హైదరాబాద్‌:** రాష్ట్ర చెస్‌ అసోసియేషన్‌, దక్కన్‌ క్లబ్‌ సికింద్రాబాద్‌ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎలైట్‌ ఇన్విటేషన్‌ చెస్‌ టోర్నీకి తెరలేవనుంది. రెండు రోజుల పాటు దక్కన్‌ క్లబ్‌లో జరిగే చెస్‌ టోర్నీని సాట్స్‌ చైర్మన్‌ ఆంజనేయగౌడ్‌, డీజీపీ అంజనికుమార్‌ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. క్లబ్‌ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌ మాట్లాడుతూ 'వంద ఏండ్లకు పైగా చరిత్ర కల్గిన దక్కన్‌ క్లబ్‌ అనేక క్రీడా ఔత్సాహిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఈ నెల 9, 10 తేదీల్లో చెస్‌ టోర్నీ ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో ప్రముఖ ప్లేయర్లు సుమీర్‌ హర్ష, పవన్‌ కార్తికేయ, ఆదర్శ్‌, సహస్ర, భవిష్య, సరయు, అభిరామి, సంహిత, అంకిత్‌గౌడ్‌ పోటీపడుతున్నారు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో చెస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్‌ ప్రసాద్‌, క్లబ్‌ కార్యదర్శి శ్యామ్‌, ఉపాధ్యక్షుడు ముకేశ్‌, స్పోర్ట్స్‌ కమిటీ చైర్మన్‌ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# నవచిత్రం

## అక్టోబర్‌ 6న రిలీజ్‌


'మామా మశ్చీంద్ర'లో సుధీర్‌బాబు

సుధీర్‌ బాబు త్రిపాత్రాభినయంతో అలరించబోతున్న చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్‌ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్‌ ఎల్‌ఎల్‌పిపై నిర్మాతలు సునీల్‌ నారంగ్‌, పుస్కుర్‌ రామ్‌ మోహన్‌ రావు నిర్మిస్తున్నారు. అక్టోబర్‌ 6న ఈ సినిమాని విడుదల చేయబోతున్నట్టు మేకర్స్‌ అనౌన్స్‌ చేశారు. ఇందులో స్థూలకాయుడు, ఓల్డ్‌ డాన్‌, డిజె ..ఇలా మూడు భిన్నమైన పాత్రలను సుధీర్‌ బాబు చేస్తున్నారు. మిర్నాళిని రవి, ఈషా రెబ్బా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్‌ సోనాలి నారంగ్‌, సృష్టి సమర్పిస్తున్నారు.

## మెప్పించే పొలిటికల్‌ ఎంటర్‌టైనర్‌


అభయ్‌ నవీన్‌, సిద్ధార్థ్‌

అభయ్‌ నవీన్‌ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'రామన్న యూత్‌'. ఫైర్‌ ఫ్లై ఆర్ట్స్‌ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలకు సిద్ధమవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో సిద్ధార్థ్‌ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఒక కథను కాకుండా అభయ్‌ తన లైఫ్‌లో చూసిన ఊరి అనుభవాలను తెరకెక్కించాడు. ట్రైలర్‌ చాలా బాగుంది. అలాగే ఫన్‌ వెనక ఒక ఎమోషన్‌ ఉంది' అని తెలిపారు.'ఒక ఊరిలో రాజకీయ నాయకుడిగా ఎదగాలని రాజు అనే యువకుడు చేసిన ప్రయత్నాలు అతని జీవితాన్ని ఎలా మార్చాయి అనేది సినిమాలో ఆకట్టుకునేలా చూపిస్తున్నాం. విలేజ్‌ బ్యాక్‌ డ్రాప్‌లో సాగే పొలిటికల్‌ ఎంటర్‌టైనర్‌ ఇది. మా సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అభయ్‌ నవీన్‌ అన్నారు.

## ఎవరూ చూపించని అంశాలతో రుద్రంకోట


అనిల్‌ కుమార్‌, విభీష

సీనియర్‌ నటి జయలలిత సమర్పకులుగా వ్యవహరిస్తూ ఓ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రుద్రంకోట'.

ఏఆర్‌ కె విజువల్స్‌ పతాకంపై రాము కోన దర్శకత్వంలో అనిల్‌ ఆర్కా కండవల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

అనిల్‌, విభీష, రియా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు.

సినిమా విడుదలకు సిద్ధమైన సందర్భంగా హీరో, నిర్మాత అనిల్‌ ఆర్క కండవల్లి మాట్లాడుతూ, 'శ్మశాన వాటికలో పెరిగి పెద్దైన ఓ యువకుడి ప్రేమకథా చిత్రమిది. భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో కథ నడుస్తుంది. ఇప్పటి వరకు ఎవరూ చూపించని అంశాలను మా చిత్రంలో చూపిస్తున్నాం. ఇందులో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలుంటాయి. జయలలిత సమర్పకులుగా వ్యవహరిస్తూ ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించారు. సంగీత దర్శకులు కోటి మా చిత్రానికి అద్భుతమైన బ్యాక్‌ గ్రౌండ్‌ స్కోర్‌ అందించారు. సుభాష్‌ ఆనంద్‌ అందించిన రెండు పాటలు ఇప్పటికే విడుదలై ప్రజాదరణ పొందాయి. ఇటీవల సెన్సార్‌ పూర్తయ్యింది. యు/ఏ సర్టిఫికెట్‌తో పాటు సినిమా బావుందంటూ సెన్సార్‌ సభ్యులు ప్రశంసించారు. మా సినిమా నచ్చడంతో స్కీన్‌ మాక్స్‌ పిక్చర్స్‌ ఈనెల 22న విడుదల చేస్తున్నారు' అని తెలిపారు.

## ఉస్తాద్‌.. నయా షెడ్యూల్‌ షురూ..

పవన్‌ కళ్యాణ్‌, హరీష్‌ శంకర్‌ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్‌ 'ఉస్తాద్‌ భగత్‌ సింగ్‌'.

మైత్రీ మూవీ మేకర్స్‌ పతాకంపై నవీన్‌ యెర్నేని, వై.రవిశంకర్‌ రూపొందిస్తున్న ఈ చిత్రంలో హీరో ఉపయోగించే ఆయుధాల న్నింటినీ రివీల్‌ చేస్తూ ఇటీవల దర్శకుడు హరీష్‌ శంకర్‌ ఒక పోస్టర్‌ను షేర్‌ చేసిన సంగతి తెలిసిందే. ఇక గురువారం పవన్‌ కళ్యాణ్‌ షూట్‌లో జాయిన్‌ అయ్యారు. మాసీవ్‌ యాక్షన్‌ సీక్వెన్స్‌తో కొత్త షెడ్యూల్‌ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మేకర్స్‌ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ షెడ్యూల్‌ కోసం ప్రొడక్షన్‌ డిజైనర్‌ ఆనంద్‌ సాయి అండ్‌ టీమ్‌ మాసీవ్‌ సెట్‌ని రూపొందించారు.

మాస్‌ పల్స్‌ తెలిసిన దర్శకుడు హరీష్‌ శంకర్‌ మరోసారి మాస్‌ను మెప్పించే సబ్జెక్ట్‌ను ఎంచుకున్నారు. పవన్‌ కళ్యాణ్‌ను మునుపెన్నడూ చూడని మాస్‌ అవతార్‌లో టెర్రిఫిక్‌ పోలీస్‌ ఆఫీసర్‌గా ప్రెజెంట్‌ చేస్తున్నారు. ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలో పవన్‌ సరసన శ్రీలీల నటిస్తోంది. అశుతోష్‌ రానా, నవాబ్‌ షా, కేజీఎఫ్‌ ఫేమ్‌ అవినాష్‌, గౌతమి, నర్రా శ్రీను, నాగ మహేష్‌, టెంపర్‌ వంశీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన -దర్శకత్వం : హరీష్‌ శంకర్‌.ఎస్‌, నిర్మాతలు: నవీన్‌ యెర్నేని, వై.రవి శంకర్‌, స్క్రీన్‌ ప్లే: కె దశరథ్‌, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్‌, డీవోపీ: అయనంక బోస్‌, ఎడిటర్‌: చోటా కె ప్రసాద్‌, అడిషినల్‌ రైటర్‌: సి. చంద్రమోహన్‌, ప్రొడక్షన్‌ డిజైనర్‌: ఆనంద్‌ సాయి, ఫైట్స్‌: రామ్‌ - లక్ష్మణ్‌, ఎగ్జిక్యూటివ్‌ నిర్మాతలు: చంద్రశేఖర్‌ రావిపాటి, హరీష్‌.


పవన్‌కళ్యాణ్‌

## క్రిస్మస్‌ కానుకగా తొలి కిరణం


జాన్‌బాబు

'తొలి కిరణం' చిత్ర దర్శక, నిర్మాత జె.జాన్‌ బాబు పుట్టినరోజు వేడుక బుధవారం చిత్ర యూనిట్‌, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సెన్సార్‌ కార్యక్రమాలు పూర్తి చేసుకొని డిసెంబర్‌ 14.న మా చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నాం. క్రిస్మస్‌ కానుకగా రిలీజ్‌ కాబోతున్న ఈ సినిమా తప్పకుండా అందరిని మెప్పిస్తుంది. అలాగే మా ఏ.వి.ఎం ఆర్ట్స్‌ బ్యానర్‌లో మరో ప్రేమకథా చిత్రాన్ని త్వరలో ప్రారంభిస్తున్నాము' అని అన్నారు ఈ చిత్రానికి సంగీతం : ఆర్‌.పి పట్నాయక్‌, సాహిత్యం : చంద్రబోస్‌, నిర్మాత : ఎమ్‌.ఆర్‌.సి నాయుడు, సహ నిర్మాత : బి.సాయి కిరణ్‌.

## భారీ అంచనాలతో..


రామ్‌, శ్రీలీల

రామ్‌, బోయపాటి శ్రీను కాంబోలో తెరకెక్కుతున్న యాక్షన్‌ ఎంటర్‌టైనర్‌ 'స్కంద'- ది ఎటాకర్‌. శ్రీనివాసా సిల్వర్‌ స్క్రీన్‌ నిర్మిస్తున్న ఈ చిత్రం థియేట్రికల్‌ రిలీజ్‌ కోసం బెస్ట్‌ డేట్‌ని మేకర్స్‌ లాక్‌ చేశారు. డెడ్లీ కాంబినేషన్‌లో రూపొందిన ఈ క్రేజీయస్ట్‌ ప్రాజెక్ట్‌ ఈనెల 28న విడుదల కానుంది.'ఈనెల 28న అంటే గురువారం ఈ సినిమా రిలీజ్‌ కానుంది దీంతో లాంగ్‌ వీకెండ్‌ ఈ చిత్రానికి అడ్వాంటేజ్‌ అవుతుంది. అలాగే ఆ తర్వాత సోమవారం (గాంధీ జయంతి) సెలవు. దసరా సెలవులు కూడా కలిసి రాబోతున్నాయి. ఈ రకంగా ఈ హై-బడ్జెట్‌ ఎంటర్‌టైనర్‌కి ఇది పర్ఫెక్ట్‌ డేట్‌. రిలీజ్‌ డేట్‌ పోస్టర్‌లో రామ్‌, శ్రీలీల అందమైన చిరునవ్వులు చింది స్తున్నారు. పంచెకట్టులో రామ్‌ చాలా కూల్‌గా కనిపిస్తుండగా, శ్రీలీల గాగ్రా చోళీలో చాలా అందంగా కనిపిస్తోంది. ఈ సినిమా పాటలు, టీజర్‌, ట్రైలర్‌లకు ట్రెమండస్‌ రెస్పాన్స్‌ వస్తోంది. ట్రైలర్‌ విడుదలయ్యాక క్రేజ్‌ మరింత పెరిగింది. ఈ సినిమా రామ్‌కి మోస్ట్‌ ఎక్స్‌పెన్సీవ్‌ సినిమా. ఈ చిత్ర ప్రీ-రిలీజ్‌ బిజినెస్‌లో కూడా రికార్డ్‌ సృష్టించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్‌ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## చాలా బాగుందే..

రాజ్‌ తరుణ్‌ హీరోగా, ఎ ఎస్‌ రవికుమార్‌ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. సురక్ష్‌ ఎంటర్‌టైన్‌మెంట్‌ మీడియా బ్యానర్‌ పై మల్కాపురం శివకుమార్‌ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్‌ ఈ చిత్ర మ్యూజికల్‌ ప్రొమోషన్స్‌ని స్టార్ట్‌ చేశారు. ఇందులో భాగంగా ఈ చిత్రంలోని 'చాలా బాగుందే' పాటని విడుదల చేశారు. మనసుని హత్తుకునే హార్ట్‌ ఫుల్‌ లైఫ్లీ మెలోడీగా ఈ పాటని కంపోజ్‌ చేశారు జేబి. చైతు సత్సంగి, లిప్సిక ఈ పాటని మ్యాజికల్‌గా పాడారు. శ్రీమణి అందించిన సాహిత్యం మరో ఆకర్షణగా నిలిచింది. ఈ పాటలో లీడ్‌ పెయిర్‌ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌ అండ్‌ లవ్లీగా ఉంది. ఈ చిత్రానికి జవహర్‌ రెడ్డి కెమెరా మెన్‌గా పని చేస్తున్నారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886